మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 1 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 296 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

దుంకుతున్నమొసలి..తీక్షణంగా చూసే చిరుత..



2

అమెరికాలో భారత ఓటర్లకు దోశెల వల



2

జ్ఞానేశ్ కుమార్ దిగిపో

ఏఐసీసీ నేతృత్వంలో మాక్ పార్లమెంట్

అగ్రనేతలతో కలిసి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 31, (మనం బ్యూరో): సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అభిశంసిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో ఇండియా కూటమి నేతలు శనివారం సాయంత్రం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో నిర్వహించిన ఈ మాక్ పార్లమెంట్ కు మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. మాక్ పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇండియా కూటమి ఎంపీలు,

...మిగతా 2లో



ఇందిరాగాంధీకి సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 28, (మనం బ్యూరో): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గారి వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలో శక్తి స్థల్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఏఐసీసీ అగ్రనాయకులు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తో కలిసి శక్తి స్థల్ వద్ద నివాళులు సీఎం నివాళులు అర్పించారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం అభినందన

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయి అని ప్రశంసించారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, పర్యవేక్షణ, అత్యవసర సేవల వంటి కీలక రంగాల్లో మెరుగైన సేవలు అందించనుందని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

తస్మాత్ జాగ్రత్త

తెలంగాణకు మరో రెండు రోజులు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

అల్పపీడన ప్రభావంతో నేటి నుంచి నవంబర్ 4 వరకు వానలు కురిసే అవకాశం

3


ఇందిరమ్మ బాటలో ప్రజా ప్రభుత్వం



ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కి

హైదరాబాద్, అక్టోబర్ 31, (మనం బ్యూరో): రాష్ట్రంలో ఇందిరమ్మ బాటలో ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్

...మిగతా 2లో



ఆకాశమంత స్వేచ్ఛ..

నానమ్మను స్మరించుకున్న

రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా

ఢిల్లీ, అక్టోబర్ 31: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక వాద్రాలు తమ నానమ్మ, దివంగత ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు వారి ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ 'దాదీ' ఇందిరా గాంధీ ఫొటోను పంచుకుంటూ '' నీ ఒడిలో కూర్చోవడం, రెండు చేతులను పట్టుకోవడం, మాటలు వినడం, ఆ మాటలను తిరిగి చెప్పడం, ఎంతో అందమైన బహుమతి ఇచ్చావు దాదీ'' అని అన్నారు. ప్రియాంక గాంధీ వాద్రా కూడా నానమ్మతో చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఇందిరా గాంధీ అసాధారణ శక్తి, వ్యక్తిత్వం కలిగిన మహిళగా గుర్తింపు

...మిగతా 2లో

రాప్తాడులో..ఉన్మాది పైశాచికం

విద్యార్థినిపై విద్యుత్ రంపంతో దాడి

పోలీసుల అదుపులో నిందితుడు హేమంత్





అనంతపురం, అక్టోబర్ 31, మనం బ్యూరో: అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం జరిగిన విద్యార్థినిపై దాడి ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం పాఠశాలలో తరగతులు ప్రారంభమైన కొద్దిసేపటికే, పదో తరగతి విద్యార్థులు పాఠాల్లో నిమగ్నమై ఉన్నారు. అదే సమయంలో

...మిగతా 2లో



స్విమ్మింగ్ పూల్లో కరెంట్ షాక్..

ఈత కొడుతూ విదేశీయుల మృతి

బెంగళూరు, అక్టోబర్ 31: బెంగళూరులోని ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటల్ లో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతుండగా కరెంట్ షాక్ తగిలి ఇద్దరు విదేశీయులు మృతిచెందారు. వీరిని జర్మనీ, స్లొవేకియా దేశస్థులుగా గుర్తించారు. శుక్రవారం సాయంత్రం హోటల్లోని మూడో అంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్లో వీరు ఈత కొట్టడానికి వెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా పూల్ నీటిలో కరెంట్ ప్రవహించడంతో విద్యుదాఘాతంజరిగింది. దీంతో వీరిద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారిని రక్షించే క్రమంలో హోటల్లో బస చేస్తున్న అమెరికన్ పౌరుడితో పాటు,

...మిగతా 2లో

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?

ఉద్యోగుల ఆందోళనలను కేంద్రం ఎందుకు పట్టించుకోవడంలేదు?

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై కేటీఆర్ ఫైర్

2

ఢిల్లీ టు ఆగ్రా 59 నిమిషాల్లోనే..

నార్త్ కారిడార్ బుల్లెట్ రైల్‌కు మోడీ ఆమోదం






ఢిల్లీ, అక్టోబర్ 31: దేశ రాజధాని నగరం ఢిల్లీతో ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని ప్రధాన నగరాలను బుల్లెట్ ట్రైన్‌తో అనుసంధానం చేయడమే లక్ష్యంగా చేపట్టిన నార్త్ కారిడార్ బుల్లెట్ రైల్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోడీ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. వారణాసి - ఢిల్లీ మధ్య కొత్త వందేభారత్ స్లీపర్ రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టు

...మిగతా 2లో

రెస్క్యూ మిషన్ విఫలం..

భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్



న్యూయార్క్, అక్టోబర్ 31: దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్షంలో సేవలందిస్తున్న నాసాకు చెందిన 'స్పేస్ట్ అబ్జర్వేటరీ' అనే భారీ టెలిస్కోప్ త్వరలో భూమిపై కూలిపోనుంది. ఈ టెలిస్కోప్ రెస్క్యూ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. అది అంతకంతకూ కిందికి దిగుతూ.. అతికష్టంగా ప్రయాణిస్తోంది. నేడో రేపో భూమిపై కూలిపోవచ్చని యూఎస్ స్పేస్ ఫోర్స్ అంచనా వేస్తోంది. సుమారు ఒకటిన్నర టన్ను బరువున్న ఈ పరికరం చాలావరకు వాతావరణంలోనే కాలిపోతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కొన్ని భాగాలు, అద్దాల ముక్కలు మాత్రం భూమిపై పడే అవకాశాలు

...మిగతా 2లో

ఓటు చోరీ జరిగితే బీజేపీ అధికారంలోకి వచ్చేది

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సంపూర్ణంగా సహకరిస్తుంది

బీజేపీ ఎంపీ డీకే అరుణ

2

డెమోక్రాట్లు గెలిస్తే ప్రజాస్వామ్యం అంతం

ట్రంప్ పార్టీకి 442 మిలియన్ డాలర్ల విరాళం

అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ మస్క్ వ్యాఖ్య



వాషింగ్టన్, అక్టోబర్ 31: అమెరికాలో మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2028లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్లు (యూఎస్ ప్రతినిధుల సభ, సెనేట్, అధ్యక్ష పదవి) గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం అంతమవుతుందని హెచ్చరించారు. అటువంటి ఎన్నికల ఫలితం అమెరికాలో ప్రధాన రాజకీయ, సంస్థాగత మార్పులకు

...మిగతా 2లో



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

– ఎడిటర్

యుద్ధానికి మాకు ఖర్చేంకాలే..

వెనెజువెలా నుంచి గుంజిందే!

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



వాషింగ్టన్, అక్టోబర్ 31: ఇరాన్ యుద్ధం వల్ల అమెరికాపై పెద్దగా ఆర్థిక భారమేమీ పడలేదన్నట్టుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. వెనెజువెలా నుంచి భారీగా ముడిచమురును రవాణా చేశామని, దానితో వచ్చిన ఆదాయంతో ఆ యుద్ధ ఖర్చు అంతా భర్తీ అయిందని అధ్యక్షుడు మీడియాకు వెల్లడించారు. అంతేగాక, ఇరాన్‌తో యుద్ధం ముగించడంలో తొందరేంలేదని వ్యాఖ్యానించారు. టెహ్రాన్‌పై మరోసారి దాడులు జరగొచ్చని సంకేతాలు వెలువడుతోన్న తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే వెనెజువెలా

...మిగతా 2లో

గందరగోళం.. ఇజ్రాయెల్ రాజకీయం

ఎవరితో ఎవరు చేతులు కలిపేనో!





టెల్ అవీవ్, అక్టోబర్ 31: పార్లమెంటరీ ఎన్నికల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ఇజ్రాయెల్ రాజకీయాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రస్తుత ప్రధాని నెతన్యాహు మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా..? లేక ఆయన్ను గద్దె దించేందుకు విపక్షాలన్నీ ఏకమవుతాయా..? అరబ్ పార్టీలు కింగ్‌మేకర్‌లుగా అవుతారా.? ఈ ప్రశ్నలన్నీ ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఇజ్రాయెల్ పార్లమెంటు 'కనెసెట్'లో మొత్తం 120 స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 61 మంది సభ్యుల మద్దతు అవసరం. తాజా ఎన్నికల్లో నెతన్యాహు పార్టీ

...మిగతా 2లో

అమెరికాలో భారత ఓటర్లకు దోశెల వల

వాషింగ్టన్, అక్టోబర్ 31: అమెరికాలో మిడ్‌టర్మ్ ఎన్నికల సందడి నెలకొంది. హోరాహోరీగా సాగే ఈ ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల ఓట్లు కీలకంగా మారాయి. దీంతో ఈ ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఆలయాలు సందర్శించడంతో పాటు.. దోశలు వేస్తూ పాట్లు పడుతున్నారు. నవంబర్ 3వ తేదీన అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల ముందస్తు ఓటింగ్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఓటర్లను, మరీ ముఖ్యంగా భారతీయ అమెరికన్లను ఆకట్టుకునేందుకు డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జేమ్స్ తలారికో.. డాలస్ శివారు ప్రాంతమైన ఇర్వింగ్లో ఒక ఇండియన్ రెస్టారంట్లో దోశలు వేశారు. బంగాళదుంప కూరతో స్టంఫింగ్ చేసి, అరటి ఆకు పరిచిన పళ్లెంలో వడ్డించడంతో.. అక్కడున్న వారంతా చప్పట్లు కొట్టారు. ఇర్వింగ్లో భారత అమెరికన్ల జనాభా ఎక్కువే.

ఇక, యూఎస్ సెనెటర్ కోరీ బ్రూకర్ దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. మరోసారి గవర్నర్ పదవికి పోటీ చేస్తోన్న కనెక్టికట్ గవర్నర్ నెడ్ లామోంట్ కూడా ఈ పండగ వేడుకలకు హాజరయ్యారు. ఇంకొందరు అగ్రరాజ్య నేతలు బాప్స్ స్వామినారాయణ్, అక్షర్ధామ్ వంటి ఆలయాలను సందర్శిస్తున్నారు. ఎన్నికల్లో ఒక్క ఓటుతోనే గెలుపోటములు మారిపోయే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఏ ప్రయత్నాలనూ వదలట్లేదు.

ఈ మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీకి ప్రతికూల పవనాలే వీస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడించాయి. ద్రవ్యోల్బణం, ఆర్థిక వ్యవస్థపై ఓటర్లలో ఉన్న ఆందోళనలు ఈ సారి ఎన్నికలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి ఏ పార్టీ దగ్గరా స్పష్టమైన ప్రణాళిక లేదని అమెరికన్లు భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి భారీ ఎన్నికల ప్రభంజనం (ఎలక్టోరల్ వేవ్) కనిపించడం లేదని పలు సర్వేలు అంచనా వేశాయి.

ఓటు చోరీ జరిగితే బీజేపీ అధికారంలోకి వచ్చేది

- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సంపూర్ణంగా సహకరిస్తుంది
- బీజేపీ ఎంపీ డీకే అరుణ



హైదరాబాద్, అక్టోబర్ 31, (మనం బ్యూరో): రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సంపూర్ణంగా సహకరిస్తుందని బీజేపీ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీ జరిగితే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేదని పేర్కొన్నారు. శనివారం కొడంగల్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్.. ఓటు చోరీ అని తప్పుడు ప్రచారం చేస్తుందని విమర్శించారు. దేశంలో అరాచకాన్ని సృష్టించాలని రాహుల్ గాంధీ చూస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించవద్దా..? అని ప్రశ్నించారు. కొడంగల్ మాత్రమే కాదు.. ఉమ్మడి పాలమూరు జిల్లా మొత్తం అభివృద్ధి చేయాలనీ, కొడంగల్ కి స్థానికుడు కాకపోయినా రేవంత్ రెడ్డిని ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నీటి అప్రోచ్ నార్లపూర్ కి మార్చి పాలమూరుకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారనీ, పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే.. జిల్లాకు అన్యాయం చేసిన వ్యక్తిగా చరిత్రలో మిగులుతారని వ్యాఖ్యానించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ జూరాల అప్రోచ్ తీసుకొని ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఇవ్వండి...ఆలస్యం చేయకుండా.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయండి అని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జూరాల అప్రోచ్ తీసుకొని పనులు చేపట్టండి. కేంద్రం వద్దకు కలసి వెళ్దాం.. నిధులు కోరుదామని స్పష్టం చేశారు. నవంబర్ 2వ తేదీన హైదరాబాద్ బీజేపీ మహా పాదయాత్ర చేపడుతుంది. హైదరాబాద్ లోని నిజాం కాలేజ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మోహింజహి మార్కెట్ వరకు పాదయాత్ర లో ముఖ్య అతిథిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొనబోతున్నారనీ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం - అరాచక వాదాన్ని అంతం చేద్దామనే నినాదంతో నిర్వహిస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా డీకే అరుణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

దుంకుతున్న మొసలి..తీక్షణంగా చూసే చిరుత..

ఆమ్‌స్టర్‌డామ్, అక్టోబర్ 31: నెదర్లాండ్స్ రాజధాని నగరమైన ఆమ్‌స్టర్‌డామ్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన ఆర్ట్ జూ మ్యూజియంలో అడుగుపెట్టిన సందర్శకులు బోన్లలో కాకుండా స్వేచ్ఛగా తిరుగాడుతున్నట్టుగా ఉన్న చిరుతపులి, మొసళ్ల వంటి జంతువులను చూసి ఒకింత గగుర్పాటుకు గురికాక తప్పదు. గుహలాంటి ఒక ప్రదేశంలో కూర్చొన్న చిరుతపులి మనల్నే తదేకంగా చూస్తూ ఉంటుంది. జపాన్‌కు చెందిన అతిపెద్ద సముద్ర పీత గోడపై సాలీడులా అతుక్కొని భయపెడుతుంటుంది. కానీ, ఇవన్నీ సజీవమైనవి కావు. వివిధ జంతు ప్రదర్శన శాలల్లో సహజమైన కారణాలతో చనిపోయిన వాటిని తీసుకువచ్చి అడవిలాంటి మ్యూజియంలో ఇలా తీర్చిదిద్దారు. డచ్ కళాకారులైన జాప్ సింక్, ఫెర్రీ వాన్ టాంగెరెన్ల కళాత్మక సృష్టి ఈ మ్యూజియం. ''మేము జంతువులకు కొంత నాటకీయత జోడించాం. మనుషులందరినీ ఒక బోనులో ఉంచి, జంతువులను స్వేచ్ఛగా వదిలేయాలన్నది మా ఆలోచన. ఆ మేరకు ఈ భవనాన్ని ఓ కళాఖండంగా మార్చాం'' అని వీరు చెబుతారు.

ఇందిరమ్మ బాటలో ప్రజా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మధుయాష్కి గౌడ్ అన్నారు. దేశ నిర్మాణంలో ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. శనివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా నక్లెస్ రోడ్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ అక్టోబర్ 31 దేశ చరిత్రలో నిలిచిపోతుందనీ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేతలను స్మరించుకునే రోజని పేర్కొన్నారు. గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ కృషి చేయడంతో పాటు రాజరికపు మూలలను తొలగించి.. బ్యాంకుల జాతీయాకరణతో పేదలకు ఆర్థిక అవకాశాలు కల్పించారన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం తన చివరి రక్తం బొట్టు వరకు పని చేసిన ఇందిరాగాంధీ దేశ చరిత్రలో మహానేతగా గుర్తింపు పొందారని కొనియాడారు. తెలంగాణలో పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందిరమ్మ గృహాలు, సన్నబియ్యం అందిస్తూ ఆమె ఆశయాలతో పేదల పెన్నిధిగా సీఎం రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. జాతీయ నేతలను స్మరించుకోవడంలోనూ బీజేపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

జ్ఞానేశ్ కుమార్ దిగిపో

(మొదటి పేజీ తరువాయి)

నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి వైదొలగాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రధాని మోడీ ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ తన పదవి నుంచి వైదొలిగే వరకూ ఇండీ కూటమి నేతృత్వంలో నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ తలపెట్టామన్నారు. ఈ సందర్భంగా మాక్ పార్లమెంట్‌లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు.

డెమోక్రాట్లు గెలిస్తే ప్రజాస్వామ్యం అంతం

(మొదటి పేజీ తరువాయి)

దారితీయవచ్చని పేర్కొన్నారు. 2028లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో యూఎస్ ప్రతినిధుల సభ, సెనేట్, అధ్యక్ష పదవిని డెమోక్రాట్లు దక్కించుకుంటే వారు ఏం చేస్తారనే దానిపై మస్క్ తన ఆందోళనలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. '2028లో జరిగే అమెరికా ఎన్నికల్లో డెమోక్రాట్లు యూఎస్ ప్రతినిధుల సభ, సెనేట్, అధ్యక్ష పదవులను పూర్తిగా కైవసం చేసుకుంటే వారు సెనేట్లో బలమైన మెజారిటీని సాధించడానికి వాషింగ్టన్ డీసీ, ప్యూర్టో రికోలను రాష్ట్రాలుగా మారుస్తారు. శాశ్వత మెజారిటీని పటిష్ఠం చేసుకోవడానికి సరిహద్దులను తెరిచి అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న ప్రతి ఒక్కరికి పౌరసత్వం లేదా చట్టబద్ధత కల్పిస్తారు. అమెరికా సుప్రీం కోర్టులోని న్యాయమూర్తుల సంఖ్యను పెంచి తమకు అనుకూలమైన మెజారిటీని డెమోక్రాట్లు సంపాదించుకుంటారు. ఇదే నా ఆందోళన. రాబోయే ఎన్నికల్లో డెమోక్రాట్లు క్లీన్ స్వీప్ చేస్తే అది 'గేమ్ ఓవర్ ఫర్ అమెరికా' (అమెరికా కథ ముగిసినట్లే) అవుతుంది'' అని మస్క్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు అమెరికాను ఒకే ఒక్క పార్టీ పాలించే దేశంగా మారుస్తాయని ఆరోపించారు. అమెరికాలో ఇటువంటి పరిణామాలను అడ్డుకోవాలంటే రిపబ్లికన్లు సెనేట్లో 51 సీట్లను దక్కించుకోవాల్సి ఉంటుందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు రిపబ్లికన్ సెనేటర్లకు ఓటేయాలని పిలుపునిచ్చారు.

ట్రంప్ పార్టీకి 442 మిలియన్ డాలర్ల విరాళం

నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల కోసం రిపబ్లికన్ పార్టీ ప్రచారాలు, రాజకీయ కార్యక్రమాలకు ఎలాన్ మస్క్ ఏకంగా 442 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేశారు. ఈ క్రమంలో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద వ్యక్తిగత రాజకీయ దాతగా ఈ బిలియనీర్ నిలిచారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లోనూ ట్రంప్ విజయానికి మస్క్ ఆర్థికంగా సాయం చేశారు.

నార్త్ కారిడార్ బుల్లెట్ రైల్‌కు మోడీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల జీవితాలను మార్చేస్తుందన్నారు. నిర్మాణ పనులు పూర్తిగా మేకిన్ ఇండియా ప్రాతిపదికన చేపట్టనున్నట్లు తెలిపారు. దేశ యువత, వెల్లర్ల చేతుల మీదుగా ఈ ప్రాజెక్టు నిర్మితమవుతుందన్నారు.

ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టు సాకారమైతే.. యువత, మధ్యతరగతి వర్గాలు, చిన్న తరహా పరిశ్రమల్లోని కళాకారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తద్వారా ప్రధాని మోడీ రాబోయే 100 ఏళ్ల పాటు ప్రజలకు గుర్తుండిపోతారని తెలిపారు. ఈ రైలు ఢిల్లీ, ఆగ్రా, కాన్పూర్, లఖ్నవూ, అయోధ్య, వారణాసి, ప్రయాగ్‌రాజ్, పట్నా, బెంగాల్లోని సిలిగుడిని కలుపుతూ అస్సాం గువహటి వరకు విస్తరించనున్నారు. తద్వారా ప్రయాణ సమయం కూడా తగ్గనుందన్నారు. ఢిల్లీ నుంచి కాన్పూర్‌కు గంట 45 నిమిషాల్లోనే చేరుకోవచ్చని తెలిపారు. ఢిల్లీ నుంచి ఆగ్రాకు 59 నిమిషాల్లో, ఢిల్లీ నుంచి లఖ్నవూకు 2.12గంటల్లో, లఖ్నవూ నుంచి వారణాసికి 1.21గంటల్లో, వారణాసి నుంచి ఢిల్లీకి 3.35 గంటల్లో వెళ్లొచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?

ఉద్యోగుల ఆందోళనలను కేంద్రం ఎందుకు పట్టించుకోవడంలేదు?

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి: ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్మజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన పలు కీలక ప్రశ్నలు సంధించారు. 'ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని



నిలదీశారు. 'ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయిన వారికి ఇంత తొందర ఎందుకు?' అని కేటీఆర్ తనదైన శైలిలో ప్రశ్నించారు.

విద్యార్థినిపై విద్యుత్ రంపంతో దాడి

(మొదటి పేజీ తరువాయి)

21 ఏళ్ల హేమంత్ అనే యువకుడు చెట్ల కొమ్మలు కోసే ఎలక్ట్రిక్/పవర్ రంపంతో ఉన్నపళంగా తరగతి గదిలోకి చొరబడ్డాడు. పదో తరగతి చదువుతున్న ఒక బాలికపై ఉన్మాదిలా విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. ఈ హఠాత్ పరిణామంతో పాఠశాలలో భీతావహ వాతావరణం నెలకొంది. ఉన్మాది జరిపిన దాడిలో బాలిక తల, ముఖం, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. రక్తం ఓడుతూ కిందపడిపోయిన ఆమెను ఉపాధ్యాయులు, స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాధితురాలిని కాపాడేందుకు ప్రయత్నించిన మరో బాలికకు కూడా గాయాలయ్యాయి.

దాడికి పాల్పడిన అనంతరం నిందితుడు హేమంత్ ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టి, ధర్మవరంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని మిషన్ ముఖ్య శాస్త్రవేత్త, నాసాకు చెందిన బ్రాడ్ సెంకో తెలిపారు. స్విఫ్ట్ అబ్జర్వేటరీ 2004 నవంబర్ 20న అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. విశ్వంలో అత్యంత శక్తిమంతమైన విస్ఫోటనాలైన గామా రే బరస్ట్స్, సూపర్‌నోవాల అన్వేషణకు దీన్ని ప్రయోగించారు. దీన్ని రెస్క్యూ చేసే బాధ్యతను 'కాటలిస్ట్ స్పేస్'కు నాసా అప్పగించింది. ఈ ఏడాది జులైలో ఆ సంస్థ ప్రయోగించిన 'లింక్' అనే మూడు చేతుల రోబో ప్రయోగం విఫలమై.. సెప్టెంబర్‌లో భూమిపై కూలిపోయింది.

ఈ క్రమంలోనే అక్టోబర్ నాటికి పరిస్థితి మరింత దిగజారడంతో టెలిస్కోప్‌లోని వ్యవస్థలను నిలిపివేశారు. 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' తన జీవితకాలంలో 2,000కుపైగా గామా రే బరస్ట్స్, 1,400 సూపర్‌నోవాలు, అనేక తోకచుక్కలు, గ్రహశకలాలను, బ్లాక్ హోల్స్‌ను పరిశీలించింది. ఖగోళంలో ఎక్కడైనా విస్ఫోటనాలు జరుగుతున్నప్పుడు ఆ దిశగా అత్యంత వేగంగా కదిలి దాన్ని కవర్ చేయడం ఈ టెలిస్కోప్ ప్రత్యేకత. అందుకే దీనికి 'స్విఫ్ట్' అనే పేరు పెట్టారు.

నానమ్మను స్మరించుకున్న రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చుకున్నారని పేర్కొన్నారు.'' ఆమె ఆకాశంలా స్వేచ్ఛగా, సముద్రమంత లోతుగా, భూమిలా దృఢంగా, అగ్నికంటే ప్రకాశవంతంగా ఉండేవారని'' ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హిందీలో సోషల్ మీడియాలో దివంగత ప్రధానికి నివాళులర్పిస్తూ ఆమె ధైర్యం, సంకల్పం, దేశానికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ''నాలో శ్వాస ఉన్నంత వరకు సేవ ఆగదు. నా ప్రతి రక్తపు బొట్టు వరకు దేశాన్ని సజీవంగా ఉంచుతానని చెబుతున్నా'' అని మరణానికి ఒక రోజు ముందు ఇందిరా గాంధీ చేసిన ప్రసంగాన్ని ఖర్గే గుర్తు చేసుకున్నారు.

ఇంధన సరఫరాలో ఆంక్షలు వద్దు: జీ20 దేశాలతో జైశంకర్

ఢిల్లీ, అక్టోబర్ 31:ఆంక్షలు, కీలక చమురు రవాణా మార్గాలను అడ్డుకోవడం వంటి చర్యల ద్వారా ప్రపంచ చమురు సరఫరాకు అంతరాయం కలిగించడాన్ని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఖండించారు. ధరలను గుప్పిట్లో ఉంచుకునేందుకే కొన్ని దేశాలు ఇంధన వాణిజ్యంపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరుపుతున్నాయని అన్నారు. అనిశ్చితి, అంతరాయాలు, భరించలేని ధరలు, లభ్యతలో సవాళ్లే అసలైన కారణమని పేర్కొన్నారు. జీ20 దేశాల విదేశాంగ మంత్రులతో జరిగిన సమావేశంలో జైశంకర్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్కడే ఉండడం గమనార్హం. ఇరాన్ చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షలు, పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాకు అంతరాయం, రష్యా డీజిల్ అమ్మకాలపై అడ్డంకులు వంటి పరిణామాల వేళ.. భారత విదేశాంగమంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

30 రోజుల్లో పూర్తయ్యే పనులు 7 రోజుల్లో పూర్తి చేయడమే లక్ష్యం



- మంత్రి నిమ్మల

పాలకొల్లు, అక్టోబర్ 31, మనం ప్రతినిధి: ఆర్నాబ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను మంత్రి నిమ్మల రామానాయుడు వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పాలకొల్లులోని ఏఎంసీ ఇండోర్, పూలపల్లి, అడవిపాలెం విద్యుత్ కేంద్రాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. గోదావరి జిల్లాల్లో వేలాది విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. సాధారణంగా 30 రోజులు పట్టే పునరుద్ధరణ పనులను వారం రోజుల్లో పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు ఆదేశాలతో ఇతర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి మంత్రి స్వయంగా అల్పాహారం వడ్డించి అభినందించారు. విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో పునరుద్ధరించే వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కూటమి నాయకులు సహకరించాలని కోరారు.

వెనెజువెలా నుంచి గుంజిందే!

(మొదటి పేజీ తరువాయి)

చమురు వల్ల ఎంతమేర ఆదాయం వచ్చిందో మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇక, ఈ యుద్ధంతో ఇప్పటివరకు అమెరికాకు సుమారు 47 బిలియన్ డాలర్ల ఖర్చు అయిందని అంచనా.

మరోవైపు, అమెరికాతో చర్చలను ఇరాన్ కోరుకుంటోందని ట్రంప్ అన్నారు. ఆ దేశం అంతర్గతంగా ఎదుర్కొంటున్న సమస్యలే అందుకు కారణమని పేర్కొన్నారు. సైనికులు, పోలీసులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలోకి టెహ్రాన్ వెళ్లిపోయిందన్నారు.ఇదిలా ఉండగా.. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకోసం ఒక తాత్కాలిక ముసాయిదా రూపొందించినట్లు తెలుస్తోంది. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను మూడో దేశానికి తరలించడం లేదా దాని రేడియోధార్మికతను తగ్గించడం ఆ ముసాయిదా ప్రతిపాదనల్లో ఉంది. అలాగే ఈ చర్చల్లో భాగంగా ఒప్పందం కుదిరిన ఏడురోజుల్లో హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలి. ఇరాన్ తన అణు కార్యక్రమాలపై, సముద్ర భద్రతపై చర్చలు తీసుకుంటే.. దానికి ప్రతిగా టెహ్రాన్‌పై విధించిన ఆంక్షలను, దిగ్బంధాలను అమెరికా సండలిస్తుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఈ ఒప్పందం అమలయ్యేందుకు చైనా ఒక హామీదారుగా ఉంటుందని తెలుస్తోంది. ఈ చర్చలు ఖతార్‌లో జరగనున్నాయి.

ఈత కొడుతూ విదేశీయుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

స్విమ్మింగ్ పూల్ అటెండెంట్ గాయపడ్డారు. హోటల్ యాజమాన్యం వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించింది. మృతుల్లో ఒకరైన అలెగ్జాండర్ మాక్సిమిలియన్ థీస్.. జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ సిబ్బంది అని పోలీసులు తెలిపారు. ఇక మరో వ్యక్తి స్లోవేకియాకు చెందిన జురాజ్ హోర్వాట్. ఆయన ప్రముఖ టెక్ సంస్థ ఐబీఎంలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రజా ఆస్తుల పరిరక్షణలో పారదర్శకతపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటాం

- పెండింగ్‌లో ఉన్న కేసులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీజేపీ నేత గూడూరు నారాయణ రెడ్డి డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 31, (మనం బ్యూరో)ఫ రాష్ట్రవ్యాప్తంగా లిటిగేషన్లో ఉన్న అన్ని ప్రభుత్వ, పబ్లిక్ భూములపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ సీనియర్ నేత గూడూరు నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మియాపూర్ భూ వివాదంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. విలువైన ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల విస్తీర్ణం, అంచనా మార్కెట్ విలువ, న్యాయపరమైన స్థితి, కేసుల వ్యవధిని ప్రభుత్వం వెల్లడించాలని అన్నారు. మియాపూర్‌లో సుమారు 550 ఎకరాల కోట్లాది రూపాయల విలువైన భూములపై రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యాన్ని సమర్థిస్తూ అక్టోబర్ 29న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సుదీర్ఘ న్యాయ పోరాటాల్లో చిక్కుకున్న ప్రభుత్వ ఆస్తుల పరిమాణాన్ని బయటపెట్టిందని అన్నారు. ఈ తీర్పు తెలంగాణ వ్యాప్తంగా ఇలాంటి వివాదాలపై సమగ్ర సమీక్షకు దారితీయాలని ఆయన అన్నారు. మియాపూర్ కేసు ప్రభుత్వ భూమి యొక్క అపారమైన విలువను, అలాగే దశాబ్దాల పాటు లిటిగేషన్ కొనసాగడం వల్ల కలిగే పరిణామాలను రెండింటినీ చూపిస్తుంది. ఒకే వివాదంలో వేల కోట్ల విలువైన భూమి ఉంటే, ఇంకా ఎంత ప్రభుత్వ ఆస్తి కోర్టు కేసుల్లో చిక్కుకుని ఉంది, వాటిని పరిష్కరించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది' అని ఆయన అన్నారు.మియాపూర్ వివాదంలో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 100, 101లోని 550 ఎకరాల 39 గుంటల భూమి ఉంది. చారిత్రక రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ పోరంబోకుగా వర్గీకరించబడిన ఈ భూమి దశాబ్దాలుగా పోటీ యాజమాన్య వాదనలకు గురైంది. అప్పటి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2003లో ప్రభుత్వ యాజమాన్యాన్ని సమర్థించగా, ప్రైవేట్ క్లెయిమెంట్ల అప్పీళ్లు రెండు దశాబ్దాలకు పైగా సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉన్నాయి. ఈ ఆస్తి విలువ వివిధ అంచనాల ప్రకారం రూ.25,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. 'ప్రభుత్వ భూమిని కాపాడటం అనేది కోర్టు విజయాలను ప్రకటించడం లేదా స్వాధీనం చేసుకున్న ఆస్తుల గురించి ప్రకటనలు చేయడానికి మాత్రమే పరిమితం కాకూడదు. ఇంకా వివాదంలో ఉన్న వాటితో సహా ప్రజా భూముల పూర్తి చిత్రాన్ని వెల్లడించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందా అనేదే జవాబుదారీతనానికి నిజమైన పరీక్ష' అని ఆయన అన్నారు.విలువైన ప్రజా ఆస్తుల పరిరక్షణలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం బీజేపీ ఒత్తిడి చేస్తూనే ఉంటుందని ఈ సందర్భంగా గూడూరు నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

గందరగోళం.. ఇజ్రాయెల్ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

'లికుడ్' సొంతంగా 27 సీట్లు గెల్చుకుంది. దాని నేతృత్వంలోని అధికార కూటమికి మొత్తంగా 53 స్థానాలు దక్కాయి. మాజీ సైన్యాధిపతి ఐసెన్కోట్ నాయకత్వంలోని యషర్ పార్టీకి 21 సీట్లు వచ్చాయి. దాని నేతృత్వంలోని విపక్ష కూటమిలో మాజీ ప్రధాని నఫ్తాలీ బెన్నెట్‌కు చెందిన బయచద్ (టుగెదర్) పార్టీ ఖాతాలో 12 స్థానాలు ఉన్నాయి. యిజ్రాయెల్ బెతెను (7), డెమోక్రాట్స్ (8) పార్టీలు కూడా ఇదే కూటమిలో భాగస్వామ్య పక్షాలు. అరబ్ పార్టీలైన రామ్ (11), జాయింట్ లిస్ట్ (8) సీట్లు గెల్చుకున్నాయి. నెతన్యాహు, ఐసెన్కోట్ చేతులు కలిపితే.. ఐక్యతా ప్రభుత్వం ఏర్పడుతుంది. అయితే ఇది దాదాపు అసాధ్యమే. నెతన్యాహును గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఈ ఎన్నికల్లో పట్టుదలతో పని చేశాయి. కనీస మెజార్టీ దక్కలేదు కాబట్టి నెతన్యాహు ప్రధాని పదవిని వీడాలని ఐసెన్కోట్ తాజాగా కూడా మరోసారి పిలుపునిచ్చారు. అయితే పశ్చిమాసియాలో ప్రస్తుత సంక్షోభం దృష్ట్యా ఇజ్రాయెల్ ప్రధాన రాజకీయ పార్టీలు తమ వైరుధ్యాలను పక్కనబెట్టి చేతులు కలిపే అవకాశాలు లేకపోలేదని కొందరు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఫిరాయింపుదారులు నెతన్యాహు గూటికొస్తే..

నెతన్యాహు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఇంకో 8 మంది సభ్యుల మద్దతు కూడగట్టుకుంటే సరిపోతుంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయన.. విపక్ష పార్టీలతో చేతులు కలపడం కంటే.. వాటి నుంచి ఫిరాయింపుదారులను ఆకర్షించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్నది కొందరి వాదన. బయచద్, యిజ్రాయెల్ బెతెనుల నుంచి కొందరు నెతన్యాహు గూటికి చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి.

ఐసెన్కోట్‌కు అరబ్ పార్టీలు మద్దతిస్తే..

ఐసెన్కోట్ కూటమికి అరబ్ పార్టీలు మద్దతిచ్చినా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. అయితే వాటితో చేతులు కలిపేందుకు ఐసెన్కోట్ కూటమిలోని కొన్ని పార్టీలు సుముఖంగా లేవని తెలుస్తోంది. ప్రభుత్వంలో చేరకుండా అరబ్ పార్టీలు బయటి నుంచి విపక్ష కూటమికి మద్దతివ్వడం మరో మార్గం. ఐసెన్కోట్కు మద్దతిచ్చేందుకు రామ్, జాయింట్ లిస్ట్ సిద్ధంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పార్టీలను మద్దతు కోరబోమని నెతన్యాహు ఇప్పటికే స్పష్టం చేశారు. సంకీర్ణ సమీకరణాలేవీ కుదరకపోతే దేశాధ్యక్షుడు మళ్లీ ఎన్నికల నిర్వహణకు ఆదేశిస్తారు. అప్పటివరకూ నెతన్యాహు ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతారు.

మాక్ పార్లమెంట్..
సీఈసీపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఖర్గే



ఢిల్లీ, అక్టోబర్ 31: ఓట్ల చోరీ, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి నేతలు కొన్ని రోజులుగా నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కూటమి నేతలు ఢిల్లీలోని ఖర్గే నివాసంలో బహిరంగ 'ప్రజా అభిశంసన' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన కాంగ్రెస్ మాక్ పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షుడు ఖర్గే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

'అధికారాన్ని నిలుపుకోవడానికి బీజేపీ 2014 నుంచి కుట్రలు పన్నుతోంది. సీఈసీకి రక్షణ కల్పిస్తున్న 2023 చట్టం అండ చూసుకునే జ్ఞానేశ్ కుమార్ ఓట్ల తొలగింపునకు, చోరీకి పాల్పడుతున్నారు. ఆయనకు ఉన్న ఈ స్థాయి రక్షణ రాష్ట్రపతికి గానీ.. భారత ప్రధాన న్యాయమూర్తికి కూడా లభించదు. సీఈసీకి రక్షణ కల్పిస్తున్న 2023 చట్టాన్ని రద్దు చేసి, ఆయన పదవికి రాజీనామా చేయడం. సర్ను వెంటనే నిలిపివేయడం, అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చడం. అన్ని ఎన్నికలను పేపరు బ్యాలెట్లతోనే నిర్వహించడం అనేవి ఇండియా కూటమి మూడు ప్రధాన డిమాండ్లు' అని ఖర్గే పేర్కొన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు సమర్పించిన నోటీసులను ఉభయసభల్లో స్వీకరించకపోవడంతో కార్యక్రమాన్ని పార్లమెంటు వెలుపల నిర్వహించడం తప్ప మరోమార్గం లేదని ఎంపీ శశి థరూర్ పేర్కొన్నారు.

యాదాద్రి నరసన్న సన్నిధిలో గవర్నర్ శుక్లా

దేవస్థానంలో తెలంగాణ వేద విద్వాన్ మహాసభ

ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్..జ్ఞాపిక (మొమెంటో), ప్రసాదాల అందజేత

గవర్నర్‌కు స్వాగతం పలికిన మంత్రి శ్రీధర్‌బాబు, విప్ బీర్ల ఐలయ్య





హైదరాబాద్, అక్టోబర్ 31(మనం ప్రతినిధి): తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28వ తేదీ నుంచి యాదగిరిగుట్ట దేవస్థానంలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వాన్ మహాసభలకు గవర్నర్ హాజరయ్యారు. ఆలయ ఈవో స్వామివారి జ్ఞాపిక (మొమెంటో), ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... వేదాల గురించి పిల్లలకు అవగాహన వస్తే మన ప్రాచీన సాంస్కృతిక మ, విద్యా సంప్రదాయం కచ్చితంగా పరిరక్షించబడుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో కారణంగా వర్షపాతం లోటు దరిమిలా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అంతకుముందు యాదగిరిగుట్టకు విచ్చేసిన గవర్నర్ శుక్లాకు... ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, దేవస్థానం బోర్డు సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు గవర్నర్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

జాగ్రత్త.. తస్మాత్ జాగ్రత్త

పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

అల్పపీడన ప్రభావంతో నేటి నుంచి నవంబర్ 4 వరకు వానలు కురిసే అవకాశం

హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం



హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి : అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న 5 రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. వాతావరణ శాఖ తెలిపిన నివేదిక ప్రకారం... అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో నేటి నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. నేడు, రేపు కూడా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది.

ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 3న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

సత్యవతి రాథోడ్‌కు కేటీఆర్ శుభాకాంక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి : తన పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శనివారంనాడు ఆయన నివాసంలో కేటీఆర్ సతీమణి శైలిమతో కలిసి సత్యవతి రాథోడ్‌కు పూల మొక్కను అందించి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. హ్యాపీ బర్త్ డే అక్క.. మీరు ఆరోగ్యంగా ఉండాలి?.. మళ్లీ బ్రహ్మాండంగా గెలవాలని కేటీఆర్ ఆకాంక్షించారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసి.. దేశంలోనే గొప్ప నాయకుడిని తీర్చిదిద్దేలా పనిచేస్తానని ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ కేటీఆర్‌కు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలకు చెక్

ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలు

అందుబాటులోకి 172 ఎంజీడీల నీరు

120 మిలియన్ లీటర్ల భారీ శుద్ధి కేంద్రాలు..



హైదరాబాద్, మనం ప్రతినిధి : హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు మూసీ పునరుజ్జీవనానికి దోహదపడే గోదావరి మంచినీటి సరఫరా పథకం ఫేజ్-2లో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టులోని ప్యాకేజీ-2 పనులకు సంబంధించి ప్రభుత్వం 2026 జూన్ 24ను అధికారిక నియామక తేదీగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రూ.7,360 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్‌కు అదనంగా 172 మిలియన్ గ్యాలన్‌ల నీరు అందుబాటులోకి రానుంది. దీంతో నగరంలో పెరుగుతున్న తాగునీటి డిమాండ్‌ను కొంతమేర తీర్చడంతో పాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను గోదావరి నీటితో నింపేందుకు అవకాశం ఏర్పడనుంది.

హైదరాబాద్ నగర జనాభా పెరుగుదల, విస్తరిస్తున్న నివాస ప్రాంతాలు, పారిశ్రామిక అవసరాల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను నగరానికి తరలించే పథకానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఫేజ్-2 పనులను హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు పనుల కోసం రాంకీ-జీవీపీఆర్ సంయుక్త సంస్థ ఎల్-1గా నిలిచి కాంట్రాక్టును దక్కించుకుంది. తాజాగా ప్యాకేజీ-2కు సంబంధించిన నియామక తేదీని ప్రభుత్వం ఖరారు చేయడంతో నిర్మాణ పనుల పురోగతిని అంచనా వేయడానికి, గడువులను పర్యవేక్షించడానికి అధికారులకు స్పష్టత లభించనుంది. కాంట్రాక్టు నిబంధనల ప్రకారం పనుల్లో ఆలస్యం లేదా లోపాలు తలెత్తితే బాధ్యతను నిర్ణయించి చర్యలు తీసుకునేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది.

ఈ ప్రాజెక్టులో భాగంగా ఘనపూర్ నుంచి ఉస్మాన్ సాగర్, ముత్తంగి వరకు భారీ ఎంఎస్ పంపింగ్ మెయిన్లను నిర్మించనున్నారు. కోకాపేట్ నుంచి ఉస్మాన్ సాగర్ క్యాండూట్ వరకు పైప్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల మధ్య అనుసంధాన వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. గోదావరి జలాలను అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు ఈ పైప్ లైన్లు, పంపింగ్ వ్యవస్థలు కీలకంగా పనిచేయనున్నాయి.

ఘన్ పూర్ వద్ద 80 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించనున్నారు. అలాగే 180 లక్షల లీటర్ల సామర్థ్యంతో ముడి నీటి రిజర్వాయర్, పంప్‌హౌస్, విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. నీటిని నిల్వ చేయడం, పంపింగ్ చేయడం, తదుపరి శుద్ధి కేంద్రాలకు తరలించడం వంటి అవసరాలకు ఈ మౌలిక సదుపాయాలు ఉపయోగపడనున్నాయి.

120 మిలియన్ లీటర్ల భారీ శుద్ధి కేంద్రాలు

ఉస్మాన్ సాగర్ వద్ద రోజుకు 120 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ నిర్మించనున్నారు. దీనికి అనుబంధంగా శుద్ధి చేసిన నీటి నిల్వ రిజర్వాయర్, పంప్‌హౌస్‌లను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా హిమాయత్ సాగర్ వద్ద రోజుకు 70 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించడంతో పాటు పంప్‌హౌస్ పనులు చేపట్టనున్నారు. గోదావరి మంచినీటి సరఫరా పథకం ఫేజ్-2ను కేవలం తాగునీటి ప్రాజెక్టుగానే కాకుండా హైదరాబాద్ జలవనరుల నిర్వహణలో భాగంగా కూడా ప్రభుత్వం పరిగణిస్తోంది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలకు గోదావరి నీటిని తరలించడం ద్వారా నగర నీటి అవసరాలను తీర్చడంలో ఈ జలాశయాల పాత్రను పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ ప్రాజెక్టు మూసీ పునరుజ్జీవనానికి ఎలా అనుసంధానమవుతుంది, జలాశయాల్లో నీటి నిల్వలు ఎలా నిర్వహిస్తారు, నగరానికి ఎంత మేర నీరు సరఫరా చేస్తారు వంటి అంశాలు అమలు ప్రణాళికపై ఆధారపడి ఉంటాయి.

మస్క్యులర్ డిస్ట్రోఫీ చిన్నారులకు అండగా ఉందాం

- కండరాల క్షీణత చాలా తీవ్రమైన వ్యాధి
- దాన్నిటెస్టుల ద్వారానే అరికట్టగలం
- ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలి?
- వ్యాధితో బాధపడే చిన్నారులకు అండగా ఉంటాం.. సీపీ వీసీ సజ్జనార్ భరోసా

హైదరాబాద్, మనం ప్రతినిధి : కండరాల క్షీణత, బలహీనత (మస్క్యులర్ డిస్ట్రోఫీ)తో బాధపడే చిన్నారులకు అండగా ఉంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ భరోసా కల్పించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీని జెనెటిక్ టెస్టుల ద్వారానే అరికట్టగలమని వ్యాఖ్యానించారు. కండరాల క్షీణత వ్యాధిపైన దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారంనాడు హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడుతూ... చాలా ప్రాంతాల్లో కండరాల క్షీణతతో బాధపడుతున్న చిన్నారులను, తాను చూశానని తెలిపారు. బాధిత పిల్లలకు భారత్ ఎండీ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్ ఎండీ ఫౌండేషన్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. కండరాల క్షీణత అనేది చాలా తీవ్రమైన వ్యాధి అని చెప్పుకొచ్చారు. పిల్లలకు తీవ్రమైన వ్యాధి ఉన్నప్పటికీ, వాళ్లను అపురూపంగా చూసుకుంటున్నారని... అలాంటి తల్లిదండ్రులు చాలా గ్రేట్ అని అభినందించారు. ఈ వ్యాధి ఉన్న చిన్నారుల సింగిల్ పేరెంట్స్‌ను తాను చాలామందిని చూశానని అన్నారు. అలాంటి తల్లిదండ్రులకు తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు.

ఆ చిన్నారులు స్ఫూర్తిదాయకం..

దాదాపుగా 60 మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని సజ్జనార్ తెలిపారు. ఈ 60 మంది పిల్లలు చాలామంది వెరీ టాలెంటెడ్‌గా ఉన్నారని.. వాళ్లు మన అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవాళ్లే కొంతమంది జీవితం భారంగా ఉందని ఫీల్ అవుతారని తెలిపారు. కానీ తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల్లో చిరునవ్వును చూసి తనకు చాలా ఆనందంగా అనిపించిందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

40 ఏళ్లుగా పన్నులు కడుతున్నం..

పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేత

అధికారుల చర్యలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు



హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి : హైదరాబాద్ రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు. ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆ తర్వాతే చట్టపరమైన తమ భూములపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలోనూ ఇదే చెరువు పరిధిలో కూల్చివేతలు చేపట్టి, కొంత భూమిని పునరుద్ధరణ పనుల కోసం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

హైడ్రా హైకోర్టు ఆదేశాలను ధిక్కరించింది... బాధితుల ఆరోపణలు

మరోవైపు చెరువు పరిధిలో నిర్మాణాలున్నాయంటూ హైడ్రా అధికారులు చేపట్టిన కూల్చివేతలపై యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ.. హైడ్రా కూల్చివేతలకు పాల్పడిందంటూ మండిపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. షెడ్ చెరువు పరిధిలో ఉందని.. కూల్చివేస్తామని హైడ్రా అధికారులు యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో కంగారు పడిన యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. 40 ఏళ్లుగా ప్రభుత్వానికి మున్సిపల్ పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని.. చెరువు పరిధిలో భూమి ఉంటే.. ఇన్నేళ్లుగా పన్నులు ఎందుకు వసూలు చేశారని పిటిషన్‌లో నిలదీశారు. అయితే, అప్పటికే హైడ్రా అధికారులు షెడ్‌ను పూర్తిగా కూల్చివేశారు. ప్రభుత్వం.. నిబంధనల ప్రకారం సరైన ప్రక్రియను అనుసరించిన తర్వాతే చర్యలు చేపట్టాలని యజమానులు విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలు పట్టవా?
నో పబ్లిక్ ఇంట్రెస్ట్.. ఓన్లీ ప్రైవేట్ ఇంట్రెస్టేనానా?

- సీఎం రేవంత్ సర్కార్ గెజిట్‌పై హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి : 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు రీ అలైన్‌మెంట్‌పై ఆందోళన చెందుతున్న నార్సింగి ప్రజలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి కలిసి బాధితులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు 100 ఫీట్ రోడ్ కోసం ఒక మార్కవుట్ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడుండే స్థానికులు అక్కడ గుట్ట మీద హనుమాన్ టెంపుల్ ఉంది.. ఆ 2013లో ఇచ్చిన గెజిట్లో ఆ గుట్టను తొలగిస్తూ.. హనుమాన్ టెంపుల్ను కూడా తొలగిస్తూ 100 ఫీట్ రోడ్ వేస్తా ఉన్నారు.. ఆ టెంపుల్‌ను కాపాడాలని మాజీ మంత్రి సబిత దృష్టికొస్తే.. ఆమె గత ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి రోడ్డు యదావిధిగా ఉంచుతూ ఆ టెంపుల్‌ను కాపాడరని గుర్తు చేశారు. పబ్లిక్ ఇంట్రెస్ట్.. ఉన్న ఓ ఒక టెంపుల్‌ను కాపాడాలని ప్రజలందరూ కోరుకుంటుంటే?....2026లో రేవంత్ ప్రభుత్వం, తన కుటుంబం, కాంగ్రెస్ నాయకులు, రియల్ ఎస్టేట్ సంస్థ కోసం అలైన్‌మెంట్ మారుస్తూ కొత్తగా గెజిట్ ఇచ్చిందన్నారు. అయితే, దీని వెనుక పబ్లిక్ ఇంట్రెస్ట్ (ప్రజా ప్రయోజనం) ఎక్కడా లేదన్నారు. ఇవాళ, సుమారు 2 వేల మంది నిద్రపోని రాత్రులను గడుపుతున్నామని ఓ భాదితురాలు రోదిస్తూ చెప్పిందన్నారు. తుగ్లక్ ప్రభుత్వం తక్షణమే ఈ ఉత్తర్వులు రద్దు చేసి, పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు వేయాలని ఈసందర్భంగా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కష్టపడి కట్టుకున్న స్కూల్ పోతుంది.. బాధిత మహిళ కన్నీటి రోదన..

తాము ఎంతో కష్టపడి కట్టుకున్న స్కూల్ కూడా ఆ రోడ్డు విస్తరణలో పోతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కూతురి ఇంటర్ నేషనల్ స్కూల్ రోడ్డు కోసం మా స్కూల్‌ను కూల్చడానికి చూస్తున్నారని ప్రసన్నిత రావు అనే మహిళ వాపోయింది. మాకు ఇక్కడ ఒక ప్రీ స్కూల్ ఉందని, బిల్డింగ్ పర్మిషన్ జూన్ 2024లోనే వచ్చిందని, రెండేళ్ల నుంచి స్కూల్ను నిర్వహిస్తున్నామన్నారు. తన కూతురు స్కూల్ కోసమే ఈ రేవంత్ సర్కార్ ..మా స్కూల్‌కు మార్కింగ్ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే 100 ఫీట్ల రోడ్డు ఇన్ని మలుపులు తిరుగుతుంది.. అంటూ చెప్పుకొచ్చారు.

వామ్మో.. ఈ కానిస్టేబుల్ ఇంత ఘనుడా?

సీజ్ చేసిన ఫోన్ నుంచి నగదు బదిలీ

12 తులాల బంగారం తాకట్టు

వరుస ఘటనలతో పరువు తీస్తున్న పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి : కంచే చేను మేస్తే? కాదేది ఆనర్థం అన్నట్లుగా.. రోజు ఎన్నో నేరాలను చూసిన ఓ ఖాకీ కన్నింగ్ అవతారమెత్తాడు. తనకు అందివచ్చిన భారీ అవకాశంతో ఆ కానిస్టేబుల్ తన చేతి వాటాన్ని ప్రదర్శించారు. హైదరాబాద్ మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రవణ్, ఓ కేసులో స్వాధీనం చేసుకున్న బంగారం, నగదును దుర్వినియోగం చేశాడు. వరకట్నం కేసులో స్వాధీనం చేసుకున్న 12 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి సుమారు రూ.12 లక్షలు పొందినట్లు పోలీసులు గుర్తించారు. అదే కేసులో సీజ్ చేసిన మొబైల్ ఫోన్ నుంచి రూ.1.70 లక్షలను తన ఖాతాతో పాటు బంధువుల ఖాతాలకు బదిలీ చేసినట్లు వెల్లడైంది. బాధితుల ఫిర్యాదుతో ఈ వ్యవహారం అలస్యంగా వెలుగులోకి రావడంతో ఎట్టకేలకు ఆ కానిస్టేబుల్‌ను అరెస్టు చేశారు.

అయితే, ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్వాధీనం చేసుకున్న బంగారం, నగదుపై కన్నేసిన సదరు కానిస్టేబుల్.. గుట్టు చప్పుడు కాకుండా నొక్కేశాడు. హైదరాబాద్ మీర్‌పేట పీఎస్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రవణ్ పాపం పండడంతో అయ్యవారి అసలు గుట్టు బయటపడింది. ఇన్‌స్పెక్టర్ శోభన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కానిస్టేబుల్ శ్రవణ్ గత ఆరేళ్లుగా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల మీర్ పేట పీఎస్ పరిధిలో వరకట్నానికి సంబంధించిన కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు 12 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో భద్రపరిచారు. అయితే, ఈ బంగారాన్ని గమనించిన శ్రవణ్.. ఎవరికీ అనుమానం రాకుండా కాజేశాడు. బంగారాన్ని తాకట్టు పెట్టి సుమారు రూ.12 లక్షలు తీసుకున్నాడు. కేసులో స్వాధీనం చేసుకున్న వస్తువులను భద్రంగా కాపాడాల్సిన బాధ్యత ఉన్న పోలీసు సిబ్బందే ఇలా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది.

ఇదే కేసుకు సంబంధించి పోలీసులు ఓ మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌లోని ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను ఉపయోగించుకుని శ్రవణ్ రూ.1.70 లక్షలను బదిలీ చేసుకున్నాడు. ఈ మొత్తాన్ని తన ఖాతాలోకి మళ్లించడంతో పాటు తన బంధువుల ఖాతాలకు కూడా బదిలీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాధితులు తమ ఖాతాలో డబ్బులు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారంపై విచారణ చేపట్టగా.. కేసులో స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు దుర్వినియోగమైన విషయం బయటపడింది. అయితే, తమ విచారణలో శ్రవణ్ తన తప్పును అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో ఈ నెల 27న అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. తాకట్టు పెట్టిన బంగారాన్ని పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం అదే రోజు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకునే బంగారం, నగదు, మొబైల్ ఫోన్లు వంటి వస్తువులు కీలకమైన ఆధారాలుగా ఉంటాయి. వాటిని భద్రపరచడం, లావాదేవీల వివరాలను సక్రమంగా నమోదు చేయడం, అవసరమైనప్పుడు సంబంధిత వ్యక్తులకు తిరిగి అప్పగించడం వంటి అంశాల్లో కఠినమైన పర్యవేక్షణ అవసరం. బాధ్యతాయుతమైన విధుల్లో ఉన్న సిబ్బంది ఇలాంటి ఆరోపణలకు గురికావడం పోలీసు వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పలువురు ఉన్నాతాధికారులు అంటున్నారు.

జల్లెడ

జల్లెడ జల్లెడ జల్లెడ.. జాలి గుండెల జల్లెడ
జల్లించు జల్లించు ఎల్లెడ
జల జల జల్లించు జల్లి గుండ!
గుండెని చిల్లులు చేసుకుని
ముత్యాలను దార పోస్తుంది
కొన్ని రాళ్ళైనా మిగల్చడం
పొదుపు మంత్రమే కదా !
హంస పాలు నీళ్లు వేరు చేసినట్లు
మంచి చెడులను వేరుచేయు జల్లెడ
ఒళ్ళన్నీ కళ్ళు చేసుకొని
ఏది కావాలో ఏరుకొమ్మంటది!
ఆలోచనల మనసు జల్లెడ
అనంత ఆలోచనలు నిండినా
అస్త్రగాలంబట్టి మంచిని ఏరి
అందించే జల్లెడ ఎంత గొప్పదో!
చెడును జల్లించి పారేయాలి
మంచిని జల్లించి దాచుకోవాలి
మనసు జల్లెడలో మంచిని నిలిపి
జీవితమంతా వెలుగు పరుచుకోవాలి!
కోపాన్ని, ద్వేషాన్ని జల్లించు శాంతి సందేశాన్ని
వల్లించు.. న్యాయాన్యాయాన్ని గుర్తించు
ధర్మాధర్మాలను పాటించు
మనసు అంతః జల్లెడ చెడును జల్లించి
వడపోసి మంచిని పంచే
జల్లెడమనిషికి కనిపించని అండ !

- పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

ఆశ అదుపుచేయడం

చెరువు దగ్గరికి వెళ్ళాను
చిప్పలు ఏరుకున్నాను
నది దగ్గరికి వెళ్ళాను
శంఖువులు కోరుకున్నాను
అలాగే సముద్రం దగ్గరికి వెళ్ళాను
అలల ఆవలింతలు కెరటాల కేరింతలు చూసి
సుడులు అలజడులు చూసి
వేయి బడబాగ్నులు
లక్ష దావాగ్నులు చూసి
భయపడ్డాను
ముత్యాలు రత్నాలు పగడాలు
కోసం వచ్చినా నేను నిలువునా జడిసాను
వలేయటం కాదు
వదిలేయటం కూడా తెలియాలి
ఆశ పడ్డం కాదు
ఆశ అదుపు చేయడం కూడా ఎరగాలి

- కోటం చంద్రశేఖర్
9492043348

స్వాతంత్ర భారతావనిలో రాష్ట్రాల ఏర్పాటు



స్వతంత్ర భారతంలో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ ఒక ప్రధాన ఘట్టం. దీని కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ కమిటీలను నియమించగా, అవి పలు సిఫార్సులు చేశాయి. 1955 సెప్టెంబర్ 30న ఫజల్ అలీ కమిషన్ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్రాల పునర్ విభజన కమిటీల గురించి పూర్వా పరాల గురించి తెలిపే ప్రయత్నం.

ఖాన్ బహదూర్ సయ్యద్ సర్ ఫజల్ అలీ 15 అక్టోబర్ 1951నుండి 30 మే 1952 సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా, 1952 నుండి 1956 వరకు ఒడిశా గవర్నర్‌గా మరియు 1956 నుండి 1959 వరకు అస్సాం గవర్నర్‌గా ఉన్నారు. భారతదేశ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ గురించి సిఫార్సులు చేసిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌కు ఫజల్ అలీ నాయకత్వం వహించారు. బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి 1947లో స్వాతంత్ర్యం పొందాకా భారతదేశం వేర్వేరు కేటగిరీలుగా విభజించి వుంది. అవి ఇలా ఉన్నాయి.

పార్ట్ ఎ రాష్ట్రాలు.. (పాత బ్రిటీష్ ఇండియా ప్రావిన్సులు) 9 రాష్ట్రాలు: అస్సాం, బీహార్, బొంబాయి, తూర్పు పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాస్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్. పార్ట్ బి రాష్ట్రాలు (గత సంస్థానాలు లేదా ఒప్పంద రాష్ట్రాల సమూహాలు)...9 రాష్ట్రాలు: హైదరాబాద్, జమ్ము అండ్ కాశ్మీర్, మధ్యభారత్, మైసూర్, పాటియాలా, తూర్పు పంజాబ్, రాష్ట్రాల యూనియన్ (పిఈపిఎస్యు), రాజస్థాన్, సౌరాష్ట్ర, ట్రావెన్కోర్-కొచ్చిన్, వింధ్య ప్రదేశ్. పార్ట్ సి రాష్ట్రాలు (గత సంస్థానాలు లేదా ప్రావిన్సులు)10 రాష్ట్రాలు: అజ్మీర్, కూర్గ్, కూచ్ - బీహార్, భోపాల్, బిలాస్ పూర్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కచ్, మణిపూర్, త్రిపుర. పార్ట్ డి (కేంద్రపాలిత ప్రాంతం)..అండమాన్ అండ్ నికోబార్ దీవులు.

ఇవన్నీ బ్రిటీష్ వారి రాజకీయ, సైనిక, వ్యూహాత్మక ప్రణాళికకు అనుకూలంగా ఏర్పడుతూ వచ్చాయి. స్వతంత్ర్య భారతంలో రాష్ట్రాల సరిహద్దులు పునర్వి భజనకు ఒక ప్రాతిపదిక కావాల్సి వచ్చింది. భాషల ప్రాతిపదికన పునర్విభజన జరగాలన్నది ప్రతిపాదనల్లో ఒకటి. 1920 నుంచి భారత జాతీయ కాంగ్రెస్ ప్రావిన్సులను భాష ప్రాతిపదికన ఏర్పాటు చేయడానికి కట్టుబడి వుంది.

స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రాలను భాషా ప్రాతిపదికన పునర్విభజిస్తా మన్నది కాంగ్రెస్ లక్ష్యాల్లో ఒకటి. ఇది 1945-46 ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీల్లో కూడా చేరింది. విభజన సమయంలో మత వైషమ్యాలతో విపరీతమైన రక్తపాతం, హింస చోటు చేసుకోవడం వంటివి భారతదేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తొలి ఉపప్రధాని, గృహమంత్రి వల్లభ్ భాయి పటేల్ మొదలైన వారిలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుపై వైఖరిలో మార్పు తీసుకు వచ్చింది.

1948లో రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఎస్.కె.దార్ (అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి), జె.ఎన్.లాల్ (న్యాయవాది), పన్నాలాల్ (విశ్రాంత భారత సివిల్ సర్వీసెస్ అధికారి)లతో దార్ కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ తన నివేదికను సమర్పిస్తూ పూర్తిగా కానీ ప్రధానంగా కానీ భాషా ప్రాతి పదికన రాష్ట్రాలను ఏర్పాటు చేయడం దేశ విస్తృత ప్రయోజనాలకు అనుగుణమైనది కాదన్నారు.

దార్ కమిషన్ సూచనలను అధ్యయనం చేయడానికి జవహర్‌లాల్‌నెహ్రూ, వల్లభ్ భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్యలతో జేవీపీ కమిటీ వేశారు. కొత్త ప్రావిన్సుల ఏర్పాటుకు ప్రస్తుతం సరైన సమయం కాదనీ, ఆ కమిటీ తేల్చి చెప్పింది.

డా. అంబేద్కర్ ధార్ కమిషన్‌కు ఒక మెమోరాండం సమర్పించారు (తేదీ 14 అక్టోబర్ 1948) భాషా ప్రావిన్సుల ఏర్పాటుకు మద్దతుగా, ప్రత్యేకంగా మరాఠీ -మహారాష్ట్ర మహారాష్ట్ర బొంబాయి రాజధానిగా ఏర్పడింది.

1952 నాటికి, మద్రాస్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తెలుగు-మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చాలా శక్తిమంతంగా మారింది. తెలుగు మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చేస్తున్న కార్యకర్తలలో ఒకరైన పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 16 డిసెంబర్ 1952 న మరణించారు.

రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (ఎస్సార్సీ) లేదా ఫజల్ అలీ కమిషన్ డిసెంబర్ 29, 1953లో భారత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల సరిహద్దులను పున: సమీక్షించడంలో సలహా ఇచ్చేందుకు ఏర్పరిచింది. కమీషన్ లో ఫజల్ అలీ, కె.ఎం.పణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రూలు ఉన్నారు.

తెలుగు-మెజారిటీ ఆంధ్ర రాష్ట్రం 1953 లో ఏర్పడింది. ఇది దేశవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తించింది, భాషా సంఘాలు ప్రత్యేక రాష్ట్రాల కోసం డిమాండ్ చేశాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కమిషన్ నివేదిక ప్రభుత్వం 30-సెప్టెంబర్ -1955 మధ్యాహ్నం అందుకుంది. ఈ కమిషన్ తన నివేదికలో....మూడు అంచెల (పార్ట్-ఎ/బి/సి) రాష్ట్ర వ్యవస్థను రద్దు చేయాలని, రాజప్రముఖ సంస్థ మరియు పూర్వ సంస్థానాలతో ప్రత్యేక ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఆర్టికల్ 371 ద్వారా భారత ప్రభుత్వంలో ఉన్న సాధారణ నియంత్రణను రద్దు చేయాలని అండమాన్ నికోబార్, ఢిల్లీ మరియు మణిపూర్ 3 రాష్ట్రాలు మాత్రమే కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉండాలని, ఇతర పార్ట్-సి/డి భూభాగాలను పక్క రాష్ట్రాలతో విలీనం చేయాలని నివేదించింది. ఈ నివేదిక 14 డిసెంబర్ 1955 న లోక్ సభలో పెట్టబడింది. కమిషన్ చేసిన సలహాల్లో కొన్నిటిని కేంద్ర ప్రభుత్వం 1956 నాటి రాష్ట్రాల పునర్విభజన చట్టం, 1956లో పరిగణనలోకి తీసుకుంది.

దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్ -ఎ,పార్ట్ -బి, పార్ట్-సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్ వ్యవస్థీ కరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు.. ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీ కరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

1956 తర్వాత గుజరాత్ 15వ రాష్ట్రంగా, నాగాలాండ్ 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది. హర్యానా17వ రాష్ట్రంగా, 18వ రాష్ట్రంగా, మణిపూర్, 19వ రాష్ట్రంగా త్రిపుర, 20వ రాష్ట్రంగా మేఘాలయ 21 వ రాష్ట్రంగా సిక్కిం, 22వ రాష్ట్రంగా, మిజోరాం, 23వ రాష్ట్రంగా, అరుణాచల్ ప్రదేశ్ 24వ రాష్ట్రంగా, గోవా 25వ, ఛత్తీస్‌గఢ్26వ రాష్ట్రంగా, ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000) 27వ రాష్ట్రంగా, జార్ఖండ్ (15 నవంబర్, 2000) 28వ రాష్ట్రంగా జార్ఖండ్‌ను ఏర్పాటు చేశారు.

తెలంగాణ 2 జూన్, 2014న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి 29వ రాష్ట్రంగా 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్ము కాశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయింది. భారత దేశంలో ప్రస్తుతం మొత్తం 28 రాష్ట్రాలు మరియు 8 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

స్వతంత్ర సంస్థలా? రాజకీయంలో బందీలా?



ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించడం, ఓట్లు లెక్కించడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం మాత్రమే కాదు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే వ్యవస్థలు ఉండాలి. పాలకుల నిర్ణయాలకు అడ్డుకట్ట వేయగల స్వతంత్ర సంస్థలు ఉండాలి. అధికార దుర్వినియోగాన్ని నిలదీసే రాజ్యాంగ వ్యవస్థలు ఉండాలి. కానీ నేడు దేశంలో స్వతంత్ర సంస్థల స్వయం ప్రతిపత్తిపై జరుగుతున్న చర్చలు ప్రజాస్వామ్యానికి పెను హెచ్చరికగా మారుతున్నాయి. సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన చోట ప్రభుత్వ నీడలో నడుస్తున్నాయనే అనుమానాలు బలపడితే అది కేవలం ఒక సంస్థ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య కాదు. దేశ ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాద ఘంటిక.

రాజ్యాంగ సంస్థలు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఊడిగం చేయడానికి ఏర్పడిన కార్యాలయాలు కావు. ప్రభుత్వ నిర్ణయాలకు గుడ్డిగా తలూపే ముద్ర వేసే యంత్రాలు అంత కంటే కావు. ప్రజల ప్రయోజనాలను, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత వాటిపై ఉంది. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటేనే స్వతంత్ర సంస్థలుగా గుర్తింపు వస్తుందా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజాన్ని చెప్పే ధైర్యం లేకపోతే ఆ సంస్థలకు స్వయం ప్రతిపత్తి ఉన్నట్టా? ఈ ప్రశ్నలకు పాలకులు సమాధానం చెప్పాలి. స్వతంత్రత అనేది ప్రభుత్వానికి ఇచ్చే కానుక కాదు. అది ప్రజాస్వామ్యం కల్పించిన రాజ్యాంగ బాధ్యత.

2016లో జరిగిన పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. సామాన్య ప్రజలు బ్యాంకుల ముందు క్యూలలో నిలబడ్డారు. చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. పేదల జీవనాధారాలు దెబ్బతిన్నాయి. ఇంతటి కీలక నిర్ణయం విషయంలో రిజర్వ్ బ్యాంకు స్వతంత్రంగా వ్యవహరించిందా? ప్రభుత్వ నిర్ణయాన్ని లోతుగా పరిశీలించిందా? లేక ముందే తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేసిందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు కాపలాదారుగా ఉండాల్సిన కేంద్ర బ్యాంకు ప్రభుత్వ నిర్ణయాల ముందు తన స్వతంత్రతను కోల్పోతే సామాన్యుడి ఆర్థిక భద్రతకు దిక్కెవరు? ప్రభుత్వానికి నచ్చిన నిర్ణయమే సరైనదని చెప్పే సంస్థకు స్వతంత్ర సంస్థ అనే పేరెందుకు?

ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనది ఓటు హక్కు. ఆ ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఎన్నికల సంఘం ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదు. అధికార పార్టీకి ఒక కొలమానం, ప్రతిపక్షానికి మరో కొలమానం ఉంటే అది నిష్పక్షపాత



ఎన్నికల నిర్వహణ కాదు. ఎన్నికల నియమావళి అందరికీ సమానంగా వర్తించాలి. అధికార బలం, ధనబలం, రాజకీయ పలుకుబడి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయకుండా చూడాలి. ఎన్నికల సంఘం నిర్ణయాలపై ప్రజల్లో అనుమానాలు పెరగడం అంటే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకమే సన్నగిల్లడం. ఓటరు వేసిన ఓటుకు విలువ లేకుండా చేసే ఏ వ్యవస్థనైనా ప్రశ్నించాల్సిందే.

స్వతంత్ర సంస్థల స్వేచ్ఛను దెబ్బతీసే మొదటి అడుగు వాటి నియామకాల నుంచే మొదలవుతుంది. కీలక పదవుల్లో ఎవరిని నియమిస్తున్నారు? వారి అర్హత ఏమిటి? వారి ఎంపికలో పారదర్శకత ఉందా? రాజకీయ విధేయతకు ప్రాధాన్యత ఇస్తున్నారా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా రావాలి. అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులనే కీలక పదవుల్లో నియమిస్తే భవిష్యత్తులో ఆ సంస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాయనే నమ్మకం ఎలా కలుగుతుంది? అందుకే నియామక ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాల భాగస్వామ్యం, పారదర్శకత, అర్హతలకు ప్రాధాన్యత ఉండాలి. సంస్థల పునాదులనే రాజకీయ ప్రయోజనాలతో కలుషితం చేస్తే వాటి నుంచి నిష్పక్షపాతాన్ని ఆశించడం పగటి కలే అవుతుంది.

అయితే స్వయంప్రతిపత్తి అంటే ప్రశ్నించడానికి వీల్లేని అధికారం కాదు. ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్న పేరుతో సంస్థలు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీల్లేదు. అధికార దుర్వినియోగం జరిగినా, నిర్ణయాల్లో తప్పులు దొర్లినా, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా ప్రశ్నించే వ్యవస్థ ఉండాలి. ప్రజాస్వామ్య పర్యవేక్షణ, పార్లమెంటరీ సమీక్ష, న్యాయపరమైన పరిశీలనకు సంస్థలు జవాబుదారీగా ఉండాలి. కానీ ఈ పర్యవేక్షణ రాజకీయ కక్షసాధింపుకు ఆయుధంగా మారకూడదు. ప్రభుత్వ పెత్తనం ఒక ప్రమాదమైతే, జవాబుదారీతనం లేని స్వతంత్రత మరో ప్రమాదం. ఈ రెండింటి మధ్య రాజ్యాంగ సమతుల్యతే ప్రజాస్వామ్యానికి రక్షణ.

దేశంలో అధికారాలు శాశ్వతం కావు. పదవులు శాశ్వతం కావు. ప్రభుత్వాలు శాశ్వతం కావు. కానీ రాజ్యాంగం శాశ్వత విలువలతో నిలబడాలి. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే తమకు అనుకూలంగా ఉన్నప్పుడు సంస్థల స్వతంత్రతను సమర్థిస్తూ, ప్రతికూల నిర్ణయాలు వచ్చినప్పుడు వాటిపై దాడి చేసే ద్వంద్వ వైఖరిని రాజకీయ పార్టీలు విడనాడాలి. ప్రజాస్వామ్యం అంటే పాలకుల ఇష్టమే చట్టం కాదు. ప్రజల హక్కులే దాని ప్రాణం. రాజ్యాంగ సంస్థలు పాలకుల కరతాళ ధ్వనులకు అనుగుణంగా పనిచేసే వేదికలుగా మారితే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల తంతుగా మిగిలిపోతుంది.

ఎన్నికల సంఘం కావచ్చు, రిజర్వ్ బ్యాంకు కావచ్చు, మరే ఇతర రాజ్యాంగ సంస్థ కావచ్చు. వాటి విధేయత ప్రభుత్వాల పట్ల కాదు, రాజ్యాంగం పట్ల ఉండాలి. వాటి నిర్ణయాలకు ప్రాతిపదిక రాజకీయ ప్రయోజనాలు కాదు, ప్రజా ప్రయోజనాలు కావాలి. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం పాలన కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విమర్శలను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడమే ప్రజాస్వామ్య పరిపక్వత. సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూసే పాలకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. అధికారం ప్రజలు ఇచ్చేది.. రాజ్యాంగం పరిమితులు విధించేది! స్వతంత్ర సంస్థలను బలహీనపరిస్తే చివరకు బలహీనమయ్యేది పాలకులు కాదు.. ప్రజాస్వామ్యమే!

- వెంక గారి భూమయ్య
9848559863

కొందరుంటారు

మాటల మాయాజాలంతో
మూగ చెవుల్లో విషం చల్లి
అనుమానపు అంటుమొక్కల్ని
మనసుల మధ్య నాటి
నమ్మకాల పునాదుల్ని కదిలిస్తూ
అజ్ఞానపు చీకట్లు పంచే మనుషులుంటారు
అక్కడక్కడా కొందరుంటారు
తోడుగా నిలిచిన జనానికి
డబ్బును ఎరగా వేసి అధికార పీఠం కోసం
పేరు ప్రఖ్యాతుల వేటలో
రంగులు మార్చే పాత్రలతో
ప్రజాభిమానాన్ని సొంతం చేసుకోవాలనే
అవకాశవాద నాయకులు
అక్కడక్కడా కొందరుంటారు
అవినీతినే ఆభరణంగా ధరించి
కుటిల బుద్ధుల్ని కవచంగా మలిచి
అధికార దాహంతో కొత్తకొత్త ముసుగులు తొడిగి
వాగ్దానాల కొవ్వొత్తులు వెలిగించి
ప్రజల ఆశలతో ఆడుకునే
పీఠాధిపత్యపు ప్రబుద్ధులు
అక్కడక్కడా కొందరుంటారు
హంగుల వెనుక నిజాన్ని దాచి
ఆర్భాటాలనే అందంగా చూపి
నిస్వార్థపు మనసుల ప్రాంగణంలో
స్వప్రయోజనాల విత్తనాలు చల్లి
ఆలోచనకు తావివ్వకుండా
అమాయకత్వాన్ని ఆసరా చేసుకునే
వివేకరహితులూ అక్కడక్కడా కొందరుంటారు
జాగ్రత్త బహుజాగ్రత్త

- డాక్టర్ పగిడిపల్లి సురేందర్
8074846063

మణిపుర్ మళ్లీ రక్తసిక్తం



ఒకప్పుడు భిన్న జాతుల సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా నిలిచిన మణిపూర్.. నేడు జాతుల మధ్య చిచ్చుతో అట్టుడుకుతోంది. శాంతి కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు తుపాకీ మోతలు, దాడులు, నిర్బంధాలు, నిరాశ్రయ జీవితాలే మిగులుతున్నాయి. 2023లో ప్రారంభమైన కుకీ-మైతేయి ఘర్షణల గాయాలు మానకముందే, 2026లో కుకీ-నాగా ఘర్షణలు కొత్త సంక్షోభానికి తెరతీశాయి. ఒక ప్రాంతంలో చల్లారిన ఉద్రిక్తతలు మరో ప్రాంతంలో చెలరేగుతుండటం ఆందోళనకరం. ప్రజాస్వామ్య దేశంలో ఒక రాష్ట్రం మూడేళ్లుగా అశాంతితో కొట్టుమిట్టాడుతుంటే, శాశ్వత పరిష్కారం సాధించడంలో పాలకులు ఎందుకు విఫలమవుతున్నారు? అన్నది దేశం ఆలోచించాల్సిన ప్రశ్న.

2023 మే 3న మణిపూర్‌లో కుకీ, మైతేయి వర్గాల మధ్య ప్రారంభమైన హింసలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు, భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నప్పటికీ సాధారణ పరిస్థితులు పూర్తిస్థాయిలో నెలకొనలేదు. ఇంతలో 2026 ఫిబ్రవరి నుంచి కుకీ-నాగా వర్గాల మధ్య కూడా ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఉక్రుల్, కామ్జోంగ్, కాంగ్పోక్పి, నోనీ, తమెంగ్లాంగ్, సేనాపతి వంటి కొండ ప్రాంతాల జిల్లాలు హింసకు కేంద్రాలుగా మారాయి.

అక్టోబర్ 16న వెలువడిన నివేదిక ప్రకారం, ఈ ఏడాది జనవరి 1 నుంచి అక్టోబర్ 10 వరకు మణిపూర్‌లో 300కు పైగా హింసాత్మక ఘటనలు, దాదాపు 100 మరణాలు నమోదయ్యాయి. సెప్టెంబర్లోనే కుకీ-నాగా ఘర్షణల్లో కనీసం 19 మంది మరణించినట్లు నివేదికలు వెల్లడించాయి. అక్టోబర్ 10న కామ్జోంగ్, ఉక్రుల్ జిల్లాల్లో జరిగిన తాజా ఘర్షణల్లోనూ ప్రాణనష్టం సంభవించింది. ఇళ్ల దహనం, ఆకస్మిక దాడులు, లక్ష్యంగా చేసుకున్న హత్యలు ప్రజల్లో భయాందోళనలు పెంచుతున్నాయి.

ఈ పరిణామాలను కేవలం రెండు వర్గాల మధ్య ఘర్షణలుగా చూడలేం. గతంలో నెలకొన్న అవిశ్వాసం, భద్రతపై ఆందోళనలు, భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, పరస్పర ఆరోపణలు సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తున్నాయి. ఒక వర్గంపై జరిగిన దాడికి మరో వర్గం ప్రతీకారం తీర్చుకోవడం.. దానికి మళ్లీ ప్రతిదాడి జరగడం అంతులేని హింసకు దారితీస్తోంది. నేరానికి బాధ్యులెవరో నిష్పక్షికంగా నిర్ధారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోతే, సామూహిక నిందారోపణలతో నిర్దోషులూ బాధితులవుతారు.

మణిపూర్‌లో రవాణా అంతరాయాలు ప్రజల రోజువారీ జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. అత్యవసర వైద్యం, నిత్యావసర సరుకులు, విద్యార్థుల చదువులు, చిన్న వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. మార్కెట్లు మూత పడటం, వాహనాలపై దాడులు, ఇళ్లకు నిప్పు పెట్టడం వంటి ఘటనలు ప్రజల భద్రతను



ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొనడం విచారకరం.

2026 ఏప్రిల్లో వెల్లడైన మణిపూర్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2023 మే 3 నుంచి 2026 మార్చి 30 వరకు 58,821 మంది హింస కారణంగా నిరాశ్రయులయ్యారు. పరిహార చెల్లింపుల ఆధారంగా 217 మరణాలు నమోదైనట్లు ప్రభుత్వం తెలిపింది. మార్చి 10 నాటికి 174 సహాయ శిబిరాలు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. వేలాది ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఈ గణాంకాలు పాత ఘర్షణల అమానవీయ పరిణామాలను స్పష్టం చేస్తున్నాయి. తాజా కుకీ-నాగా ఘర్షణలు ఈ సంక్షోభాన్ని మరింత విస్తరించే ప్రమాదం ఉంది. నిరాశ్రయులైన కుటుంబాలు ఎప్పుడు తమ ఇళ్లకు చేరుకుంటాయో, పిల్లలు ఎప్పుడు పాఠశాలలకు తిరిగి వెళతారో, ఉపాధి కోల్పోయినవారికి ఎప్పుడు జీవనాధారం లభిస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రజల ప్రాణాలను కాపాడటం, బాధితులకు న్యాయం చేయడం, నిరాశ్రయులకు పునరావాసం కల్పించడం ప్రభుత్వం కనీస ప్రాథమిక బాధ్యత.

మణిపూర్ సంక్షోభానికి బలప్రయోగం ఒక్కటే పరిష్కారం కాదు. భద్రతా చర్యలు అవసరమే అయినా, వాటితోపాటు రాజకీయ చొరవ, సామాజిక సామరస్యం, న్యాయబద్ధమైన పరిష్కారం తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, భద్రతా సంస్థలు, కుకీ, మైతేయి, నాగా ప్రతినిధులు ఒకే వేదికపై కూర్చొని నిరంతర చర్చలు జరపాలి. బాధిత వర్గాల ఆందోళనలను వినాలి. గత ఒప్పందాల ఉల్లంఘనలపై వచ్చిన ఆరోపణలను స్వతంత్రంగా విచారించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి.

హింసాత్మక ప్రాంతాల్లో పటిష్ఠమైన భద్రత కల్పించడం, ఆయుధాల అక్రమ రవాణాను అరికట్టడం, సున్నిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం, బాధితులకు తక్షణ పరిహారం అందించడం అత్యవసరం. సహాయ శిబిరాల్లో ఆహారం, వైద్యం, పారిశుధ్యం, విద్య వంటి సదుపాయాలు కల్పించాలి. నిరాశ్రయులైన కుటుంబాలు స్వచ్ఛందంగా, సురక్షితంగా తమ ఇళ్లకు తిరిగి వెళ్లేలా నమ్మకాన్ని కల్పించాలి. దాడులపై నిష్పాక్షిక దర్యాప్తు, బాధితులకు న్యాయం, దెబ్బతిన్న గ్రామాల పునర్నిర్మాణం సమాంతరంగా సాగాలి.

అంతేకాదు, పౌర సమాజ సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, మత పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులను శాంతి ప్రక్రియలో భాగస్వాములను చేయాలి. సామాజిక మాధ్యమాల్లో విద్వేష ప్రచారం, తప్పుడు వార్తలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి. పరస్పర అపోహలను తొలగించే ప్రజా సమావేశాలు నిర్వహించాలి. శాంతి ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించాలి.

మణిపూర్ ప్రజలు కోరుకుంటున్నది ఆధిపత్యం కాదు. ఆత్మగౌరవంతో కూడిన భద్రమైన జీవితం. ప్రతీకారం కాదు,న్యాయం. నిర్బంధాలు కాదు. స్వేచ్ఛగా జీవించే వాతావరణం. ప్రపంచ వేదికలపై శాంతి, అహింస గురించి మాట్లాడే మన దేశం,తనలోని ఒక రాష్ట్రంలో ప్రజలు అభద్రతలో-భయాందోళనల మధ్య బతుకుతుంటే!?. మౌనంగా ఉండకూడదు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. మూడు వర్గాల మధ్య నమ్మకం పునరుద్ధరించాలి.

చివరగా ఒక్క మాట.. ఒకరి రక్తంతో మరొకరి భవిష్యత్తును నిర్మించలేం. ప్రతీకారానికి ప్రతీకారం సమాధానం కాదు; చర్చలు, న్యాయం, పరస్పర గౌరవమే శాశ్వత శాంతికి పునాది. మణిపూర్‌లో మళ్లీ తుపాకీ మోతలు కాదు. పిల్లల నవ్వులు వినిపించాలి. ఆ దిశగా పాలకులు ఇప్పటికైనా మేల్కొనాలి. తస్మాత్ జాగ్రత్త!

- మేకిరి దామోదర్
9573666650

రైతుల వ్యవసాయ అవసరాలకు సహకార సంఘం ద్వారా దీర్ఘకాలిక రుణాలు



- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని అక్టోబర్ 31 (మనం న్యూస్): రైతుల ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని ద్వారా సంఘ సభ్యులకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. శనివారం సంఘ కార్యాలయంలో సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్యల చేతుల మీదుగా రూ.26 లక్షల విలువగల దీర్ఘకాలిక రుణాల చెక్కులుఅందజేశారు.షీప్ లోన్ కింద మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన జీల్ల వజ్రమ్మ కు రూ.5లక్షలు, కర్షకమిత్ర ద్వారా విలోచవరం గ్రామానికి చెందిన కొండ

శంకరయ్యకు రూ.10లక్షలు,కొండ సమర సేన్ కు రూ.5లక్షలు,నాగారం గ్రామానికి చెందిన మారేపల్లి భాస్కర్ రెడ్డికి రూ.6లక్షల చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పెట్టుబడులతో పాటు ఇతర అవసరాలకు ఆర్థిక చేయూత అందించేందుకు సంఘం ద్వారా వివిధ రకాల దీర్ఘకాలిక రుణాలు అందజేస్తున్నామని తెలిపారు సంఘ సభ్యులు ఈ రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

అర్హులైన సంఘ సభ్యులు అవసరమైన పత్రాలతో పీఏసీఎస్ మంథని కార్యాలయాన్ని సంప్రదించి రుణ సదుపాయాలను పొందాలని కొత్త శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు,సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘనంగా నివాళి

- భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు



జగిత్యాల అక్టోబర్ 31(మనం న్యూస్): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని భారత్ సురక్ష సమితి జగిత్యాల జిల్లా శాఖచే రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో గల పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సమితి నాయకులు ఏసీఎస్ రాజు అక్కినపల్లి కాశీనాథం సమరసత వేదిక కరీంనగర్ విభాగ్ సంయోజక్ చిట్ల గంగాధర్ లు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశానికి మొదటి ఉప ప్రధానిగా హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడని దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత భౌగోళికంగా భారతదేశం ముక్కలు కాకుండా ఒక్కటి చేసిన మహనీయుడని కీర్తించారు. మనకు స్వాతంత్రం వచ్చేనాటికి దేశంలో ఉన్న 565 కు పైగా స్వదేశీ సంస్థానాలను ఇండియన్ యూనియన్ లో విలీనం చేసి అఖండ భారత దేశానికి పునాదులు వేసిన మహనీయుడని ఉక్కుమనిషి ఇండియన్ బిస్మార్క్ గా ప్రసిద్ధి చెందాడని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న మన తెలంగాణకు నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి కల్పించాడని, తెలంగాణలో ప్రజలు నిజాం పాలనలో బానిసల్లాగా బ్రతుకుతూ అనేక చిత్రహింసలకు గురయ్యారని స్త్రీల మానప్రాణాలకు రక్షణ లేని పరిస్థితులు ఉండేవని ఇలాంటి రాక్షస, అరాచక పరిపాల నుండి 1948 సెప్టెంబర్ 17న మనకు విముక్తి కల్పించే స్వేచ్ఛ వాయువుల్ని పీల్చుకునే స్వాతంత్రాన్ని ప్రసాదించిన గొప్ప వ్యక్తిని ఇలాంటి స్వాతంత్రోద్యమ మహనీయుల యొక్క జయంతి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం మన బాధ్యతని అన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో ప్రపంచంలోనే అతి ఎత్తైన ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, ఇతని పుట్టినరోజును జాతీయ ఐక్యత దినంగా జరుపుకుంటారని దేశం కోసం త్యాగాలు చేసిన ఇలాంటి నాయకుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి సింగం గంగాధర్, 22వ వార్డు కౌన్సిలర్ ఆరవ లక్ష్మి, కొత్తకొండ బాలన్న, గాదాసు భూమన్న, నరేందుల శ్రీనివాస్, ఎడమల వెంకట్ రెడ్డి, చిలుక రాజన్న, వంగల భాస్కర్, ఇల్లెందుల పురుషోత్తం, గండ్ర ప్రవీణ్ రావు, కొక్కిరాల గోపాలరావు, ఆడెపు జానయ్య, సిరిపురం గంగారం, నాయిని సంజీవరావు, బండి సత్యం, దొనకంటి జనార్దన్ రెడ్డి, పెండెం గంగాధర్ లు పాల్గొన్నారు.

మనం పత్రిక కథనానికి స్పందించిన అధికారులు!



- వృద్ధ దంపతుల రైస్ మిల్ లీజు వ్యవహారంపై డీఎస్ఓ అధికారుల విచారణ
- సీబీఎం రైస్ మిల్లులో తనిఖీలు
- సంబంధిత వ్యక్తుల నుంచి స్టేట్మెంట్ నమోదు

సిరిసిల్ల, అక్టోబర్ 31 (మనం ప్రతినిధి): వృద్ధ దంపతులకు సంబంధించిన రైస్ మిల్ లీజు వ్యవహారంపై మనం పత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లై శాఖకు చెందిన డీఎస్ఓ అధికారులు సీబీఎం రైస్ మిల్లును సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ వ్యవహారానికి సంబంధించి వివరాలు సేకరించడంతో పాటు సంబంధిత వ్యక్తుల నుంచి స్టేట్మెంట్ నమోదు చేసినట్లు సమాచారం. రైస్ మిల్ లీజు వ్యవహారంలో ప్రభుత్వానికి రూ.7-8 కోట్ల మేర బకాయిలు ఉన్నాయంటూ గతంలో వెలుగులోకి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అధికారుల తనిఖీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. లీజు ఒప్పందం, ధాన్యం నిల్వలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు తదితర అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలనే డిమాండ్ వినిపిస్తోంది. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుందని రైస్ మిల్లును లీజుకు ఇచ్చిన వృద్ధ దంపతులకు న్యాయం జరగాలని, ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని బాధితులు కోరుతున్నారు. మనం పత్రికలో కథనం ప్రచురితమైన అనంతరం అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. అయితే అధికారుల విచారణలో వెల్లడయ్యే పూర్తి వివరాలు, తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. వృద్ధ దంపతులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తరప్రదేశ్ సరిహద్దు వద్ద, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతి


- ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు




చిగురుమామిడి, అక్టోబర్ 31 (మనం న్యూస్): భారతదేశపు ఉక్కు మహిళ, మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతిని హుస్నాబాద్, చిగురుమామిడి, కోహెడ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా శనివారం నిర్వహించారు. వర్ధంతి సందర్భంగా చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ సరిహద్దు వద్ద హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు సంయుక్తంగా మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఇందిరా గాంధీ తీసుకున్న ధైర్య నిర్ణయాలు, బ్యాంకుల జాతీయీకరణ, గరీబీ హఠావో నినాదం, పాకిస్థాన్ పై విజయం సాధించి బంగ్లాదేశ్ ఏర్పాటుకు కృషి చేయడం వంటి ఎన్నో విషయాలను గుర్తు చేసుకున్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆమె జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయురాలు ఇందిరమ్మ అని, ఆమె ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఆమె చూపిన మార్గంలో నడుస్తూ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అనంతరం జోహార్ ఇందిరమ్మ, జై కాంగ్రెస్, జై పొన్నం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు వివి రమణ, చిగురుమామిడి మండల అధ్యక్షులు అందే సురేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మార్కరాజు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, వడ్డెర కార్పొరేషన్ వైస్ చైర్మన్ బత్తుల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయిని వేణు గోపాల్, డీసీసీ కార్యదర్శి సాంబార్ బాబు, రేకొండ సర్పంచ్ అల్లపు సంపత్, గ్రామ శాఖ అధ్యక్షులు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, సుందరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త దుబాల శ్రీనివాస్, ఎనగందుల లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షులు పచ్చిమట్ల జగన్ గౌడ్, ఉప సర్పంచ్ రాజేంద్రప్రసాద్, సైదాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సాయి, కోహెడ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంచె చేను మేసిన వైనం..!

ఉద్యోగులకు కేటాయించిన స్థలాల మాటున రెవెన్యూ కార్యాలయ భూమికీ ఎసరు..?





జమ్మికుంట, అక్టోబర్ 31 (మనం న్యూస్): కంచే చేను మేసిన తీరుగా ఉంది ఈ తహసిల్దార్ కార్యాలయం పరిస్థితి. భూ సమస్యలు ఉంటే పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు తమ కార్యాలయానికి చెందిన భూమిని ఇతరులు అన్యాక్రాంతం చేస్తున్నారని తెలిసిన చూచి చూడనట్లు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తుంది. వివరాల్లోకి వెళితే... జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం ముందు ఉన్న సర్వేనెంబర్ 629లోని ప్రభుత్వ భూమిని గత 20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సొసైటీగా ఏర్పడిన ఉద్యోగస్తులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించింది. అయితే ప్రస్తుతం ఆ భూమి లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలకే పరిమితం కాకుండా, పక్కనే ఉన్న రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన భూమిలోనూ హద్దులు ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని సొంత అవసరాలకు వినియోగించుకోవాల్సిన లబ్ధిదారులు, ప్రభుత్వ కార్యాలయానికి చెందిన భూమిలోకి సైతం హద్దులు విస్తరించుకోవడంపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూమి ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెవెన్యూ అధికారులు తమ నిర్లక్ష్య ధోరణి విడనాడి సదరు భూమికి సంబంధించిన ప్రభుత్వ రికార్డులు, సొసైటీకి కేటాయించిన విస్తీర్ణం, ప్రస్తుతం ఏర్పాటు చేసిన హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు నిర్ధారణ అయితే హద్దులను తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శబరిమల యాత్రికులకు రూ. 2 లక్షల జీవిత బీమా

- ప్రకటించినందుకు ప్రభుత్వానికి, టీడీబీకి కృతజ్ఞతలు
- హుస్నాబాద్ అయ్యప్ప ఆలయ కమిటీ





చిగురుమామిడి, అక్టోబర్ 31 (మనం న్యూస్): శబరిమల యాత్రికులకు తొలిసారిగా రూ. 2 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని ప్రకటించిన ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు నిర్ణయం పట్ల హుస్నాబాద్ శ్రీ అయ్యప్ప ఆలయ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, దేవస్వం బోర్డుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా హుస్నాబాద్ అయ్యప్ప ఆలయ చైర్మన్ ఆకుల వెంకట్, గౌరవ అధ్యక్షులు సుద్దాల చంద్రయ్య, వివి రమణలు మాట్లాడుతూ, రాబోయే మండల-మకరవిళక్కు యాత్రా కాలంలో భక్తులకు భారతీయ జీవిత బీమా సంస్థ సహకారంతో రూ. 2 లక్షల జీవిత బీమా కల్పించడం చారిత్రాత్మకమని కొనియాడారు. ప్రీమియం మొత్తాన్ని దేవస్వం బోర్డు తన సంక్షేమ నిధి నుండి భరించడం, భక్తుల నుండి ఎలాంటి అదనపు చెల్లింపు లేకుండా వర్చువల్ క్యూ నమోదు సమయంలో వారసుల వివరాలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. అలాగే శబరిమలలో రోజుకు 2 లక్షల అరవణ ప్రసాద డబ్బాల ఉత్పత్తి, నవంబర్ 10 లోపు అన్ని మౌలిక సదుపాయాలు, నీలక్కల్, పంపా వద్ద స్వాగత కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందుకు దేవస్వం బోర్డుకు కృతజ్ఞతలు తెలిపారు.

రవాణా సౌకర్యాలపై విజ్ఞప్తి...

ఇదే విధంగా రమణ, చైర్మన్లు మాట్లాడుతూ, ప్రస్తుతం శబరిమల యాత్రకు వెళ్లే భక్తులకు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నీలక్కల్ నుండి పంపా వరకు వేరే బస్సు మారాల్సి రావడం వల్ల చాలా మంది అయ్యప్ప భక్తులకు ఇబ్బంది కలుగుతోందని, అందువల్ల రైల్వే నిలయం నుండి పంపా వరకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే దర్శనం అనంతరం పంపా నుండి కేవలం బస్సు నిలయం వరకు మాత్రమే కాకుండా, పంపా నది దగ్గర నుండి, పెట్రోల్ బంక్ సమీపం నుండి కొట్టాయం, చెంగన్నూర్ వెళ్లే బస్సులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల దర్శనం పూర్తి చేసుకుని తిరిగి వెళ్లే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ఇరుకులో ఇబ్బంది పడకుండా నేరుగా తమ ప్రాంతాలకు వెళ్లే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.




- స్వామీజీ ఆశీస్సులు పొందండి
- టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు

పార్టీలకు అతీతంగా తరలిరండి..

మంథని, అక్టోబర్31(మనం న్యూస్): అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆదివారం ధన్వాడ,మంథని పట్టణాల్లో పర్యటించనున్న నేపథ్యంలో పార్టీలకు అతీతంగా ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామీజీ ఆశీస్సులు పొందాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల.శ్రీనుబాబు పిలుపునిచ్చారు. శనివారంమంథని పట్టణంలో నిర్వహించిన సమావేశంలో శ్రీను బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మైసూర్ నుంచి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారిని మంథని నియోజకవర్గానికి తీసుకువస్తున్నారని తెలిపారు.సచ్చిదానంద స్వామీజీ వారు జ్ఞానాన్ని,భక్తి మార్గాన్ని బోధిస్తూ ఎంతోమంది భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు.పరమ పూజ్యులైన స్వామీజీ వారి దివ్య దర్శనం,ఆశీస్సులు పొందే అవకాశం ధన్వాడ,మంథని ప్రాంత ప్రజలకు దక్కడం ఎంతో మహాభాగ్యమని అన్నారు. వారిఆశీస్సులతో ప్రతి ఇంటా శాంతి, సంతోషం,ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. సచ్చిదానంద స్వామీజీ ఆదివారం ఉదయం10:00 గంటలకు ధన్వాడ, మధ్యాహ్నం2:00 గంటలకు: మంథని పట్టణంలోని శివకిరణ్ గార్డెన్స్ లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో హాజరై స్వామీజీ ఆశీస్సులు పొందాలని దుద్దిళ్ల. శ్రీనుబాబు కోరారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో శ్రీ సచ్చిదానంద స్వామిజీ పర్యటన సందర్భంగా ధన్వాడ,మంథనిలో అన్ని ఏర్పాట్లు చేశారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల చైర్మన్లు,మండల అధ్యక్షులు,మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ పాలన

- భారతదేశ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ
- కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు



పటాన్ చెరు అక్టోబర్ 31 (మనం న్యూస్) : తన పరిపాలన దక్షతతో భారత దేశ ఉక్కుమహిళగా పేరుగాంచిన వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని చిట్కుల్ లోని ఆయన నివాసంలో, దేశ ప్రజలకు ఆమె అందించిన సంక్షేమాని స్మరించుకుంటూ ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పేదలకు సంక్షేమం, అభివృద్ధిని దగ్గరికి చేసి భారతీయుల గుండెలో పదిలంగా నిలిచిపోయారని తెలిపారు. ఆనాడు ఆ మహానేత ముందు చూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు. ఇందిర మ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తుందని నీలం మధు తెలిపారు.

బాలికపై దాడి ఘటనపై ఏపీ మంత్రి సవిత ఆగ్రహం

- అధికారులకు తక్షణ ఆదేశాలు!
- రాప్తాడు పాఠశాల విద్యార్థిని గోపికలక్ష్మిపై దాడి
- ఘటనపై వెంటనే స్పందించిన ఏపీ మంత్రి
- కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి న్యాయానికి చర్యలు చేపట్టాలని సూచన!

గోరంట్ల, అక్టోబర్ 31 మనం న్యూస్: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నప్పటికీ.. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని గోపికలక్ష్మిపై జరిగిన దాడి ఘటన మంత్రి సవిత దృష్టికి రావడంతో ఆమె వెంటనే స్పందించారు. బాలికపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న మంత్రి తీవ్రంగా స్పందిస్తూ, ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడారు. బాధిత విద్యార్థినికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. గోరంట్ల మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న సమయంలోనూ ఘటనపై వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడిన మంత్రి సవిత, బాధిత విద్యార్థినికి న్యాయం జరగాలన్న అంశంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మంత్రి సీతక్క సహకారంతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- తిమ్మంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- గుమ్మడి సోమయ్య,చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు



మంగపేట, అక్టోబర్ 31: తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద, బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను అమలు చేస్తోందని పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.

శనివారం రోజు మంగపేట మండలంలోని తిమ్మంపేట గ్రామంలో ఈరోజు నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రజల అవసరాలను గుర్తించి,పేద కుటుంబాలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.


తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని,ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వివరించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు,గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సహకారం,మార్గదర్శకత్వంలో ములుగు జిల్లా అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు,గడ్డం పరమేష్, బొంబోతుల మురళి, యగ్గడి అర్జున్, బోడ రామచంద్రం మరియు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అధికారులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచన



సంగారెడ్డి అక్టోబర్ 31(మనం న్యూస్ ప్రతినిధి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులను కోరారు. కంది మండల కేంద్రంలో పీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో రైతులందరికీ సమాన ప్రాధాన్యత కల్పించాలని, ఎలాంటి దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించాలని సూచించారు. ప్రతి క్వింటాల్ ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ను తప్పనిసరిగా అందించాలని, గత ఏడాది నుంచి పెండింగ్లో ఉన్న బోనస్ను సైతం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఏడాది రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, పంట రుణాలు, ఎరువుల కొరత వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు సరిపడా అందుబాటులో ఉంచాలని, ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

కొనుగోలు కేంద్రంలో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో పెండింగ్లో ఉన్న రైతు బీమా పరిహారాన్ని అర్హులైన రైతులందరికీ త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరినట్లు తెలిపారు.

రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని, అన్నదాతకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, ప్రభుత్వ ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చూడాలని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

సిద్దిపేటలోజువె నైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించిన హైకోర్టు జడ్జి



సిద్దిపేట, అక్టోబర్ 31 (మనం ప్రతినిధి): రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కే. శరత్ శనివారం సిద్దిపేట జిల్లాలో పర్యటించి జిల్లా కేంద్రంలోనీ సంతోషిమాత ఆలయం దగ్గరలో జువెనైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించారు. జిల్లా కోర్టు ఆవరణలో కోర్టు సిబ్బంది మరియు కోర్టు పనుల మీద వచ్చే ప్రజల సౌకర్యార్థం మెడికల్ డిస్పెన్సరీని ప్రారంభించి వసతులను పరిశీలించారు. అనంతరం కోర్టు భవనంలోని మూడో ఫ్లోర్ లో గల కాన్ఫరెన్స్ హాల్లో జ్యూడీషియల్ అధికారులతో జ్యుడీషియరీ రివ్యూ లో పాల్గొన్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకున్న అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె శరత్ కు జిల్లా జడ్జి జి. సుదర్శన్, జిల్లా కలెక్టర్ కే. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్ లు పూల బోకే అందించి స్వాగతం పలికారు. పోలీసు వారు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు జడ్జి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, అదన్నపు డిసిపి కుషాల్కర్, బార్ అసోసియేషన్ సభ్యులు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, న్యాయశాఖ, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి



- నరేందర్ రెడ్డి, సర్దార్ ఖాన్, నాయిని యాదగిరి

గజ్వేల్, అక్టోబర్ 31 మనం న్యూస్: భారతదేశ ఐక్యత, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన భారత ఉక్కు మనిషి మాజీ కాంగ్రెస్ పార్టీ చార్య అధ్యక్షుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ సీనియర్ నాయకులు నాయిని యాదగిరి పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్దార్ ఖాన్ మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పటేల్ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యం అనంతరం వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ ఐక్యతకు పునాది వేశారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యలపై పోరాడిన గొప్ప నాయకుడిగా, దేశ సమగ్రత కోసం కృషి చేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. నేటి సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని, యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, సామాజిక సామరస్యం కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ విష్ణువర్ధన్ రెడ్డి ఉపేందర్ రెడ్డి రమేష్ రాముల గౌడ్ , గుంటుకు శీను, గాడిపల్లి శీను, రేగొండ గౌడ్, చెప్పాల శేఖర్, అంజద్,షరీఫ్, సారిక రెడ్డి, వహీద్, బెజగామా బాబు, జూపల్లి లక్ష్మణ్ జాంగిర్, షకీల్,గుండు లక్ష్మణ్, అక్కారం యాదగిరి, శ్రీగిరిపల్లి కుమార్ డప్పు గణేష్, కొడ్కొండ్ల బాలు, సమీర్,ప్రమోద్, ప్రభాకర్ పూజారి శ్రవణ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించద్దు



సదాశివనగర్, అక్టోబర్ 31 (మనం న్యూస్): పౌర హక్కులకు ఎవరు కూడా భంగం కల్గించొద్దని సదాశివనగర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ చిన్నారెడ్డి అన్నారు. పద్మాజీవాడి గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని, అన్ని కులాలు, వర్గాల వారు సోదరభావంతో మెలగాలని సూచించారు. ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, విడిసి అధ్యక్షులు కవీన్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫిసర్ జయపాల్, జిపిఓ హరీష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వ్యవసాయ రంగంలో వినూత్న సాంకేతిక పరిజ్ఞాన వినియోగం అవసరం



సిద్దిపేట అక్టోబర్ 31 (మనం ప్రతినిధి): జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన అగ్రిస్టాక్ డేటా సంతృప్త స్థాయి సాధన, వ్యవసాయ రంగంలో వినూత్న సాంకేతిక పరిజ్ఞాన వినియోగాల గుర్తింపుపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుల వివరాలు, భూముల రికార్డులు, డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను సమగ్రంగా అనుసంధానం చేసి, వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంపొందించడం, రైతులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించడం, గ్రామ స్థాయిలో వ్యవసాయ ప్రణాళికలను రూపొందించడం వంటి అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఐదు అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. భూముల రికార్డులు, రైతుల వివరాల సమగ్రత, రైతులకు ప్రభుత్వ పథకాలు, సేవల అందజేత, పంటల సాగు ప్రణాళిక, వ్యవసాయ విస్తరణ సేవలు,పంటల పర్యవేక్షణ, నష్టాల అంచనా, బీమా, మార్కెటింగ్, కొనుగోళ్లు, రవాణా, పంట అనంతర నిర్వహణ అగ్రిస్టాక్ డేటాను సమర్థవంతంగా వినియోగిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ అగ్రి స్టాక్ ద్వారా రైతుల నమోదు, భూముల వివరాలు, పంట సాగు వివరాలు, సమగ్రంగా నమోదు చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో సమర్థవంతమైన సేవలు అంది వస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా కోపరేటివ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన టిఆర్ఎస్ను బలోపేతం చేస్తాం

- తెలంగాణ రక్షణ సేన ఎస్టీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్ నాయక్
- రుద్రారం శ్రీ సిద్ధి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు



పటాన్చెరు, అక్టోబర్ 31 (మనం న్యూస్): తెలంగాణ రక్షణ సేన పార్టీని గ్రామ గ్రామానికీ విస్తరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆ పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నేనావత్ శంకర్ నాయక్ తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా తనకు బాధ్యతలు అప్పగించిన సందర్భంగా శనివారం పటాన్చెరు మండలం రుద్రారం గ్రామంలోని గణేష్గడ్డ శ్రీ సిద్ధి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురా లు కల్వకుంట్ల కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి నెమలికొం డ వేణుమాధవ్, మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి సిద్ధి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారి సమక్షంలో శంకర్ నాయక్ విలేకరులతో మాట్లాడుతూ.. ఉచిత విద్య, వైద్యం అందించడం, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడం, సామాజిక న్యాయం సాధించడం లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ప్రజా పోరాటానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన ఆశయాలు, పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని, ముఖ్యంగా గిరిజనులు, బడుగు బలహీన వర్గాలను పార్టీతో అనుసంధానం చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడంలో సహకరించిన జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి నెమలికొండ వేణుమాధవ్తో పాటు రాష్ట్ర నాయకులు రూప్సింగ్, కల్యాణ్ నాయక్, రవిచంద్ర, అర్చన సేనాపతి, తయితర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, బస్వరాజ్, ఎర్రనూరు ఉప సర్పంచ్ పరమేశ్ నాయక్, విశాల్ నాయక్, నవీన్ నాయక్, ప్రకాష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ సన్మానం



ఖమ్మం, అక్టోబర్ 31(మనం న్యూస్)ః ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డ్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతాయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో యంవి.సత్యనారాయణ, (ఎస్ఐ), బి. కృష్ణ ప్రసాద్ రావు (ఎస్ఐ), సిహెచ్. నాగేశ్వరావు (ఏఎస్ఐ), బి.తిరుపతి రావు (ఏఎస్ఐ), బి.రాము (హోంగార్డ్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ ఏసీపీ నర్సయ్య ,ఆర్ఐలు కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాథ్, హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను,జాతీయ ఉపాధ్యక్షులు సిసి 21 ఈ. వెంకటేశ్వర్లు, సంక్షేమ సంఘం సీనియర్ అడ్వైజర్ డి.రమేష్, అడ్వైజర్ సిహెచ్.నాగరాజు, గురుమూర్తి, గౌస్ పాషా, అసిన్ అహ్మద్, పవన్, నాగరాజు, హోంగార్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్బంగా చిత్రపటానికి ఘన నివాళులు



జాతీయ ఐక్యతా స్ఫూర్తితో ఉరకలెత్తిన 2కె రన్

సిద్దిపేట, అక్టోబర్ 31 (మనం ప్రతినిధి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం లో 2 కి.మీ ఏక్తారన్ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేందర్ , టు టౌన్ ఇన్స్పెక్టర్ మురళీ, త్రి టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు , సిద్దిపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ముత్యం రాజు , పాల్గొని పరుగు కార్యక్రమాన్ని ప్రారంభించి, 200 మంది పైగా విద్యార్థులతో పరుగెత్తి వారిని ప్రోత్సహించారు. జాతీయ ఐక్యత, సమైక్యతా స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన 2కి.మీ ఏక్తా రన్లో ఉత్సాహంగా విద్యార్థులు, వాకర్స్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏసిపి సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన, 2 కి మీ రన్ జాతీయ ఐక్యత, సమగ్రత పట్ల ప్రజల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు



ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక దృఢత్వంపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన అపారమైన సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు , అనంతరం జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.

పేరుకు తగ్గట్టు 'ప్రాచీన్' యాజమాన్యం వైద్య సేవలందించాలి

మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

పటాన్చెరులో ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్స్ ప్రారంభం

పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి



పటాన్చెరు, అక్టోబర్ 31 (మనం న్యూస్): ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్స్ పేరులోనే భారతీయ సంస్కృ తి, సంప్రదాయాల ప్రతిబింబం కనిపిస్తోందని, అదే స్ఫూర్తితో పేరుకు తగ్గట్టుగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు యాజమాన్యానికి సూచించారు. పటాన్చెరు పట్టణ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్స్ను మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేయడంతో పాటు జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రి వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభా, మారుతున్న జీవనశైలి నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల అవసరం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. పటాన్చెరు పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడి ప్రజలతో పాటు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం అవసరమని పేర్కొన్నారు. ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్స్ యాజమాన్యం ఈ ప్రాంత ప్రజలక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి ఏర్పాటుతో పటాన్చెరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యానికి ఎంపీ రఘునందన్ రావు అభినందనలు తెలిపారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి

పటాన్చెరు పారిశ్రామికంగా, జనాభా పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు ఏర్పాటు కావడం అవసరమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. వైద్య సేవలు కేవలం ఆర్థిక స్థోమత కలిగిన వారికే పరిమితం కాకుండా పేదలకు సైతం అందుబాటులో ఉండాలని సూచించారు. నూతనంగా ప్రారంభమైన ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్స్ పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రి యజమానియానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ మహిళా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఆసుపత్రి చైర్మన్ వెంకట్ ఆలపాటి, అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు కే. సంజీవరెడ్డి, రమా సంజీవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు పుష్ప నగేష్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బీజేపీ నాయకులు నర్సింగ్ గౌడ్, రాంబాబు గౌడ్, కొండ లక్ష్మణ్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

అసలైన హంతకులను తక్షణమే అరెస్టు చేయాలి

సామినేని రామారావు హత్య కేసును నీరుగార్చే ప్రయత్నాలను ఆపాలి

సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం



ఖమ్మం, అక్టోబర్ 31(మనం న్యూస్): సామినేని రామారావు హత్య కేసులో అసలైన నిందితులను కాపాడేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా పోలీస్ అధికారి సునీల్ దత్ ప్రయత్నిస్తున్నారని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఈ ప్రయత్నాలను తక్షణమే ఆపి, కేసును నీరుగార్చకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్టి రోడ్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో దిష్టిబొమ్మను దగ్ధం చేసి ఆయన మాట్లాడారు. సామినేని రామారావు హత్య అత్యంత దారుణమైన ఘటన అని, ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు, కుట్రదారులు, ప్రత్యక్షంగా పాల్గొన్న వ్యక్తులను సమగ్ర దర్యాప్తు ద్వారా వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కేసు ప్రారంభం నుంచే రాజకీయ దురుద్దేశంతో కొందరిని తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న జిల్లా పోలీస్ అధికారి మంత్రికి అనుకూలంగా వ్యవహరిస్తూ పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠకు మచ్చ తెస్తున్నారని విమర్శించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, హత్యకు పాల్పడిన అసలైన నిందితులతో పాటు హత్యకు కుట్ర పన్నిన వారిని కూడా గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తులో పారదర్శకత పాటించి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని, నేరస్థులు ఎంతటి రాజకీయ పలుకుబడి కలిగిన వారైనా చట్టం ముందు నిలబెట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, మడిపల్లి గోపాల్ రావు, ఎస్కె మీరా సాహెబ్, భుక్యా శ్రీనివాసు రావు, ఎస్ నవీన్ రెడ్డి, పి రమ్య, బండారు రమేష్, ఎస్కె నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, బత్తుల ఉపేంద్ర, కె దేవేందర్, వజేనేపల్లి శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు

ప్రజల భద్రతకు భరోసా..

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యమే ధ్యేయం: పోలీస్ కమిషనర్



ఖమ్మం, అక్టోబర్ 31(మనం న్యూస్): ప్రజల భద్రతకు భరోసా.. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యమే ధ్యేయంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమన్ని నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఇటీవల కాలంలో టేకులపల్లి లోని కేసీఆర్ టవర్ ప్రాంతంలో కొంతమంది గంజాయి సేవిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో ఖమ్మం డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సిఏఆర్ ఫోర్స్, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్, ఈగల్ ఫోర్స్, క్లూస్ టీమ్, మొత్తం 286 మంది పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేయడంతో పాటు కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 బ్లాక్ లలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు,5 ఆటోలు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. అదేవిదంగా 105 మంది వేలిముద్రలు తీసుకొని పరిశీలించడం జరిగింది. గంజాయి అమ్ముతున్న ఇద్దరిని, గంజాయి సేవిస్తున్న 12 మంది, 50 గ్రాముల పొడి గంజాయి,ముగ్గురు చోరి నిందితులను, ఇద్దరు అనుమానితులు గుర్తించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.ఈ ప్రాతంలో స్థానిక ప్రజలు కోరుకున్నట్లు పోలీస్ పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేస్తామని, బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దు సూచించారు. మీ కుటుంబం కోసం.. మీ పిల్లల భవిష్యత్తు కోసం.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నేటి మీ అప్రమత్తతే.. రేపటి మీ పిల్లల భద్రమైన భవిష్యత్తన్నారు. గంజాయి విక్రయదారుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేసి గంజాయి రహిత సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరిస్తూ.. యువత భవిష్యత్తును కాపాడటంలో భాగస్వాములు కావాలన్నారు. అదేవిదంగా స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వల్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై, నేరస్తుల కదలికపై నిరతరం నిఘా ఉంటుందన్నారు. స్థానికంగా ఏలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వుండాలని సూచించారు. అక్రమ సంపాదనకు అలవాటు పడి మోసాలకు పాల్పడుతున్న మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. అలాగే ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల నుండి అప్రమత్తంగా వుండాలని, మీ బ్యాంక్ ఖాతా వివరాల కోసం వచ్చే కాల్స్, ఈమెయిల్స్ కు స్పందించవద్దని సూచించారు. ముఖ్యంగా అపరిచితుల పట్ల అప్రమత్తంగా వుండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే స్థానిక పోలీసులకు కాని డయల్ 112కు సమాచారం ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఇంటిని అద్దెకు ఇచ్చేటప్పుడు వారి చిరునామా, ఆధార్ కార్డులు చూసిన తరువాతనే ఇంటిని అద్దెకు ఇవ్వాలని స్థానికులకు వివరించారు. ఇలాంటి అకస్మిక తనీఖీ ద్వారా నేరస్థులను గుర్తించడంతో పాటు నేరాలను నియంత్రించేందుకు దోహదపడుతుందన్నారు. నేరాల నియంత్రణ కోరకు నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు , బ్లూకోలట్స్ సిబ్బంది ఆయా ప్రాంతల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడంతో పాటు పాత నేరస్థుల సమాచారాన్ని సేకరించడం చేస్తారని తెలిపారు.స్థానిక ప్రజలకు ఎలాంటి అభద్రత భావం లేకుండా ఇలాంటి ఆకస్మికంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం,ఏసీపీలు రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్, సిసియస్ ఏసీపీ సర్వర్, సిఐలు సాదిక్ పాషా, చిట్టిబాబు, కరుణాకర్, శివప్రసాద్, నాగరాజు, ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్, పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



ఖమ్మం, అక్టోబర్ 31(మనం న్యూస్): సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయం, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రామానుజం,కుమారస్వామి, ఏసీపీలు సాంబరాజు నర్సింహారావు, ఏవో కళావతి, ఆర్ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాథ్, మినిస్ట్రీయల్ స్టాఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామినేని రామారావు హత్య కేసులో నిజమైన నిందితులను శిక్షించాలి

భట్టి విక్రమార్క ఆదేశాలతో కేసును పక్కదారి పట్టిస్తున్న ఖమ్మం సిపి


సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 31(మనం న్యూస్): సామినేని రామారావు హత్య కేసులో నిజమైన నిందితులను శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక మంచికంటి భవన్లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగిన సామినేని రామారావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావును హత్య చేసి సంవత్సరం గడుస్తున్న నిందితులను గుర్తించి వారిని శిక్షించడంలో ఖమ్మం పోలీస్ యంత్రాంగం నిందితులకు తొత్తుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అసలు రామారావు హత్యకు కారణమైన దోషులు కుటుంబం ఫిర్యాదు చేసిన వ్యక్తులపై విచారణ చేయకుండా వేరొక కేసులో కోర్టు వాయిదాకి వచ్చిన ముద్దాయిలను అక్కడికక్కడే పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి వారే దోషులని మసిబూసి మారేడు కాయ చేశారని ఆరోపించారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ అధికార పార్టీకి అండగా ఉంటూ దోషులను కాపాడే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి సిట్ విచారణ చేపట్టి దోషులను శిక్షిస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయకుండా ఖమ్మం సిపి దోషులను కాపాడుతున్నారని ఆరోపించారు. సామినేని రామారావు భార్య తన భర్త హత్యకు పాతర్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులే అని పోలీసులకు ఫిర్యాదులో రాసి ఇచ్చినప్పటికీ పోలీసులు ప్రత్యేకించి సిపి వారి పేర్లను కనీసం పరిశీలన చేసి విచారణ చేయకుండా వారికి రక్షణగా నిలుస్తున్నాడన్నారు. ఇది న్యాయాన్ని హత్య చేయడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. సామినేని రామారావు హత్యకు కారణమైన దోషులను శిక్షించేంతవరకు సిపిఎం వదిలిపెట్టబోదని కేసును పక్కదోవ పట్టిస్తున్న ఖమ్మం సీపీని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ కే బ్రహ్మాచారి రేపాకుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ భూక్య రమేష్ నాయకులు వై వెంకటేశ్వరరావు ఎం లింగయ్య కాట్రాల తిరుపతిరావు కే సత్య సిపిఎం కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి,ప్రమోద్ సాయి సలీం తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 6 తర్వాత ఓటు నమోదుకు అవకాశం

- అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి
- విస్తృత ప్రచారం నిర్వహించాలి
- ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనను వేగవంతం చేయాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష



ఖమ్మం, అక్టోబర్ 31(మనం బ్యూరో): నవంబర్ 6 తర్వాత కూడా వరంగల్- నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందని అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ తో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో మంచి పురోగతి సాధించారని అధికారులను అభినందించారు. అయితే నవంబర్ 6 చివరి తేదీగా భావించి రాజకీయ పార్టీల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, మరోవైపు అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా వేగవంతం కావాల్సి ఉందని అన్నారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని, అదే తేదీన డిగ్రీ పరీక్షల ఫలితాలు ప్రకటించబడిన వారు కూడా అర్హులేనని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్-2026 ప్రక్రియను అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సమర్థవంతంగా నిర్వహించిన తీరును అభినందించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు నవంబర్ 6తో ముగిసిపోదని, ఆ తేదీ తర్వాత కూడా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాల రూపంలో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు కూడా ఫారం-18 దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఫారం-18 దరఖాస్తుల పరిశీలన అనంతరం పోలింగ్ కేంద్రాల కేటాయింపును కూడా అత్యంత జాగ్రత్తగా ప్రణాళిక రూపొందించి చేపట్టాలని సూచించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం దరఖాస్తుల కేటాయింపు కోసం 118 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 6, 2026 వరకు అందే దరఖాస్తుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను నవంబర్ 10, 2026లోగా సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అందిన క్లెయిమ్లు, అభ్యంతరాలను డిసెంబర్ 25, 2026లోగా పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ డీ. వేణుగోపాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

రెండు నాటు తుపాకులు స్వాధీనం



దమ్మపేట, అక్టోబర్ 31(మనం న్యూస్): దమ్మపేట మండలం చెన్నువారిగూడెం గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా నాటు తుపాకులతో అడవి జంతువులను వేటాడేందుకు వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. కారం నాగేంద్రబాబు (34), కారం చిట్టిబాబు (27), మోడియం సురేంద్రబాబు (25) అనే ముగ్గురు వ్యక్తులు గత కొంతకాలంగా తమ వద్ద ఉన్న నాటు తుపాకులతో సమీప అటవీ ప్రాంతాల్లో అడవి జంతువులను వేటాడుతున్నారు. వారి వద్ద నుండి పోలీసు అధికారులు రెండు నాటు తుపాకులు, సుమారు 100 గ్రాముల గన్ నల్లటి పొడి, 37 చిన్న ఇనుప గుండ్లు ఇతర మందుగుండు సామగ్రి. స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పెనుబల్లి శ్రీను దమ్మపేట పోలీసు స్టేషన్ నందు ఒక కేసులో అరెస్టు కాబడి ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. అడవి జంతువులను వేటాడటం, వాటి మాంసాన్ని అక్రమంగా విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు పోలీసు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అశ్వారావు పేట సిఐ నాగరాజు, దమ్మపేట ఎస్ఐ రాజేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి



ఇప్పటి వరకు 73,898 దరఖాస్తుల స్వీకరణ

నవంబర్ 30న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రచురణ

ఖమ్మం జిల్లాలో 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం, అక్టోబర్ 31(మనం బ్యూరో): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026 షెడ్యూల్ను భారత ఎన్నికల సంఘం సవరించిందని కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల పరిష్కారం, విచారణలు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను నవంబర్ 26వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 30వ తేదీన తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు.

మొత్తం 1,75,841 నోటీసులు జారీ

ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,75,841 నోటీసులు జారీ చేయగా, వాటిలో 1,75,629 నోటీసులను ఓటర్లకు అందజేశామని కలెక్టర్ వివరించారు. మొత్తం 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని, వీరిలో 1,74,838 మందిని తుది జాబితాలో అర్హులైన ఓటర్లుగా చేర్చేందుకు క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల 1,006 మంది ఓటర్లు అర్హులు కాదని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించి మొత్తం 3,080 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, వాటి ని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు.


ఎంఎల్సి ఓటు నమోదు చేసుకోవాలి

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గత 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నమోదును మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలంటే తాజాగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, గడువు లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్ 25, 2026లోగా వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించ నున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పీ. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీజేపీ పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్వి ప్రతినిధి ఎల్. సురేష్ బాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టీఆర్ కృష్ణప్రసాద్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రాజయ్య, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల డిజిటల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి: డీఆర్ఓ పద్మావతి

అగ్రిస్టాక్ ద్వారా రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ వందశాతం పూర్తి చేయాలి

ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, పంటల కొనుగోలులో రైతు ఐడీ కీలకం



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 31 (మనంప్రతినిధి): జిల్లాలో అగ్రిస్టాక్ యాప్ ద్వారా చేపడుతున్న రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్కోఫర్స్ కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డిజిటలైజేషన్లో భాగంగా అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా భూమి కలిగిన ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) కేటాయించేందుకు రైతు రిజిస్ట్రీ చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 1.85 లక్షల మంది రైతులకు గాను ఇప్పటివరకు సుమారు 1.39 లక్షల మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, మరో 45 వేల మంది రైతుల నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. మిగిలిన రైతులందరి వివరాలను నమోదు చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. అలాగే డిజిటల్ క్రాప్ బుకింగ్లో భాగంగా గ్రామస్థాయిలో వాలంటీర్లను గుర్తించి క్షేత్రస్థాయిలో పంటల ఫొటోలు సేకరించి యాప్లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పంటల సాగు విస్తీర్ణం, పంటల వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన సమాచారం భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ శాఖలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డీఆర్ఓ పద్మావతి మాట్లాడుతూ, రైతు రిజిస్ట్రీ ద్వారా రూపొందే రైతుల సమగ్ర సమాచారం వ్యవసాయం, ఉద్యానవనం, మార్కెటింగ్, పౌరసరఫరాలు, బ్యాంకింగ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైతులకు పంట రుణాలు, ఆర్థిక సేవలు అందించడం, ధాన్యం, మొక్కజొన్న, పత్తి తదితర పంటల కొనుగోలు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు పరిహారం అందించే ప్రక్రియలో ఫార్మర్ ఐడీ కీలకంగా ఉంటుందని వివరించారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్పామ్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వంటి పథకాల అమలులో, డీఆర్డీఏ ద్వారా రైతులకు ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్స్ వంటి సదుపాయాలు కల్పించే సమయంలో రైతు ఐడీని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని రైతులకు ఫార్మర్ ఐడీ ప్రాధాన్యతను వివరించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లు, మండల వ్యవసాయ కార్యాలయాల ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. పట్టాదారు పాస్బుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్తో రైతులు సమీప కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. మీసేవ, సీఎస్సీ కేంద్రాలకు వచ్చే రైతులకు ఫార్మర్ ఐడీ నమోదు విషయంలో అవగాహన కల్పించి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ బుకింగ్ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్ఓ పద్మావతి సూచించారు. ఈ సమావేశంలో సీ పి ఓ సునీత, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి , ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర రావు , ఉద్యానవన శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ఐటీడీఏ, గిరిజన సంక్షేమం, నాబార్డ్, లీడ్ బ్యాంక్, పశుసంవర్ధక, సహకార, డీఆర్డీఏ తదితర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాం

- జిల్లాలోని ప్రతి ఒక్క ఓటరు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్
- అనంతపురం నగరంలోని ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాలలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్



అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 31 : మనం న్యూస్ : మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ స్పష్టం చేశారు.

అనంతపురం నగరంలోని ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాలలో శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. ఇందులోభాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీటీవీల ద్వారా డిస్ట్రిబ్యూషన్ ను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 6 లొకేషన్లలో దాదాపు 6,000 మంది పోలింగ్ సిబ్బందికి మొదటి మరియు రెండవ విడత శిక్షణ విజయవంతంగా పూర్తి చేయబడిందన్నారు. ఆదివారం జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయన్నారు. తాడిపత్రిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించడం జరిగిందని, అలాగే జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు డిస్ట్రిబ్యూషన్ ప్రాంతాలను కూడా సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ అంతా కూడా 4 గంటల లోపు పూర్తిగా ముగియనుందని, దీనికి తగిన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేయడం జరిగిందన్నారు.

ప్రతి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సీసీ (సీసీ) కెమెరాలను ఏర్పాటు చేసి, ఆ కనెక్షన్లను కమాండ్ కంట్రోల్ రూమ్కు మరియు పోలీస్ కంట్రోల్ రూమ్కు అనుసంధానించడం జరిగిందన్నారు. పోలింగ్ సామగ్రిని కిట్ల రూపంలో సిద్ధం చేసి, ఏ పోలింగ్ స్టేషన్కు ఏయే మెటీరియల్ కావాలో ఆయా కిట్లను నేడు పంపిణీ చేస్తున్నామన్నారు.

ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోనూ 80 శాతానికి పైగా పోలింగ్ సిబ్బంది రిపోర్ట్ చేయడం జరిగిందని, అలాగే దానికి సంబంధించిన వాహనాలు, ఇతర యంత్ర సామగ్రిని కూడా సమకూర్చడం జరిగిందనీ, రిటర్నింగ్ ఆఫీసర్లు మరియు జోనల్ ఆఫీసర్లు కూడా విధులకు హాజరయ్యారన్నారు.

ఎన్నికల రోజున ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బేసిక్ ఇన్స్ట్రక్షన్స్ ఇవ్వడం జరిగిందని, ఎన్నికల సమయంలో లిక్కర్ దుకాణాలు మరియు ఇతర అవుట్లెట్లను మూసివేయడం, ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని విద్యాసంస్థలు, ఆఫీసులకు సెలవులు ప్రకటించడం వంటి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

ఎన్నికలలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వివరాలను అందజేసి, వారు వాటిని ఐడెంటిఫైడ్ పోలింగ్ కేంద్రాల్లో లేదా మున్సిపల్ ఆఫీసులలో సమర్పించేలా తగిన ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1800 మంది పోలీసులను ఈ 6 లొకేషన్లలో గ్రిడ్ రూపంలో డిప్లాయ్ చేయడం జరిగిందని, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేకంగా మైక్రో అబ్జర్వర్లను నియమించామని, బ్యాంక్ సిబ్బంది, ఎల్ఐసి ఉద్యోగులను ఈ మైక్రో అబ్జర్వర్లా ఉంచి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. అనంతపురం, తాడిపత్రి, గుత్తి తదితర సున్నితమైన ప్రాంతాల్లో 100 శాతం పోలింగ్ లొకేషన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కంట్రోల్ రూమ్కు అనుసంధానించామన్నారు. మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతిచోటా కనీసం 10 నుండి 15 వరకు డ్రోన్లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీసుల రెగ్యులర్ మొబిలైజేషన్తో పాటు స్ట్రైకింగ్ ఫోర్సులు, రిజర్వ్ టీమ్లను సిద్ధంగా ఉంచామని, ఏదైనా చిన్న ఘటన జరిగినా కేవలం 3 నుండి 5 నిమిషాల వ్యవధిలో ఆ ప్రాంతానికి చేరుకుని అదనపు బలగాలు సహాయపడేలా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జిల్లా యంత్రాంగం తరపున సుమారు 1600 మంది సిబ్బందిని క్యూ మెయింటెనెన్స్ మరియు పోలీసులకు సహకరించేందుకు కేటాయించడం జరిగిందన్నారు. సాధారణంగా అసెంబ్లీ లేదా లోక్సభ ఎన్నికల్లో సెంట్రల్ ఫోర్సెస్ వస్తాయి, కానీ ఈసారి అటువంటి కేంద్ర బలగాలు లేనందున, రెవెన్యూ ఇతర ప్రాంతాల్లో శాఖల సిబ్బంది ద్వారానే బేసిక్ క్యూ మెయింటెనెన్స్ నిర్వహించేలా ఏర్పాటు చేశామన్నారు. ఇవి పూర్తిగా అర్బన్ ఎన్నికలు కావడంతో, పోలింగ్ స్టేషన్ అన్నీ అర్బన్ ఏరియాలలోనే అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి దూర ప్రాంత ఇబ్బందులు లేవన్నారు.

కొన్ని పోలింగ్ స్టేషన్లకు ప్రత్యేకంగా రూట్ ఆఫీసర్లను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ, వాహనాలు సమకూర్చామని, చిన్న సందులు, రద్దీ రోడ్లు ఉన్న ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా మినీ బస్సులను (సుమారు 15-20 మంది కూర్చునేవి) కూడా అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ, జిల్లాలోని ప్రతి ఒక్క ఓటరు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మెటీరియల్స్ డిస్ట్రిబ్యూషన్ కోసం అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేపట్టాం

ప్రతి ఒక్కరూ కూడా వాళ్ళ ఓటు హక్కు ఖచ్చితంగా ఉపయోగించుకోవాలి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 31 : మనం న్యూస్ : మున్సిపల్ ఎన్నికల మెటీరియల్స్ డిస్ట్రిబ్యూషన్ కోసం అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేపట్టామని, ఈరోజు సాయంత్రం లోపల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అనంతపురం కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ఈరోజు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం చేపడుతున్నామని, అనంతపురంలో ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాలలో కూడా డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశాం.. డిస్ట్రిబ్యూషన్ కోసం అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతానికి అయితే ఎటువంటి సమస్యలు లేవన్నారు. మున్సిపాలిటీలకు సంబంధించి జిల్లాలో తక్కువ పోలింగ్ స్టేషన్స్ గుత్తిలో ఉన్నాయి.. ఎక్కువ అనంతపూర్ మున్సిపల్ కార్పొరేషన్లో ఉన్నాయి. పోలింగ్ కు ప్రతి చోట కూడా బేసిక్ అరేంజ్మెంట్స్ అన్నీ చేయడం జరిగిందన్నారు. ఈరోజు సాయంత్రం లోపల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.. పోలింగ్ స్టాఫ్ చేరుకునే లొకేషన్స్ లో కూడా దానికి సంబంధించిన ఏర్పాట్లు, భోజనం ఏర్పాట్లు, వసతి లాంటి సౌకర్యాలు అన్నీ కూడా చేశామన్నారు. ఈరోజు డిస్ట్రిబ్యూషన్ కూడా చాలా చక్కగా మున్సిపల్ కమిషనర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, ప్రతి చోట కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో షామియానాలు, ఇతర ఏర్పాట్లు చేసుకోవడం జరిగింది.. జోనల్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్క పోలింగ్ బూత్ కి సంబంధించిన మెటీరియల్స్ ఆ పోలింగ్ సిబ్బందికి అందజేయడం జరుగుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా రేపటి పోలింగ్ సంబంధించి లా అండ్ ఆర్డర్ ఏర్పాట్లు కూడా చాలా వరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 1800 పోలీస్ సిబ్బందిని అందరినీ కూడా ఎన్నికలు జరిగే పలు ప్రాంతాల్లో భద్రత అవసరాల దృష్ట్యా తగినంత బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా సుమారుగా ఒక 1600 దాకా సచివాలయం, ప్రభుత్వ సిబ్బందిని క్యూ నిర్వహణ కోసం కూడా పెట్టుకోవడం జరిగిందన్నారు. రేపు ఎటువంటి ఇబ్బంది లేకుండా లా అండ్ ఆర్డర్ సమస్యలు ఏమి లేకుండా పోలింగ్ నిర్వహణకు ప్రతి ఒక్కరూ కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. దయచేసి ప్రతి ఒక్కరు కూడా వాళ్ళ ఓటు హక్కు ఖచ్చితంగా ఉపయోగించుకోవాలని కోరుతున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రతి ఒక్కరు కూడా వచ్చి పోలింగ్ లో పాల్గొని వాళ్ళ ఓటు హక్కు వాడుకోవాలని కోరుతున్నామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, డిఈ, ఆర్ఓ విజయలక్ష్మి, ఎలక్షన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ రోజు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ పి. జగదీష్

అనంతపురం, అక్టోబర్ 31: మనం బ్యూరో: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ సూచించారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పోలింగ్ రోజు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు:

144 సెక్షన్ అమలు :

అమలులో ఉన్న సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 నిబంధనల ప్రకారం నిషేధిత గుంపులుగా ఏర్పడటం, అనవసరంగా ప్రజలు గుమిగూడటం, అనుమతి లేని ఊరేగింపులు నిర్వహించడం చేయరాదు.

100 మీటర్ల పరిధిలో ఆంక్షలు :

పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఉండటం, ఎన్నికల ప్రచారం చేయడం, ఓటర్లను ప్రభావితం చేయడం, ఓటు వేయాలని ఒత్తిడి చేయడం పూర్తిగా నిషిద్ధం.

బయటి వ్యక్తులు వెళ్లిపోవాలి :

సంబంధిత మున్సిపల్ ఎన్నికల పరిధిలో ఓటర్లు కాని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర బయటి వ్యక్తులు ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దేశించిన సమయానికి ఆ ప్రాంతాన్ని విడిచివెళ్లాలి.

ఓటర్లకు స్వేచ్ఛ : ఓటర్లను బెదిరించడం, ప్రలోభపెట్టడం, ఓటు వేయకుండా అడ్డుకోవడం, నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేయాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలకు పాల్పడరాదు.

పోలింగ్ ఏజెంట్లకు నిబంధనలు :

ఎన్నికల అధికారులు అనుమతించిన పోలింగ్ ఏజెంట్లు మాత్రమే చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డులతో విధుల్లో ఉండాలి. అనుమతి లేని వ్యక్తులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదు.

మొబైల్ ఫోన్ల వినియోగం :

● పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ ఫోన్లు వినియోగించడం, ఫొటోలు, వీడియోలు తీయడం, ఓటు గోప్యతకు భంగం కలిగించడం చేయరాదు.

● ఆయుధాలు, నిషేధిత వస్తువులు : పోలింగ్ కేంద్రాల వద్దకు ఆయుధాలు, మారణాయుధాలు, నిషేధిత వస్తువులతో రావడం నిషిద్ధం.

● వాహనాల రాకపోకలు : ఎన్నికల సంఘం అనుమతించిన వాహనాలను మాత్రమే వినియోగించాలి. పోలింగ్ కేంద్రాల సమీపంలో ట్రాఫిక్కు, ఓటర్ల రాకపోకలకు అంతరాయం కలిగించరాదు.

● ప్రచారాలు వద్దు: ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదు. ఓటర్లకు డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ వంటి ప్రలోభాలకు పాల్పడరాదు.

పోలీసులకు సహకరించాలి: బందోబస్తులో ఉన్న పోలీసు సిబ్బంది సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవు.

ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి:

ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరులు సంయమనం పాటిస్తూ ఎన్నికల నియమావళిని గౌరవించాలని సూచించారు.

ఎన్నికల్లో గొడవలు, ఘర్షణలు, అల్లర్లకు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

తుపాను నష్టాలపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

- రైతులు, మత్స్యకారుల కష్టాలను అడిగి తెలుసుకున్న అధికారులు
- కొబ్బరి, అరటి, వరి పంటలతో పాటు గృహాలు, విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టాల పరిశీలన
- బాధితులకు తగిన ఆర్థిక సాయం అందించాలని కేంద్ర బృందానికి కలెక్టర్ విజ్ఞప్తి



అమలాపురం, అక్టోబర్ 31 మనం ప్రతినిధి: 'ఆర్నబ్' తుపాను సృష్టించిన నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన అంతర్ మంత్రిత్వ శాఖల బృందం శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విస్తృతంగా పర్యటించింది. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు, నివాస గృహాలు, మత్స్యకార బోట్లు, విద్యుత్ వ్యవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. బాధిత రైతులు, మత్స్యకారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, నష్టాల వివరాలను అడిగి తెలుసుకుంది.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాష్ నేతృత్వంలోని కేంద్ర బృందం రావులపాలెం, అంబాజీపేట మండలంలోని గంగలకుర్రు, వాకలగరువు, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించింది.

రావులపాలెంలో ప్రత్యేక ప్రజెంటేషన్....

రావులపాలెంలోని సీఆర్సీలో జిల్లా యంత్రాంగం కేంద్ర బృందానికి తుపాను నష్టాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చింది. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు, గృహాలు, మత్స్యకార బోట్లు, విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టాలను ఫొటోలతో సహా వివరించింది. అనంతరం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ను కేంద్ర అధికారులు తిలకించారు.

నేలకొరిగిన వరి.. దెబ్బతిన్న కొబ్బరి, అరటి తోటలు

గంగలకుర్రులో భారీ వర్షాలు, ఈదురుగాలులకు నీటమునిగి నేలకొరిగిన వరి పంటలను కేంద్ర బృందం పరిశీలించింది. రైతులతో మాట్లాడి పంటల పరిస్థితి, దిగుబడిపై పడిన ప్రభావం, ఆర్థిక నష్టాల వివరాలు సేకరించింది. వాకలగరువులో గాలుల తీవ్రతకు దెబ్బతిన్న కొబ్బరి, అరటి తోటలను పరిశీలించి ఉద్యాన రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంది.

తీరప్రాంత ప్రజల నష్టాలపై ఆరా....

అంతర్వేదిపాలెంలో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న నివాస గృహాలు, మత్స్యకార బోట్లు, తీరప్రాంత ఆస్తులను పరిశీలించింది. సముద్రపు కోత, అలల ఉధృతి కారణంగా ఎదురైన ఇబ్బందులు, మత్స్యకార కుటుంబాల జీవనోపాధిపై పడిన ప్రభావాన్ని తెలుసుకుంది. సఖినేటిపల్లిలో విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగలు, దెబ్బతిన్న విద్యుత్ పంపిణీ వ్యవస్థను పరిశీలించి పునరుద్ధరణ పనులపై అధికారులతో చర్చించింది.

బాధితులకు ఆర్థిక సాయం అందించాలిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తుపాను కారణంగా రైతులు, ఉద్యాన పంటల సాగుదారులు, మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోయారని కేంద్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు.

బాధితులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో నష్టాలను అంచనా వేస్తున్నారని, బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు.

కేంద్ర బృందంలో డాక్టర్ ప్రశాంత్ అర్మోరికర్, హిమాలయ గర్గ్, ప్రణయ్ గర్గ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్తో పాటు జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నిడియా దేవి, ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా నోడల్ అధికారి, వివిధ శాఖల అధికారులు కేంద్ర బృందానికి వివరాలు అందించారు.

దర్గా హొన్నూరులో ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ప్రత్యేక ప్రార్థనలు



బొమ్మనహాల్ అక్టోబర్ 30 మనం న్యూస్: మండలం లోని దర్గా హొన్నూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన హజరత్ సర్మస్త్ వలి దర్గా వద్ద నిర్వహిస్తున్న స్వామివారి సవారి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేలా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన దర్గాలో ప్రార్థనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమం లో సయ్యద్ రహ్మతుల్లా, హుస్సేన్ చిస్తి, ముత్తావలి 8 వ పీఠాధిపతి,సయ్యద్ ఖాజా పీరా, హుస్సేన్ చిస్తి, సయ్యద్ ఇనాయత్ బాబా చిస్తి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వై. కేశప్ప, రెండో ఎంపీటీసీ అభ్యర్థి హెచ్. ఆనంద్, మొదటి ఎంపీటీసీ అభ్యర్థి వి.ఎల్. దినేష్బాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వి.ఎల్. రామాంజనేయులు, వాల్మీకి నాగరాజు, మహమ్మద్ రఫీ, రామస్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు ఘటనపైఅనంతపురం ఎంపీ అంబికా దిగ్భ్రాంతి



అనంతపురం అక్టోబర్ 31 మనం న్యూస్: రాప్తాడు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనపై అనంతపురం ఎం. పి.అంబికా లక్ష్మీనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూపట్టపగలు..సహచర విద్యార్థులతో కలసి నిండు తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థినిపై ఓ ప్రేమోన్మాది దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలను తమ ప్రభుత్వం ఉపేక్షించదని, ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడి ధైర్యం చెప్పారని, మెరుగైన వైద్యం అందేలా కలెక్టర్ ఆనంద్ ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలను ఆదేశించారని తెలిపారు.నిందితుడిపై నాన్ బెయిలబుల కేసులు నమోదు చేసి, శిక్ష పడేలా చూడాలని ఎస్పీ జగదీశ్ ను సీఎం ఆదేశించారన్నారు.ఇటువంటి దుర్మార్గులను వదిలే ప్రసక్తే లేదని, ప్రతి ఆడబిడ్డ సురక్షితంగా, స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం తమ ప్రభుత్వం కల్పిస్తుందని,బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు.

అభ్యర్థులు ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి

కాట్రేనికోన అక్టోబర్ 30 మనం ప్రతినిధి: ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో (తుది జాబితాలో ఉన్న 46 మంది మరియు జడ్పీటీసీ బరిలో ఉన్న 2 అభ్యర్థులు) సమావేశాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించారు . సమావేశంలో ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికలకు సంబందించి మార్గదర్శకాలు, ఎన్నికల ఏజెంట్, లెక్కింపు ఏజెంట్ నియామకానికి సంబందించి విధి విధానాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ వివరాలు, ఎన్నికల వ్యయానికి సంబందించిన మార్గదర్శకాలను వివరిస్తూ, నమూన బ్యాలెట్ కి సంబందించి అభ్యర్థులకు పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని కాట్రేనికోన మండల రిటర్నింగ్ అధికారి జి మమ్మీ, తెలిపారు. కార్యక్రమం లో సహాయ రిటర్నింగ్ అధికారి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి రాజేశ్వర్ రావు, కాట్రేనికోన మండల ఎన్నికల వ్యయ పరిశీలకులు కె సురేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.



తుఫాన్ బాధితులకు నిత్యావసర కిట్లు అందజేత

కాట్రేనికోన, అక్టోబర్ 31(మనం ప్రతినిధి): అర్నబ్ తుఫాన్ ప్రభావం తో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన పేద కుటుంబాల వారికి శ్రీ శ్రీ శ్రీ పరమహంస యోగనంద యోగాథ సత్సంగ ధ్యానమండలి అమలాపురం వారి ఆధ్వర్యంలో ఉచిత నిత్యావసర వస్తువుల కిట్లను ట్రస్ట్ సభ్యులు శనివారం ఎంపీడీఓ బి రాజేశ్వరరావు చేతులు మీదుగా అందజేశారు. కాట్రేనికోన మండలంలోని కందికుప్ప గ్రామపంచాయతీ పరిధిలోని పొన్నాడ వారి గట్టు గ్రామస్తులకు, కాట్రేనికోన పంచాయతీ గచ్చకాయలపోర శివారు నక్కపల్లి నుండి ఇక్కడకు వలస వచ్చిన తెప్పల వారికి సుమారు 100 కుటుంబాల వారికి ఉచితంగా నిత్యవసర కిట్లను అందజేసినట్లు వారు తెలిపారు. కూరగాయలు,పసుపు, కేజీఆయిల్ ప్యాకెట్టు, బెల్లం,టీ పొడి,5 కేజీల బియ్యం,చింతపండు వెండి మిర్చి,పండ్లు దుప్పటి,సుమారు 1200 రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులు ఈ కిట్ లో ఉన్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో , ఏవి రమణి, వి ఆర్ విద్యా శంఖరం ,ఆర్ వి వి సత్యానందం, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

ఎన్నికల అధికారి రామాంజనేయ నాయక్



జూపాడుబంగ్లా అక్టోబర్ 31 (మనం న్యూస్) : జూపాడు బంగ్లా మండలంలో జరిగే స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధమని ఎన్నికల అధికారి రామాంజనేయ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూపాడు బంగ్లా మండలంలో మొత్తం ఓటర్లు 30,వేల 5 వందల25 ఓట్లు ఉన్నాయని. ఇందులో పురుషుల ఓట్లు 14, వేల 9 వందల 1,ఓటు. స్త్రీల ఓట్లు 15 వేల 6 వందల 23 ఓట్లు.అదర్స్ 1 ఓటు కలవని. మండలంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు, 32 ఏర్పాటు చేసినట్లు 32 పోలింగ్ కేంద్రాలకు గాను 65 బ్యాలెట్ బాక్సులు రావడం జరిగిందని. ఒక్కొక్క బాక్స్ లో 2500 దాకా బ్యాలెట్ పేపర్లు పట్టడం జరుగుతుందని. ఇందులో జడ్పిటిసి, ఎంపీటీసీ, ఓట్లను ఒకే బాక్స్ లో వేయడం జరుగుతుందని. కౌంటింగ్ సమయంలో వాటిని జడ్పిటిసి, బ్యాలెట్ పేపర్లను ఎంపీటీసీ బ్యాలెట్ పేపర్లను వేరు చేయడం జరుగుతుందని ఎన్నికల సమయం నవంబర్ 4వ తేదీన పోలీస్ బందోబస్తుతో పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు పంపడం జరుగుతుందని ప్రతిష్ట బందోబస్తుతో ఎన్నికలు జరిగే విధంగా కృషి చేస్తున్నామని వారు తెలియజేశారు.



బంగారు ఉంగరం అప్పగింత

మహానంది, అక్టోబర్31, మనంన్యూస్: చిన్నకొనేరులో పుణ్యస్నానం చేస్తూ జారవిడుచుకున్న బంగారు ఉంగరాన్ని భక్తురాలి కి అప్పగించిన సంఘటన మహానంది దేవస్థానం లో చోటుచేసుకుంది.శనివారం హైదరాబాదు కు చెందిన ప్రియాంక అనే భక్తురాలు శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారి దర్శనానికి వచ్చారు. కొనేరులో స్నానం చేస్తుండగా బంగారు ఉంగరం కొనేరులో పడిపోయింది. విధుల్లో వున్న హోమ్ గార్డ్ కోటయ్య కు సమాచారం అందించారు. స్థానికులతో వెతికించి ఆలయ ఇన్స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యం లో భక్తురాలికి అప్పగించారు.ఆలయ అధికారులకు భక్తురాలు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ విద్యార్థులు ఇస్రో బాట..

- శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహం
- 772 మంది విద్యార్థులతో క్విజ్ పోటీ.. 50 మందికి ఇస్రో సందర్శనకు అవకాశం
- ఏటా రెండుసార్లు పోటీ పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయం
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రత్యేక చొరవ



కామారెడ్డి, అక్టోబర్ 31 (మనం బ్యూరో): గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, అంతరిక్ష పరిశోధనల వైపు వారిని ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సైతం ప్రతిష్ఠాత్మక అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోను సందర్శించే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో క్విజ్ పోటీ పరీక్ష నిర్వహించారు. గత ఏడాది నిర్వహించిన ఇస్రో క్విజ్ పోటీల్లో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులతో పాటు 30 మంది ఉపాధ్యాయులను ఇస్రో సందర్శనకు తీసుకెళ్లారు. అక్కడ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన విజయాలు, ఉపగ్రహ ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించారు.

జిల్లా వ్యాప్తంగా 772 మంది విద్యార్థుల భాగస్వామ్యం...

గతేడాది వచ్చిన స్పందనతో ఈసారి మరింత ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో క్విజ్ పోటీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 772 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కామారెడ్డి డివిజన్ నుంచి 552 మంది, బాన్సువాడ డివిజన్ నుంచి 220 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ ఆధారంగా 50 మంది విద్యార్థులను, 30 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఇస్రో సందర్శనకు పంపించనున్నారు.

విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేయాలి...

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, శాస్త్రీయ ఆలోచనా విధానంతో నూతన ఆవిష్కరణలు, పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి అవకాశాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా, పరిశోధకులుగా ఎదిగేందుకు ఈ అనుభవం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి సంవత్సరం రెండుసార్లు పరీక్షలు...

ఇకపై ప్రతి సంవత్సరం రెండుసార్లు ఇలాంటి పరీక్షలు నిర్వహించి మరింత మంది విద్యార్థులకు ఇస్రో వంటి పరిశోధనా సంస్థలను సందర్శించే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా విద్యాశాఖ అధికారి సి. మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామిరెడ్డి, వివిధ పాఠశాలల భౌతిక, రసాయన, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సర్దార్ వల్లభాయ్ పటేల్కు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నివాళులు

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం అధికారులతో రాష్ట్రీయ ఏక్తా ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్

కామారెడ్డి, అక్టోబర్ 31 (మనం బ్యూరో): దేశ సమైక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశ తొలి ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. దేశానికి దిశానిర్దేశం చేసి, సంస్థానాల విలీనంతో జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేసిన ఆయన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఆయన జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, దేశ అంతర్గత భద్రతను పటిష్టం చేయడంలో తమ వంతు సహకారం అందిస్తామని అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ రాష్ట్రీయ ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి. విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో ఎకరాకు లక్షల్లో ఆదాయం

- క్యాప్సికం సాగులో రైతు కోమిరెడ్డి అంజయ్య విజయగాథ
- అభినందించిన కలెక్టర్
- ఎకరా విస్తీర్ణంలో 30 టన్నుల క్యాప్సికం దిగుబడి, టన్నుకు రూ.40 వేల చొప్పున విక్రయం
- పెట్టుబడి ఖర్చులు పోను రూ.10 లక్షల నికర ఆదాయం
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచన



కామారెడ్డి, అక్టోబర్ 31 (మనం బ్యూరో): సంప్రదాయ పంటల సాగుకు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగును చేపడితే తక్కువ విస్తీర్ణంలోనే అధిక ఆదాయం పొందవచ్చని రైతు కోమిరెడ్డి అంజయ్య నిరూపిస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో క్యాప్సికం సాగు చేసి సుమారు రూ.10 లక్షల నికర ఆదాయం సాధించిన ఆయనను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. శనివారం రైతు సాగు చేస్తున్న మిర్చి, క్యాప్సికం తోటలను కలెక్టర్ సందర్శించి పంటల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు అంజయ్య మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా క్యాప్సికం సాగు చేస్తున్నానని తెలిపారు. ఎకరా విస్తీర్ణంలో సుమారు 30 టన్నుల దిగుబడి సాధించానని, టన్నుకు రూ.40 వేల చొప్పున విక్రయించడంతో రూ.12 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. సాగు, ఇతర ఖర్చులు పోను సుమారు రూ.10 లక్షల నికర లాభం పొందినట్లు వివరించారు. వరి సాగుతో పోలిస్తే కూరగాయల సాగు ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని, పంటల మార్పిడితో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని పేర్కొన్నారు.

డిమాండ్కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలి....

పంటల సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్, ఆదాయ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో డిమాండ్కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, ఆధునిక, శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. తమ భూమి, నీటి వనరులు, మార్కెట్ పరిస్థితులను బట్టి ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల సలహాలు తీసుకొని సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్వై గిరి, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్ చీఫ్ మార్షల్గా బాధ్యతలు

- స్వీకరించిన అశుతోష్ దీక్షిత్




ఢిల్లీ, అక్టోబర్ 31: భారత వైమానిక దళ చీఫ్గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ నేడు పదవీ విరమణ చేయగా.. దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఉన్న అశుతోష్ దీక్షిత్.. 2028 డిసెంబర్ 31 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. వ్యూహాత్మక ప్రణాళికల్లో పేరొందిన ఆయన ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

1966 డిసెంబర్ 9న జన్మించిన ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న వాయుసేనలో చేరారు. నాలుగు దశాబ్దాల కాలంలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. మిరాజ్-2000, కిరణ్, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి యుద్ధ విమానాల్లో 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన అనుభవం ఉంది. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ వంటి అనేక కీలక ఆపరేషన్లలో పనిచేశారు.

కర్ణాటకలో స్టింగ్ ఆపరేషన్.. ఆ నాయకురాలిపై వేటు





బెంగళూరు, అక్టోబర్ 31: కర్ణాటక రాజకీయాల్లో కలకలం రేపుతున్న 'స్టింగ్ ఆపరేషన్' లో పోలీసుల విచారణ వేగవంతమైంది. ఈ ఆపరేషన్లో కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి కృపా ఆల్వా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో పార్టీ ఆమెపై చర్యలు తీసుకుంది. ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది. ఈ మేరకు కేపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.నారాయణస్వామి బహిష్కరణ ఉత్తర్వు జారీ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు గానూ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆమెపై ఈ వేటు వేసినట్లు అందులో పేర్కొన్నారు. స్టింగ్ ఆపరేషన్లో ఆమె ప్రమేయం ఉందన్న ఆరోపణలపై వివరణ కోరుతూ పార్టీ ఇప్పటికే కృపా ఆల్వాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాటిపై ఆమె స్పందించకపోవడంతో తాజా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

గత నెలలో కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించి కొన్ని వివాదాస్పద వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. తన పరువుకు నష్టం కలిగించేలా ఉన్న ఆ వీడియోల వెనుక కృపా ఆల్వా హస్తం ఉన్నట్లు మాజీ సీఎం ఆరోపించారు.

నిజానిజాలు తేలేవరకు వాటిని మీడియా సంస్థలు ప్రసారం చేయకూడదని ఆయన కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. మరోవైపు, ఈ స్టింగ్ ఆపరేషన్పై దర్యాప్తు జరిపిన పోలీసులు ఇందులోని లైంగిక వేధింపుల ఆరోపణలు కల్పితమైనవని తేల్చారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

ఇంధన సరఫరాలో ఆంక్షలు వద్దు

జీ20 దేశాలతో జైశంకర్

ఢిల్లీ, అక్టోబర్ 31: ఆంక్షలు, కీలక చమురు రవాణా మార్గాలను అడ్డుకోవడం వంటి చర్యల ద్వారా ప్రపంచ చమురు సరఫరాకు అంతరాయం కలిగించడాన్ని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఖండించారు. ధరలను గుప్పిట్లో ఉంచుకునేందుకే కొన్ని దేశాలు ఇంధన వాణిజ్యంపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరుపుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న చమురు సంక్షోభం ఉత్పత్తిపరమైనది కాదని.. అనిశ్చితి, అంతరాయాలు, భరించలేని ధరలు, లభ్యతలో సవాళ్లే అసలైన కారణమని పేర్కొన్నారు.



జీ20 దేశాల విదేశాంగ మంత్రులతో జరిగిన సమావేశంలో జైశంకర్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్కడే ఉండడం గమనార్హం. ఇరాన్ చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షలు, పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాకు అంతరాయం, రష్యా డీజిల్ అమ్మకాలపై అడ్డంకులు వంటి పరిణామాల వేళ.. భారత విదేశాంగమంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్ వ్యవహారాల్లో పరస్పర ఆధారిత సూత్రాన్ని తక్కువ అంచనా వేయకూడదని జైశంకర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వంట అవసరాల కోసం భారత్కు నమ్మకమైన ఎల్పీజీ సరఫరాలు అవసరమన్నారు. ఆర్థిక వనరుల లభ్యతను విస్తృతం చేయడంతో పాటు, చిన్న మాడ్యులర్ రియాక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాలను ప్రోత్సహించాలని జీ20 దేశాలకు పిలుపునిచ్చారు.

సైనిక చర్యలు పనిచేయవు.. దౌత్యానికి అవకాశం ఇవ్వండి

సవాళ్లను ఎదుర్కోవడంలో సైనిక చర్యలు ఎటువంటి ఫలితాలు ఇవ్వవని జైశంకర్ అన్నారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి దౌత్యానికి అవకాశం ఇవ్వాలని జీ20 దేశాలకు సూచించారు. కీలక చమురు రవాణా మార్గాల్లో నౌకలు, నావికులపై దాడులు ప్రస్తుతం తీవ్ర సమస్యగా పరిణమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూఎన్క్లోస్ ఒప్పందం ప్రకారం.. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, దాడులను నిలిపివేయడం అవసరమని స్పష్టం చేశారు. ఈ దాడుల వల్ల పరోక్షంగా ఇంధనం, ఆహారం, ఎరువుల లభ్యత ప్రమాదంలో పడుతున్నాయని జైశంకర్ పేర్కొన్నారు.

జర్నలిస్టుతో సీఎం ఒమర్ అబ్దుల్లా వివాహం



కశ్మీర్, అక్టోబర్ 31: జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వివాహం చేసుకున్నారు. జర్నలిస్టు నిధి రజ్దాన్తో వివాహమైనట్లు వెల్లడించిన ఆయన.. ఈ మేరకు సోషల్ మీడియాలో ఫొటోలు పంచుకున్నారు. అక్టోబర్ 30న వివాహం అయినట్లు పేర్కొన్న ఆయన.. కొత్త జీవితం మొదలైందని పోస్టు పెట్టారు. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద వీరి వివాహం జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ, శ్రీనగర్లో జరిగిన వివాహ వేడుకలకు ఇరు కుటుంబీకులు హాజరైనట్లు సమాచారం. మాజీ భార్య పాయల్తో విడాకులు మంజూరు చేస్తామని సుప్రీం కోర్టు వెల్లడించిన మూడు నెలలకే ఒమర్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం.

ఒమర్ అబ్దుల్లా, పాయల్ల వివాహం 1994లో జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. 2011లో తన భార్య నుంచి విడిపోతున్నట్లు ఒమర్ ప్రకటించారు. నాటి నుంచి వారు విడివిడిగా జీవిస్తున్నారు. తొలుత కుటుంబ న్యాయస్థానం, ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు వారి విడాకుల అభ్యర్థనను తిరస్కరించడంతో గతేడాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సుదీర్ఘ కాలంగా వేర్వేరుగా జీవిస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకొని విడాకుల మంజూరుకు అనుమతించింది.

ఈ నెల 2న తెలంగాణకు కేంద్ర హోంమంత్రి రాక

అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి : కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. తెలంగాణలో నవంబర్ 2వ తేదీన పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. బేగంపేట నుంచి కాకతీయ హోటల్కు వెళ్లనున్నారు. సాయంత్రం వరకు కాకతీయ హోటల్లో కేంద్ర హోం మంత్రి బసచేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించనున్న ర్యాలీలో అమిత్ షా పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 5:30 వరకు ఎంజే మార్కెట్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్కు అమిత్ షా హాజరుకానున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు ఉన్న రిజర్వ్ షెడ్యూల్లో రాష్ట్రంలోని ప్రముఖులను కేంద్ర హోం మంత్రి కలిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ ముఖ్య నేతలతో కూడా అమిత్ షా భేటీ అయ్యే ఛాన్స్ ఉందని తెలుస్తోంది.





స్థానిక ఎన్నికల పోలింగ్56 కేంద్రాలు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు జెసి సురేష్ ధనుంజయ

బేతంచేర్ల, అక్టోబర్ 31 (మనం న్యూస్): నగర పంచాయతీ ఎన్నికల సందర్భంగా28 వార్డులు సంబంధించిన ఎలక్షన్ బూతులు 56 ఏర్పాటు చేశామని ఎలక్షన్ అధికారి జెసి కి తెలిపారు జెసి సురేష్ ధనుంజయ శేషారెడ్డి హై స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సంబంధించిన బాలెట్ బాక్స్ పోలింగ్ కేంద్రాలు ఎలక్షన్ వచ్చిన అధికారులు పోలీసు సిబ్బంది వివరాలను ఎన్నికల అధికారి నగర కమిషనర్ హరిప్రసాద్ ఎలక్షన్ అధికారులు 300 పోలీస్ 200 సిబ్బందితో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాటు చేశామని తెలిపారు జెసి వాటికి సంబంధించిన అధికారులు జరగనున్న ఎన్నికల పోలింగ్ పరిశీలించారు.

ఐకెపి మార్కెటింగ్ కోసం సిద్ధం



తిరుమలగిరి అక్టోబర్ 31 (మనం న్యూస్) : ఖరీఫ్ సీజన్ లో మార్కెట్ నిర్వహణ కోసం అన్ని గ్రామాల్లో ఐకెపి సెంటర్ల నిర్వాహకులు సిద్ధం చేసుకొని ఉండాలని తహసిల్దార్ వినోద్ కుమార్ చెప్పారు. శనివారం మండల సమాఖ్య లో నాగారం, తిరుమలగిరి మండలాల గ్రామాలలో ఐకెపి నిర్వాహకులతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏలాంటి ఇబ్బంది జరగకుండా కేంద్రం ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తుందని అందుకు అనుగుణంగా కేంద్ర నిర్వాహకులు పనిచేయాలని చెప్పారు. మార్కెటింగ్ డిపిఎం అరుణ్ కుమార్ మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా ఐకెపి కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించే విధంగా చేసి ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాల్ రూ 2461 లు,బి గ్రేడ్ రూ 2441లు కల్పించిందని చెప్పారు. సన్న రకం ధాన్యం ఏడు రకాల వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర రైతులకు అందే విధంగా కేంద్ర నిర్వాహకులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి నాగారం ఏపిఎం లు లక్ష్మీ, వెంకట్ రెడ్డి, సీసీలు నాగయ్య, సత్యం కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెంటిక్ పోటీలకు ఎంపికైన ఎస్సార్ ఎం విద్యార్థి



- షార్ట్ ఫుట్‌లో జిల్లా ప్రథమ స్థానం సాధించిన నందిరెడ్డి అనీష్ రెడ్డి

కోదాడ,అక్టోబర్ 31(మనం న్యూస్): సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్జిఎఫ్ అండర్ 14 జిల్లాస్థాయి అట్లంటిక్ పోటీలలో ఎస్ఆర్ఎం సంకల్ప 9వ తరగతి విద్యార్థి నందిరెడ్డి అనీష్ రెడ్డి ప్రతిభ చాటాడు. షార్ట్ ఫుడ్ లో 10.5 మీటర్ల దూరం విసిరి జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించి నవంబర్ నెలలో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంతో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినికి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి పూల బొకేతో విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితం నేటి యువతకు స్ఫూర్తి



- భారతదేశానికి యువతే బలం వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలి
- కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలి
- భారతజాతి ఐక్యతతోనే దేశ అభివృద్ధి
- జిల్లా ఎస్పీ కే నరసింహ

సూర్యాపేట, అక్టోబర్ 31 (మనం ప్రతినిధి): భారతదేశ ఉక్కుమనిషి, దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా 'రన్ ఫర్ యూనిటీ' (జాతీయ ఐక్యతా పరుగు) నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ కె. నరసింహ పరుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, యువత, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు. ఎస్పీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా నుంచి ఎస్పీ డిగ్రీ కళాశాల, కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా మీదుగా సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వరకు ఐక్యతా పరుగు కొనసాగింది. సద్దుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన వేదికపై సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి ఎస్పీ, పోలీసు సిబ్బంది, యువత తో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... 1947కు ముందు భారతదేశం అనేక చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలుగా విభజించబడి ఉండేదని, వాటన్నింటినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి అఖండ భారతదేశ నిర్మాణంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్లో విలీనం చేయడంలోనూ ఆయన గొప్ప పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జన్మదినాన్ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని గారు గుజరాత్లో ఏక్త నగరం నందు ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి కి నివాళులర్పించి పరేడ్ నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమం ఉద్దేశించి జాతి ఐక్యతను మంచి ప్రధాన మంత్రి సందేశం ఇస్తారు. భారతదేశానికి యువత అతిపెద్ద సంపద అని, దేశ జనాభాలో సుమారు 65 శాతం మంది 30 ఏళ్లలోపు యువత ఉండటం గొప్ప అవకాశమని పేర్కొన్నారు.

ఈ యువశక్తిని సద్వినియోగం చేసుకొని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువులో, ఉద్యోగార్థులు ఉద్యోగ సాధనలో, రైతులు వ్యవసాయ దిగుబడుల పెంపులో, ఉద్యోగులు తమ విధుల్లో మరింత ప్రతిభ కనబరచాలని సూచించారు.

ప్రతి రంగంలో ఏటా అభివృద్ధి సాధించే లక్ష్యంతో ముందుకు సాగితే, ఆ పురోగతి సమష్టిగా దేశాభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. మనకు దేశం ఏమిచ్చిందని ప్రశ్నించుకోవడం కంటే దేశానికి మనం ఏమి చేశామో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత అభివృద్ధి నుంచే దేశాభివృద్ధి ప్రారంభమవుతుందని, తాత్కాలిక ఆనందాలు, సుఖాల కోసం విలువైన సమయాన్ని వృథా చేయకుండా దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం క్రమశిక్షణతో కష్టపడాలని యువతకు సూచించారు. మహానుభావులు బోధించిన విధంగా లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.మన జీవితం కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కాకుండా తల్లిదండ్రులు, కుటుంబం, సమాజం, దేశం కోసం ఉపయోగపడాలని అన్నారు. నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సమాజ శ్రేయస్సు, దేశ సమగ్ర అభివృద్ధికి పాటుపడటమే మహనీయులకు అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి ప్రసన్నకుమార్, డిఎస్పి నరసింహ చారి, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ శివ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, జానయ్య, ఎస్సైలు ఆర్ఎస్ఐలు పోలీసు అధికారులు సిబ్బంది, పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, యువత, పోలీసు కళాజాత బృందం, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు



- 657 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- వారం రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించాలి
- 100 రోజుల్లో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 31 (మనం ప్రతినిధి): అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 319 ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 657 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. శనివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... పట్టాలు పొందిన లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, 100 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని బేస్మెంట్, లింటెల్, రూఫ్ లెవల్ దశల్లో నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ప్రతి దశలో నిర్మాణ ఫొటోలను అధికారులకు అందజేయాలని సూచించారు. వచ్చే జనవరి 26 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని కోరారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఇళ్ల మంజూరు, నిర్మాణాల్లో అక్రమాలు, అవకతవకలను సహించబోమని హెచ్చరించారు.

పేదల సొంతింటి కల నిజం చేస్తాం

ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్యాద అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీకి 657 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో పథకం అమలవుతోందని చెప్పారు. గతంలో మాజీ మంత్రి దివంగత దామోదర్ రెడ్డి హయాంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న వారు ఇప్పటికీ సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇళ్లు మంజూరైన వారు కూడా నాణ్యమైన ఇళ్లు నిర్మించుకుని కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఇళ్ల నిర్మాణాలతో మేస్త్రీలు, కూలీలు, పెయింటర్లు, నిర్మాణ సామగ్రి వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం సుమారు 3,100 దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేశామని, అర్హులకు త్వరలో పెన్షన్లు అందిస్తామని వెల్లడించారు. అర్హులైన పేదలు, వృద్ధులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు సర్వోత్తమ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీణారెడ్డి, పిడి హౌసింగ్ జబ్బర్ మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, ఎఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీను, ఫ్లోర్ లీడర్ వేణు గోపాల్, వెలుగు వెంకన్న కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పట్టభద్రులు బీఆర్ఎస్ వైపే

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో 5వ డివిజన్ ప్రెసిడెంట్ పున్నం చందర్ మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్

హనుమకొండ , అక్టోబర్ 31(మనంన్యూస్): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమంలో 5వ డివిజన్ డివిజన్ ప్రెసిడెంట్ పున్నం చందర్, ఇన్చార్జి కుసుమ లక్ష్మీనారాయణ,మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, సాగర్,సమ్మయ్య,మహేష్, మహేందర్, నిఖిల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో 5వ డివిజన్ ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొని పట్టభద్రులను అడగగా అందరూ బిఆర్ఎస్ వైపు పట్టభద్రులు మొగ్గు చూపుతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటర్ ఎన్రోల్మెంట్ కార్యక్రమానికి సంబంధించిన పత్రాలను అందజేశారు.

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి పట్టభద్రులు మద్దతు తెలపాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ గుట్టురట్టు

కాలేజీ అమ్మాయిలే టార్గెట్
డబ్బు ఆశ చూపి అండాల సేకరణ
వెలుగులోకి సంచలన విషయాలు
బేగంపేట గర్ల్స్ హాస్టల్‌పై పోలీసుల ఆకస్మిక దాడి
10 మంది యువతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్, అక్టోబర్ 31, మనం ప్రతినిధి : హైదరాబాద్‌లో అక్రమ అండాల సేకరణ వ్యవహారం కలకలం రేపుతోంది. ఇప్పటికే బేగంపేట, ప్రకాశ్ నగర్ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో తాజాగా సరూర్ నగర్‌లో సైతం ఇదే తరహా వ్యవహారం బయటపడింది. సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో అండాలను సేకరిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 18 మంది యువతులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నకాలేజీ విద్యార్థినులు, నిరుపేద యువతులను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారం సాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ఆధారంగా.. సరూర్ నగర్ పోలీసులు సదరు నివాసంలో తనిఖీలు నిర్వహించారు. రాథమిక విచారణలో యువతులకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తామని ఆశ చూపి అండాల సేకరణకు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఇందుకోసం ఇంజెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రక్రియలో ఎలాంటి వైద్య విధానాలు అనుసరించారు? అండాల సేకరణకు అవసరమైన వైద్య పరీక్షలు, సమ్మతి, ఇతర చట్టపరమైన నిబంధనలు పాటించారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సేకరించిన అండాలను నగరంలోని కొన్ని ఐవీఎఫ్ కేంద్రాలకు అనధికారికంగా సరఫరా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన యువతులు లక్ష్యంగా మారుతున్నట్లు గుర్తించారు. సాధారణంగా ఐవీఎఫ్ చికిత్సలో భాగంగా అండాల సేకరణకు వైద్యపరమైన పరీక్షలు, హార్మోన్ చికిత్స, వైద్య పర్యవేక్షణ అవసరం. ఈ ప్రక్రియలో మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు పాటించడం అత్యంత కీలకం. భారతదేశంలో సహాయక పునరుత్పత్తి సాంకేతికత, సరోగసీకి సంబంధించిన చట్టాలు, నియంత్రణ వ్యవస్థలు అండాల దాతల హక్కులు, సమ్మతి, వైద్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తాయి. డబ్బు ఆశ చూపి మహిళలను ఒత్తిడికి గురిచేయడం, సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా అండాలను సేకరించటం చట్టవిరుద్ధం. ఈ నేపథ్యంలో సరూర్ నగర్ ఘటనలో యువతుల వాంగ్మూలాలు, వైద్య రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, అండాల సరఫరాకు సంబంధించిన ఆధారాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ బేగంపేటలో గర్ల్స్ హాస్టల్ ముసుగులో సాగుతున్న గ'లీజ్ దంధా' బాగోతం తీగ తాగితే డొంకంతా కదిలిన చందంగా బట్టబయలైంది. గత కొంత కాలంగా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోన్న భారీ అక్రమ ఫెర్టిలిటీ రాకెట్‌ను పోలీసులు రట్టు చేశారు. ప్రకాశ్ నగర్‌లో 'అమినీత గర్ల్స్ హాస్టల్'పై బేగంపేట పోలీసులు, మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీమ్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు.

జర్నలిస్ట్ రామన్ననాయ్ప హత్యాయత్నం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి



- జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే 143 నాయకులు

మహబూబాబాద్: గూడూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన గిరిజన వర్కింగ్ జర్నలిస్ట్, జనంసాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, తెలంగాణ ఉద్యమకారుడు, టీయూడబ్ల్యూజే 143 గూడూరు మండల ప్రధాన కార్యదర్శి బానోతు రామన్న నాయ్ప జరిగిన హత్యాయత్నాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ మహబూబాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యలు, ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న రామన్న నాయ్ప కొందరు కక్షగట్టి పక్కా ప్రణాళికతో హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆరోపించారు. నంబర్ ప్లేట్ లేని కారులో సంచరిస్తూ ముందుగా రెక్కీ నిర్వహించిన ఐదుగురు గుర్తుతెలియని దుండగులు, రామన్న నాయక్ బైక్‌పై వెళ్తుండగా మామిడి తోట సమీపంలో కారుతో వెంబడించి అడ్డగించి, బీరు సీసాలు, ఇనుప రాళ్లు, కత్తులతో దాడికి పాల్పడినట్లు వివరించారు. ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడి వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులను సమగ్రంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం నిందితులపై రౌడీషీట్ నమోదు చేయాలని కోరారు. బాధిత జర్నలిస్ట్ బానోతు రామన్న నాయక్కు తగిన పోలీసు రక్షణ కల్పించి, ఆయనకు పూర్తి న్యాయం చేయాలని ఎస్పీని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: టీయూడబ్ల్యూజే 143 మహబూబాబాద్ జిల్లా కో-కన్వీనర్ గాడిపెల్లి శేఖర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు చందు నాయక్, జిల్లా అధ్యక్షుడు లావుడియా మనోహర్ చౌహన్, జర్నలిస్టులు రామన్న నాయక్, సుధాకర్, రవి, భానోత్ చందు, ధరావత్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ అభివృద్ధిలో మరో ముందడుగు



- క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు రూ.197.44 కోట్లు
- నమూనాను ఆవిష్కరించిన మేయర్ బుర్రి చైతన్య
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డికి మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు

నల్లగొండ- అక్టోబర్31(మనం ప్రతినిధి): నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు ప్రభుత్వం రూ.197.44 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్ లో క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణ నమూనా మోడల్ ను డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, కార్పొరేటర్లతో కలిసి ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లాక్ టవర్ సెంటర్ సుందరీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం నల్లగొండ నగర అభివృద్ధిలో కీలక ముందడుగని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నామని, ఇందులో ప్రపంచ బ్యాంకు రూ.138.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.59.23 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన ఆమోదం తెలిపిందని వెల్లడించారు.

క్లాక్ టవర్ సెంటర్లోని పాత ఆర్ అండ్ బి కార్యాలయం స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్ తో పాటు క్లాక్ టవర్ సెంటర్ ను అధునాతన రీతిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలి

- పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- రైతులకు అండగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలి
- భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలి
- రైతులు అధైర్యపడవద్దు, ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, అక్టోబర్ 31,(మనం ప్రత్యేక ప్రతినిధి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తుఫానుగా మారే అవకాశమున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నవంబర్ 2వ తేదీ సాయంత్రానికి తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే అవకాశం ఉందని, నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాల రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. భారీ వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వరి, పత్తి, మిర్చి, ఉద్యాన పంటల పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువలను సిద్ధం చేసుకోవాలని, కోతలు పూర్తయిన పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించి తడవకుండా కాపాడుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు పంట కోతలు, పురుగుమందుల పిచికారీ, ఎరువుల వినియోగాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. బలమైన గాలులు, పిడుగులు పడే సమయంలో రైతులు పొలాల్లోకి వెళ్లవద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని మంత్రి స్పష్టం చేశారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో అందుబాటులో ఉంటూ పంటల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

దేశ చరిత్రలో చెరగని సంతకం ఇందిరా గాంధీ

- గోవిందరావుపేటలో ఇందిరమ్మ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుల నివాళులు



గోవిందరావుపేట, అక్టోబర్ 31,మనం ప్రతినిధి: భారత తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా గోవిందరావుపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న ఇందిరమ్మ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఇందిరా గాంధీది ప్రత్యేక స్థానమని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, హరిత విప్లవానికి ప్రోత్సాహం, పేదరిక నిర్మూలనకు చేపట్టిన కార్యక్రమాలు, 1971 యుద్ధ సమయంలో దేశానికి నాయకత్వం వహించడం వంటి అంశాలను గుర్తుచేశారు. దేశ స్వయం సమృద్ధి, అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. ఆమె ధైర్యం, నాయకత్వ లక్షణాలు, దేశం పట్ల అంకితభావం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కణతల నాగేందర్ రావు, సూరపనేని సాయిబాబు, పులుగుజ్జు వెంకన్న, జంపాల చంద్రశేఖర్, పసర సర్పంచ్ భూక్య సుమలత, స్థానిక సర్పంచ్ లావుడియా జోగా, కాడబోయిన రవి, రామచంద్రపు వెంకటేశ్వరరావు, గొంది కిరణ్, జక్కు రణదీప్, సప్పిడి సతీష్, దాసరి సాహిత్, దార కిరణ్, బుర్రి వీరయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు

జిల్లా ప్రజలకు కలెక్టర్ సందేశం



- నీటిని పొదుపుగా వినియోగించాలి
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమివ్వాలి
- యాసంగి సాగుకు ముందు నీటి లభ్యతపై అధికారులను సంప్రదించాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు


ములుగు, అక్టోబర్ 31,మనం ప్రతినిధి: ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న జలవనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ప్రజలకు సూచించారు. రానున్న వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని కోరారు. జిల్లాలో వానాకాలం పంటలకు రామప్ప సరస్సు ద్వారా 5,180 ఎకరాలు, లక్నవరం సరస్సు ద్వారా 4,500 ఎకరాలు, పాలెంవాగు ప్రాజెక్టు ద్వారా 7,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించినట్లు తెలిపారు. కన్నాయిగూడెం మండలం గంగారం గ్రామంలోని దేవాదుల పంపుహౌస్ ద్వారా జూలై 2026 నుంచి ఇప్పటివరకు సుమారు 16.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, ఎత్తైన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించినట్లు పేర్కొన్నారు. ఇకపై నీటి ఎత్తిపోతలు గోదావరిలో నీటి లభ్యతపై ఆధారపడి ఉంటాయని వివరించారు. ప్రాజెక్టు కట్టల పటిష్టత, కాలువల నిర్వహణ, తూముల మరమ్మతులను నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సరఫరా చేస్తున్న నీరు ఆయకట్టు చివరి భూములకు చేరేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. యాసంగి సాగుపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేయడం కష్టతరంగా మారిందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని పేర్కొన్నారు. రైతులు ఈ పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. యాసంగి సాగుకు సన్నద్ధమయ్యే ముందు నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించి, నీటి లభ్యత, విడుదల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. దేవాదుల పంపుహౌస్ల నిర్వహణను పర్యవేక్షిస్తూ, గోదావరిలో నీటి లభ్యతకు అనుగుణంగా జలాశయాలు, చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న వేసవిలో ఎత్తైన ప్రాంతాల్లో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. పైపులైన్లలో లీకేజీలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సమాచారం కోసం సంప్రదించాల్సిన అధికారులు:

యాసంగికి నీటి విడుదల మరియు ఆయకట్టుకు సరఫరా వివరాలు: సాగునీటికి సంబంధించిన సలహాల కోసం స్థానిక సహాయ ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయిలో కింది అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. బి. అప్పల నాయుడు, జిల్లా నీటిపారుదల అధికారి, ములుగు, ఫోన్: 9704678210 సీహెచ్. శంకరయ్య,కార్యనిర్వాహక ఇంజినీర్, ఏటూరునాగారం, ఫోన్: 9441653031 కె. నారాయణ, కార్యనిర్వాహక ఇంజినీర్, ములుగు, ఫోన్: 9492643623.

దశదినకర్మకు హాజరై కుటుంబానికి పరామర్శ



మంగపేట, అక్టోబర్ 31, మనం ప్రతినిధి: కమలాపురం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా, శనివారం నిర్వహించిన ఆయన దశదినకర్మకు బీఆర్ఎస్ నాయకులు హాజరై నివాళులర్పించారు. శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన సోదరుడు అన్నపురెడ్డి రాణా ప్రతాపరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు ఆదేశాల మేరకు జిల్లా నాయకుడు తాటి కృష్ణ నేతృత్వంలో నాయకులు స్వగృహానికి వెళ్లారు. కష్టకాలంలో కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పుల్సాం పురుషోత్తం, చిట్టిమల్ల సమ్మయ్య, కర్ర రవీందర్, తుక్కాని శ్రీనివాస్, పబ్బోజు సత్యనారాయణ, యలవర్తి శ్రీనివాస్, అంతటి విజయనాగరాజు, జంపాల కర్ణాకర్, పగడాల వెంకట్రెడ్డి, గంగుల శ్రీను, బత్తుల వెంకన్న, దోమల నరసయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు



ములుగు,అక్టోబర్ 31,మనం ప్రతినిధి: భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను ములుగులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో బీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయపాల్ రెడ్డి, ములుగు మండల మాజీ అధ్యక్షుడు చాంద్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరా గాంధీ తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, పేదల సంక్షేమం, మహిళా సాధికారతకు ఆమె చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు సాగిన ఆమె నాయకత్వం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పొడాల ఓం ప్రకాష్, గుంటోజు పావని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాసం రవికుమార్, గుంటోజు శంకరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండెబోయిన రమేష్, ములుగు మండల అధికార ప్రతినిధి బోడ రఘు, కిసాన్ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఇమ్మడి రమేష్, గంది రాజు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఓరుగంటి అనిల్, ప్రధాన కార్యదర్శి మాదారపు రాజు, సయ్యద్ షకీల్ అహ్మద్, గూడెల్లి ఓదెలు, కోగిల రాంబాబు, ఓడ రాజు, నద్దునూరి రమేష్, బొచ్చు సమ్మయ్య, ఆలోత్ దేవ్సింగ్, కక్కర్ల అశోక్ గౌడ్, రవి రెడ్డి, బొంతల వేణు, గుగ్గిళ్ల సుజన్, జాఫర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ సూచన



ములుగు, అక్టోబర్ 31, మనం ప్రతినిధి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం ములుగు పట్టణంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'పాజ్.. థింక్.. వెరిఫై' (ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి) నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులు ఆన్లైన్ ఆర్థిక మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, ఫేక్ వెబ్సైట్లు, అనుమానాస్పద లింకులు, డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి అడిగినా ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని సూచించారు. అత్యవసరంగా డబ్బులు పంపాలని ఒత్తిడి చేసే వ్యక్తుల మాటలు నమ్మకుండా ముందుగా నిజానిజాలను నిర్ధారించుకోవాలని తెలిపారు.

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద సందేశాలు వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా ఆగి, ఆలోచించి, వాస్తవాలను ధృవీకరించుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్లైన్కు ఫోన్ చేయాలని లేదా ఠీఠీఠీ.ఛిఛ్ఛుటఛిటజీఛ్ఛు.జౌఠి.జీఃు వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ దారం సురేష్, ములుగు ఎస్సైద్వో వెంకటేష్, వెంకటాపురం ఎస్సైద్వో చల్లా రాజు, ఎస్ఐలు బుట్ట చంద్రశేఖర్, రుచిత్ర, సాయికృష్ణ, సైబర్ సెక్యూరిటీ ఇన్చార్జి కానిస్టేబుల్ శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్ పావనితో పాటు విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీతక్క ప్రత్యేక చొరవతో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు



- ప్రజల అవసరాలకు తక్షణమే స్పందించే నాయకురాలు మంత్రి సీతక్క
- పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

మంగపేట,అక్టోబర్ 31: మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం, జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన

ములుగు జిల్లా మంగపేట మండలంలోని తిమ్మంపేట ఆవాస ప్రాంతమైన బీసీ కాలనీ కూడలి వద్ద నిర్మించనున్న శ్రీ హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.ఆలయ నిర్మాణానికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ,ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి,వాటి పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేసే ప్రజానాయకురాలు మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అని కొనియాడారు.

బీసీ కాలనీలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన వెంటనే మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు.ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించి ఆలయ నిర్మాణానికి సహకరించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.

గుడి అయినా.. బడి అయినా ప్రజలకు అవసరమైన చోట నిర్మించాలన్నదే మంత్రి సీతక్క ఆలోచనా విధానమని గుమ్మడి సోమయ్య అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.ఈ ఆలయ నిర్మాణం పూర్తయితే బీసీ కాలనీ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారికారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు,గుండు నర్సయ్య, హనుమాన్ గుడి చైర్మన్ చిటమట రాజశేఖర్,తిమ్మంపేట గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర రాజు,గడ్డం పరమేష్,బొంబోతుల మురళి,యగ్గడి అర్జున్,బోడ రామచంద్రం,ముక్కెర రజనీకాంత్,మల్లెల కమలాకర్,రెడ్డి పవన్,వడ్ల సంతోష్,కోటి రామ్,తాటి నరసింహారావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

బుచ్చంపేట అభివృద్ధికి మరో ముందడుగు

- రూ.35 లక్షలతో 7 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం
- మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మంగపేట మండలం అభివృద్ధి పథంలో ముందుకు
- పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య



మంగపేట, అక్టోబర్ 31: మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం, జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన మేరకు ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామంలో ఎస్సీ ఎస్టీఎఫ్ నిధుల ద్వారా మంజూరైన రూ.35 లక్షల వ్యయంతో 7 సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో మంగపేట మండలం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి చర్యలు చేపడుతోందని తెలిపారు.

గ్రామాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు,మురుగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గ్రామాల సమగ్ర అభివృద్ధి,ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారికారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,మండల నాయకులు చిన్నపెల్లి రాంబాబు,గడ్డం శ్రీహరి,గడ్డం పరమేష్,పన్నాల కొండల్ రెడ్డి,రాచకొండ సోమయ్య,ధర్మారపు యాకయ్య,నక్క యాకయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీకి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

ఏటూర్ నాగారం, అక్టోబర్ 31, మనం ప్రతినిధి: భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని ఆమె సమాధి, ఇందిరా గాంధీ స్మారక మ్యూజియం వద్ద ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్, ఏటూరునాగారం టౌన్ యూత్ అధ్యక్షుడు బండారి లక్కీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజుకుమార్, కొండాయి సర్పంచ్ ఆలం నాగార్జున, ఏటూరునాగారం వర్కింగ్ ప్రెసిడెంట్ చైల వినయ్, యూత్ టౌన్ అధ్యక్షుడు గంట ఠాగూర్, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వసాయి, శివపురం ఉపసర్పంచ్ వంగపల్లి రవి యాదవ్, టౌన్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్ల తరుణ్, కన్నాయిగూడెం మాజీ వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, తుపాకులగూడెం ఉపసర్పంచ్ ఆలం నాగార్జున, కుమ్మరి కుమార్, జాడి నరేష్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు ఎకరానికి 50 వేల నష్ట పరిహారం అందించాలి



- జిల్లా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ చర్యలేవి
- ప్రభుత్వం తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

సంగారెడ్డి, అక్టోబర్ 31 మనం న్యూస్ ప్రతినిధి : ఎల్ నినో కారణంగా ఈ ఏడాది వర్షాలు లేక ఎండిన పంటలకు ఎకరానికి 50 వేల నష్ట పరిహారం చెల్లించాలని, ప్రధాన ప్రాజెక్ట్ అయిన సింగూర్ ప్రాజెక్టు అడుగంటడంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందనీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ఈరోజు సంగారెడ్డిలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ సింగూర్లో నీళ్లు అడుగంటిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు కనీసం మంచి నీళ్లు అందించేందుకు ప్రత్యామ్నాయ చర్యలేవని ప్రశ్నించారు. కరువు జిల్లాగా సంగారెడ్డినీ ప్రకటించినా నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. ఎల్ నీనో పై సమగ్ర ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్లాలన్నారు.

రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలిపారు. జిల్లాలో తగినంత వర్ష పాతం నమోదు గాక పంటల తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికే కరువు చాయలు అలుముకున్నాయని పేర్కొన్నారు. రోజు రోజుకు భూగర్భ జలాలు పడిపోతున్నాయని తెలిపారు. తక్షణం ప్రభుత్వం కరువు అంచనా వేసి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితి పై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర కరువు నివేదిక పంపి అత్యవసర ఆర్థిక సహాయం కోరాలన్నారు. ప్రభుత్వ గణాంకాలతో పాటు క్షేత్రస్థాయి వాస్తవాలను ఆధారంగా చేసుకుని సమగ్ర కరువు నివేదిక రూపొందించాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చే అంశంపై అధికారుల వద్ద సరైన స్పష్టమైన సమాచారం ఏదని ప్రశ్నించారు. కరువు ప్రచారంతో రాష్ట్రంలో ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయన్నారు. దళారిగా ఏర్పడి సరుకుల కొరత సృష్టిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రేషన్ పై తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మానిక్, సాయిలు, నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్ రావు, మహిపాల్, లలిత, విద్యా సాగర్, రేవంత్, కృష్ణ తది తరులు పాల్గొన్నారు.

నిజాయితీ ప్రతి ఒక్కరి బాధ్యత



- అవినీతి రహిత సమాజమే మన లక్ష్యం

ములుగు, అక్టోబర్ 31,మనం ప్రతినిధి: విజిలెన్స్ వారోత్సవం-2026 సందర్భంగా అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సత్యనిష్ఠతో సమృద్ధి అనే నినాదంతో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అవినీతి నిరోధక శాఖ (అఇఆ), వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు, సిబ్బందితో అవినీతికి దూరంగా ఉంటూ, విధి నిర్వహణలో నిజాయితీ, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిజాయితీతో, నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ప్రభుత్వ అధికారులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయరాదని సూచించారు. అవినీతి వల్ల సమాజంపై పడే ప్రతికూల ప్రభావాన్ని వివరించారు. అవినీతిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవలు మరియు ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించేలా పనిచేయాలని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా వెంటనే అఇఆ టోల్ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జీ మాట్లాడుతూ, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిజాయితీ మరియు నైతిక విలువలను పాటిస్తూ దేశ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. అవినీతిని నివారించడంలో పారదర్శకమైన పరిపాలన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అక్రమాలకు తావులేని విధానాలు, ఫిర్యాదులపై సత్వర చర్యలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, సంపత్ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఐఫా అవార్డ్స్‌లో
'ధురంధర్' సునామీ..

భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతల జాబితాను నిర్వహకులు అధికారికంగా విడుదల చేశారు. ఈసారి వేడుకల్లో రణ్ వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' చిత్రం ఊహించని రీతిలో రికార్డు సృష్టించింది. టాలెంటెడ్ డైరెక్టర్ ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం ఏకంగా 12 ప్రధాన విభాగాల్లో పురస్కారాలను కొల్లగొట్టి బాలీవుడ్ చరిత్రలోనే సరికొత్త సంచలనం నమోదు చేసింది. మరోవైపు 'సైయారా' చిత్రంతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న అనీత్ పడ్డా ఉత్తమ నటిగా జాతీయ స్థాయిలో వెలిగిపోగా, తొలి సినిమాకే అదరగొట్టిన రాషా తడాని, అహాన్ పాండేలు బెస్ట్ డెబ్యూ అవార్డులతో అందరి దృష్టిని ఆకర్షించారు. సాంకేతిక విభాగాలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కేటగిరీలో 'ఛావా' చిత్రం తన సత్తా చాటుకుంది.

- ఉత్తమ ఎడిటింగ్: శివకుమార్ వి. పనికర్ (ధురంధర్)
- ఉత్తమ కొరియోగ్రఫీ: బాస్కో లెస్లీ మార్టిస్ అవన్ జవాన్ (వార్ 2)
- ఉత్తమ సౌండ్ డిజైన్: బిశ్వదీప్ ఛటర్జీ (ధురంధర్)
- బెస్ట్ సౌండ్ మిక్సింగ్: అలోక్ డే (ఛావా)
- బెస్ట్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఏ ఆర్ రెహమాన్ (ఛావా)
- ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్: అసెంబ్లేజ్ ఎంటర్టైన్మెంట్, రీడిఫైన్ (ఛావా)
- ఉత్తమ తొలి చిత్ర హీరోయిన్: రాషా తడాని - ఆజాద్
- ఉత్తమ హీరో అరంగేట్రం: అహాన్ పాండే (సైయారా)
- ఉత్తమ చిత్రం: ధురంధర్
- ఉత్తమ అంతర్జాతీయ చిత్రం: అవతార్: ఫైర్ యాష్
- ఉత్తమ దర్శకుడు: ఆదిత్య ధర్ (ధురంధర్)
- ఉత్తమ నటి : అనీత్ పడ్డా (సైయారా)
- ఉత్తమ నటుడు: రణ్ వీర్ సింగ్ (ధురంధర్)
- ఉత్తమ సహాయక నటి: హుమా ఖురేషి (జాలీ ఔఔఆ-3)
- ఉత్తమ సహాయక నటుడు: సంజయ్ దత్ (ధురంధర్)
- ఉత్తమ విలన్ : అక్షయ్ ఖన్నా (ధురంధర్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: శాశ్వత్ సచ్‌దేవ్ (ధురంధర్)
- ఉత్తమ ఒరిజినల్ కథ : ఆదిత్య ధర్ (ధురంధర్)
- ఉత్తమ నేపథ్య గాయకుడు : ఫహీమ్ అబ్దుల్లా (సైయారా)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ: వికాష్ నౌలాఖా (ధురంధర్)
- ఉత్తమ స్క్రీన్ ప్లే: ఆదిత్య ధర్ (ధురంధర్)
- ఉత్తమ డైలాగ్స్: ఆదిత్య ధర్ (ధురంధర్)



ఇషాన్ కిషన్‌కు మళ్లీ పరేషాన్!



ఇషాన్ కిషన్.. దూకుడుగా ఆడే బ్యాటర్. వన్ డౌన్ లో కీలక ఇన్నింగ్స్ లు ఆడేస్తాడని పేరు. పవర్ ప్లేలోపలే క్రీజ్ లోకి వస్తే భారీ షాట్లు కొట్టేస్తాడు. ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను నిర్మిస్తాడు. అదే సమయంలో రన్ రేట్ పడిపోకుండా చూస్తాడు. ఇదీ అతడిపై అభిమానులకున్న అంచనాలు. ఇందులో అన్నీ కరెక్టే.. కానీ, అదంతా స్వదేశ పిచ్ లపైనేనా? అనే అనుమానం రాకమానదు. ఎందుకంటే విదేశీ గడ్డపై ఇషాన్ 'బ్యాటింగ్'ను చూస్తే అలానే అనిపిస్తోంది మరి.. ప్రస్తుతం న్యూజిలాండ్ తో టీ20 సిరీస్ కు ముందు భారత్ ఇంగ్లాండ్, ఐర్లాండ్ పొట్టి ఫార్మాట్ లో ఆడింది. ఇప్పుడు కివీస్ పై సిరీస్ ను నెగ్గింది. కానీ, మిగతా రెండు జట్ల చేతిలో ఓటమిపాలైంది. మొత్తం 10 మ్యాచుల్లో ఇషాన్ కిషన్ రెండింట్లో గాయం కారణంగా ఆడలేదు. ఆ మిగతా టీ20ల్లో ఇషాన్ గణాంకాలను గమనించారా..? కివీస్ పై 1, 0.. ఇంగ్లాండ్ పై 56, 4, 13, 49 (40బంతుల్లో).. ఐర్లాండ్ పై 1, 12 పరుగులు చేశాడు. భారత్‌లో మాత్రం దూకుడుగా ఆడేస్తున్నప్పటికీ పరాయి గడ్డపై తేలిపోవడం అభిమానులను కలవరపెడుతోంది. ఈ సంవత్సరం ఇషాన్ మొత్తం 36 టీ20ల్లో 1,159 రన్స్ చేశాడు. కానీ, విదేశాల్లో గత ఎనిమిది ఇన్నింగ్స్ లో 135 పరుగులే చేయగలిగాడు.

సేనా గడ్డపై..

ఇప్పటి వరకు సేనా దేశాలు అంటే.. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా గడ్డపై అతడు కేవలం 10 టీ20 మ్యాచులను మాత్రమే ఆడాడు. చేసిన పరుగులు 177. అంతర్జాతీయ కెరీర్ లో 68 టీ20ల్లో 1,955 పరుగులు చేసిన ఇషాన్ అత్యంత కఠినమైన సేనా పిచ్ లపై దారుణంగా విఫలమయ్యాడు. అక్కడ అతడికి ఒకే ఒక్క అర్ధ శతకం మాత్రమే ఉంది.

ఇలాగైతే.. వరల్ కప్ ల్లో కష్టమే..

భారత్ లోనైతే వచ్చీ రావడంతోనే ఇషాన్ దూకుడుగా ఆడతాడు. అక్కడి పిచ్ లు కూడా బ్యాటింగ్కు అనుకూలం కావడంతో అతడికి తిరుగులేకుండా పోయింది. కానీ, విదేశీ పిచ్ లు మరీ ముఖ్యంగా సేనా దేశాల్లో బౌన్స్ తో సవాల్ తప్పదు. ఇక్కడ షాట్ల ఎంపిక అత్యంత కీలకం. ఇక మైదానం నిడివి కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశమే. ఒకటీ రెండు సిరీస్లు పోయినా పెద్దగా ఇబ్బంది లేదు. కానీ, రాబోయే రెండు ఐసీసీ మెగా టోర్నీలకు 'ఖిఉూఅ' దేశాలే వేదిక. దక్షిణాఫ్రికా - జింబాబ్వే, నమీబియా సంయుక్త ఆతిథ్యంలో వన్డే ప్రపంచ కప్ 2027, ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ హోస్ట్ లుగా టీ20 ప్రపంచ కప్ 2028 టోర్నీ జరగనుంది. తీవ్రమైన పోటీ నేపథ్యంలో.. ఈ రెండింట్లోనూ ఆడాలంటే ఇషాన్ కిషన్ పేస్, బౌన్సీ పరీక్షలను తట్టుకొని నిలబడాలి. కివీస్ తో చివరి మ్యాచ్ తోపాటు అవకాశం వస్తే వన్డే సిరీస్లోనూ సత్తా చాటాలి.

సెమీస్‌లో సింధు



- లక్ష్య, అన్మోల్ కూడా
- హైలో ఓపెన్ బ్యాడ్మింటన్

హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో స్టార్ షట్లర్ పి.వి.సింధు సెమీఫైనల్ కు దూసుకెళ్లింది. శుక్రవారం ఏకపక్షంగా సాగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్ లో సింధు 21-12, 21-10తో అమేలీ షజ్ (జర్మనీ)ను చిత్తుగా ఓడించింది. సింధు మ్యాచ్ను 27 నిమిషాల్లోనే ముగించింది. హోరాహోరీగా సాగిన మరో క్వార్టర్స్ లో అన్మోల్ ఖర్బ్ 21-17, 18-21, 21-16తో ఉన్నతి హుడాపై విజయాన్నందుకుంది. టైటిల్ పోరులో చోటు కోసం సింధు, అన్మోల్ తలపడతారు. పురుషుల సింగిల్స్ లక్ష్య సేన్ కూడా ముందంజ వేశాడు. అతడు 14-21, 21-17, 21-13తో కాల్ కొజోనెన్ (ఫిన్లాండ్)పై నెగ్గాడు. తొలి రౌండ్ కోల్పోయిన తర్వాత లక్ష్య అద్భుతంగా పుంజుకున్నాడు. ప్రత్యర్థి గట్టిపోటీ ఇచ్చినప్పటికీ చివరికి అతడే పైచేయి సాధించాడు.

సుకుమార్ దృష్టిలో పడిన తెలుగమ్మాయి..

రామ్ చరణ్ సరసన జాక్‌పాట్?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, వర్సటైల్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో రాబోతున్న అత్యంత ఆసక్తికరమైన పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'RC17'. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కాంబోలో తెరకెక్కబోతున్న చిత్రం కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు నవంబర్ 1న ప్రారంభం కాబోతున్నట్లు సమాచారం. ఇక గత కొద్ది కాలంగా ఇందులో హీరోయిన్ ఎవరనే దానిపై నెట్టింట రకరకాలు పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. సారా అర్జున్, అనీత్ పడ్డా వంటి పలువురి పేర్లు వినిపించినప్పటికీ, తాజాగా తెలుగమ్మాయి సాత్విక వీరవల్లిని మేకర్స్ ఫైనల్ చేయడం టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది.

అమెరికాలో ఇంజనీరింగ్ పూర్తి చేసి శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ ఉన్న సాత్విక, తన మొదటి సినిమా 'ఆకాశంలో ఒక తార'తో ఇండస్ట్రీకి పరిచయం కాబోతుంది. ఇందులో దుల్కర్ సల్మాన్ సరసన హీరోయిన్ గా కనిపించనుంది. అయితే ఇంకా ఈ సినిమా విడుదల కాకుండానే సాత్విక ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించారు. నటనపై పట్టు ఉన్న నటి కోసం వెతుకుతున్న తరుణంలో, సాత్విక స్క్రీన్ ప్రెజెన్స్ సుకుమార్ ను విశేషంగా ఆకట్టుకుందట. అందుకే ఆమెను తీసుకోవాలని భావిస్తున్నట్లు నెట్టింట వార్తలు వస్తున్నాయి. ఇంకా మొదటి సినిమా థియేటర్లలోకి రాకుండానే రామ్ చరణ్ పక్కన ఛాన్స్ దక్కించుకోవడంతో సాత్విక పేరు సోషల్ మీడియాలో మార్మోగిపోతోంది.





'ఈనగరానికి ఏమైంది-2' ట్రైలర్ అప్డేట్ ఇచ్చిన మేకర్స్

యువతను విపరీతంగా ఆకట్టుకుని కల్ట్ క్లాసిక్ గా నిలిచిన 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఈనగరానికి ఏమైంది-2' . మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పై టాలీవుడ్ లో భారీ అంచనాలు ఉన్నాయి. టాలెంటెడ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో విశ్వక్తో పాటు అభినవ్ గోమఠం, మాగంటి శ్రీనాథ్, వెంకటేష్ కాకుమాను, అనిషా అంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ కీలక పాత్రల్లో అలరించనున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, రూట్ నోడ్ బ్యానర్స్పై సందీప్ నాగిరెడ్డి, సృజన్ ఎరబోలు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులను ముగించుకున్న ఈ చిత్రం నవంబర్ 19న గ్రాండ్ గా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్ల జోరు పెంచిన మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్ డేట్ ఇచ్చారు. 'కొత్త మిషన్ తో బాయ్స్ వస్తున్నారు.. మీ గ్యాంగ్ తో రెడీ అయిపోండి?' అంటూ నవంబర్ 3న ఈ సినిమా ట్రైలర్ విడుదల కానుందని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ తరుణ్ భాస్కర్, ప్రొడ్యూసర్ సందీప్ నాగిరెడ్డి, సినిమాటోగ్రాఫర్ అరోన్, ఎడిటర్ రవితేజలకు సంబంధించిన సరదా ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇక మొదటి భాగం మాదిరిగానే స్నేహం, అల్లరి, సరదా, జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకాలతో నిండిన మరో పిచ్చి ప్రయాణాన్ని ఈ సీక్వెల్ లో చూపించబోతున్నట్లు మేకర్స్ హింట్ ఇచ్చారు. తరుణ్ భాస్కర్ మార్క్ కామెడీ టైమింగ్, విశ్వక్ సేన్ మాస్ ఎనర్జీతో రాబోతున్న ఈ ట్రైలర్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



మళ్లీ సినిమాల్లోకి పవన్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ మళ్లీ వెండితెరపై మెరిసేందుకు సిద్ధమవుతున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్ నగర్ వర్గాలు. ప్రస్తుతం రాజకీయాల్లో ఫుల్లు బిజీగా ఉన్న పవన్ కల్యాణ్, మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రముఖ అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో ఒక భారీ పాన్-ఇండియా సినిమా తెరకెక్కబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం పవన్ కల్యాణ్ ఇప్పటికే దిల్ రాజుకు డేట్స్ కూడా ఇచ్చారనేది ఇండస్ట్రీలో జరుగుతున్న ప్రధాన చర్చ. ఇది పవన్ కల్యాణ్ సినీ కెరీయర్లో 33వ సినిమా కావడం విశేషం. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకత్వం వహించే రేసులో స్టార్ డైరెక్టర్లు అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పవన్ సరసన నటించే కథానాయికలుగా కన్నడ భామ రుక్మిణి వసంత్, గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ పేర్లను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఈ సినిమాకు 'అర్జున' అనే పవర్ ఫుల్ టైటిల్ ను ఖరారు చేయనున్నట్లు సోషల్ మీడియాలో భారీగా ప్రచారం సాగుతోంది. ప్రస్తుతానికి ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే, దిల్ రాజు-పవన్ కల్యాణ్ కాంబోలో మరో భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ సెట్స్ పైకి వస్తుందనే వార్త బయటకు రావడంతో పవర్ స్టార్ అభిమానుల్లో పండగ వాతావరణం నెలకొంది.

అసలు ఏం జరిగిందో తెలియకుండా అంచనాలు వేయకండి.. అనుపమ



యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఒక ఎమోషనల్ పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. కొద్ది రోజుల క్రితం తాను ఒక ప్రేమ వ్యవహారం వల్ల మనశాంతి కోల్పోయి చాలా మానసిక క్షోభ అనుభవించానని చెప్పిన అనుపమ.. తాజాగా మనుషుల ప్రవర్తనలో ఉండే ద్వంద్వ ప్రమాణాలు గురించి వివరిస్తూ ఇన్ స్టాగ్రామ్ లో ఒక సంచలన పోస్ట్ పెట్టింది. ఆమె ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ ఈ పోస్ట్ మాత్రం నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. తన మనసులోని ఆవేదనను బయటపెడుతూ.. మనం ఏదైనా తప్పు చేసినట్లు ఒకప్పుడు మనల్ని ఎందుకు నిందిస్తారో.. అవే పనులు వేరే వాళ్ళు చేసినప్పుడు మాత్రం అన్నీ సాధారణంగా ఎలా మారిపోతాయో చూస్తే ఆశ్చర్యంగా ఉంటుందని పేర్కొంది. మన సంతోషాన్ని బయటికి చెప్పడం, మనల్ని ప్రేమించేవారిని మెచ్చుకోవడం లేదా జీవితంలో చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదించడం కూడా నేరంగా మారుస్తారని, మన ఉద్దేశాలను తప్పుపడుతూ పదే పదే వివరణ ఇచ్చుకునేలా చేస్తారని, ఎలాంటి తప్పు చేయకపోయినా క్షమాపణలు చెప్పేలా భయపెడతారని వాపోయింది.

కానీ, కొద్ది రోజుల తర్వాత అవే పనులు ఎలాంటి మొహమాటం లేకుండా, పబ్లిక్ గా చాలా ఈజీగా చేస్తుంటే చూస్తామని, అప్పుడే రూల్స్ అన్నీ మారిపోతాయని చెప్పింది. అలాగే, అసలు సమస్య మనం ఏం చేశాం అన్నది కాదు, అది ఎవరు చేశారు అనే దాని బట్టే లెక్కలు వేస్తారని అర్థమవుతుందని తెలిపింది. తెర వెనుక అసలు ఏం జరిగిందో ఎవరికీ తెలియదు, కానీ అందరూ తమకు నచ్చినట్లు సొంతంగా అంచనాలు వేసుకుంటారని, అయితే జీవితమే ఒక చిత్రం కాబట్టి దాన్ని మనం ప్రత్యేకంగా ఎవరికీ వివరించాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చింది. ఇక సోషల్ మీడియాలో తాను ఎవరి కామెంట్స్ కు రిప్లై ఇస్తున్నానో పోల్చి చూస్తూ తనకు ట్యాగ్స్ లేదా మెసేజ్ లు పెట్టవద్దని ఆమె కోరింది. తనకంటూ కొన్ని వ్యక్తిగత బాధ్యతలు, పోరాటాలు ఉంటాయని, ప్రైజర్ కోసం సోషల్ మీడియాలో ఎప్పుడూ నటిస్తూ ఉండలేనని అనుపమ స్పష్టం చేసింది. అయితే అనుపమ ఉన్నట్టుండి ఎవరికి వార్నింగ్ ఇచ్చిందంటూ నెట్టింట రకరకాల చర్చలు జరుగుతున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.